

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 147

శనివారం 17-8-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భావోద్వేగానికి పట్టం

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన

ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి

ఉత్తమ నటీమణులు నిత్యామీనన్, మానసీ పరేఖ్

- వివరాలు 12లో

ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం

కార్తికేయ-2


నిత్యామీనన్


మానసి



మోగింది ఎన్నికల భేరీ

జమ్మూకశ్మీర్‌లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతోపాటు హరియాణా శాసనసభ ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది.

- వివరాలు 6లో



మరో మహమ్మారి..!

కోవిడ్ సృష్టించిన మహా విలయం నుంచి ప్రపంచం తేరుకోకముందే ఎంపాక్స్ రూపంలో మరో వైరస్ భూమండలాన్ని చుట్టేస్తోంది.

- వివరాలు 6లో



థాయిలాండ్ పీఠంపై షినవత్ర

థాయిలాండ్ రాజకీయాల్లో షినవత్ర మరో వారసురాలు పేటోంగ్‌టార్న్ షినవత్ర ప్రధాని పీఠాన్ని అధిష్టించడానికి రంగం సిద్ధమైంది.

- వివరాలు 6లో



పారాలింపిక్స్‌కు భారత్ సిద్ధం

పారిస్‌లో ఈ నెల 28 నుంచి జరిగే పారాలింపిక్స్‌లో భాగ్యశ్రీ జాదవ్, సుమిత్ అంటిల్ భారత ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరిస్తారు.

- వివరాలు 13లో

న్యూస్‌రీల్

చెలరేగిన బుల్!



అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 1331 పాయింట్లు పెరిగి 80,437 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 397 పాయింట్లు లాభపడి 24,541 వద్ద నిలిచింది.

- వివరాలు 13లో

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్



గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా నామినేట్ అయిన ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వీరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయించారు.

- వివరాలు 2లో

ఇస్రో అమ్ములపొదిలోకి మరో రాకెట్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది.

- వివరాలు 10లో

హిందువులకు రక్షణ కల్పిస్తాం



బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనారిటీలకు దాడుల నుంచి రక్షణ కల్పిస్తామని తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనుస్ మోదీకి హామీనిచ్చారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



కోర్రీలతో రాష్ట్రంలో లక్షలాది మందికి అందని రుణమాఫీ

ఎస్ఎల్‌బీసీ లెక్కల ప్రకారం పంట రుణాలు రూ. **49,500** కోట్లు

బడ్జెట్‌లో కేటాయించింది రూ. **26,000** కోట్లు

కేబినెట్ లెక్కతేల్చిన సొమ్ము రూ. **31,000** కోట్లు

చివరికి మూడు విడతల్లో కలిపి చేసిన మాఫీ రూ. **17,933** కోట్లే..



ఎన్నికల నుంచి పంద్రాగస్టు దాకా 'తగ్గిపోతూనే' ఉన్న రుణాల లెక్కలు

రుణం తీరలే!

గత ప్రభుత్వంలో 'లక్ష' మాఫీకే 36.68 లక్షల రైతులు.. ఇప్పుడు రూ.2 లక్షల మాఫీకి 22.37 లక్షల మందే!

గతం కంటే రైతుల సంఖ్య పెరగాల్సిందిపోయి.. 14.31 లక్షల మంది తగ్గడమేంటి?

అనుమానాలు వ్యక్తం చేస్తున్న రైతులు, సంఘాల నేతలు, వ్యవసాయ నిపుణులు

మూడో విడత జాబితాలోనూ తమ పేర్లు లేవంటూ అనేకచోట్ల రైతుల ఆందోళన

ఎందుకు రుణమాఫీ కాలేదో తెలియదంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



n Actual and Amount in Crore

GRAND TOTAL	73437.9	49500.84

During the Year, Banks have disbursed Short Term Production Loans amounting t Rs.64,940 crores achieving 88.42% of the annual targets.

2023-24కు సంబంధించి మార్చి 31 వరకు ఎస్ఎల్‌బీసీ పంట రుణాల కింద పెట్టుకున్న లక్ష్యం రూ. 73,437 కోట్లు.. అందులో డిసెంబర్ ఆఖరు నాటికి రూ. 49,500 కోట్లు, మార్చి ఆఖరుకు రూ. 64,940 కోట్లు రైతులకు మంజూరు అయ్యాయి.

వివరాలు 3లో

గవర్నర్‌గా కేసీఆర్.. కేంద్ర మంత్రిగా కేటీఆర్

త్వరలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం.. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

నలుగురు రాజ్యసభ ఎంపీలను బీజేపీలోకి పంపితే కవితకు బెయిల్

ప్రచారం కోసం కాదు పెట్టుబడుల కోసమే విదేశాల్లో పర్యటించా

నా సోదరులు, కుటుంబమే నా బలం.. ముందునుంచే వ్యాపారాలు చేస్తున్నారు

వారికేమైనా పదవులు ఇచ్చానా? ఎందుకు బద్నాం చేస్తున్నారని ప్రశ్న

ఢిల్లీలో మీడియాతో సీఎం చిట్‌చాట్


ఢిల్లీలో ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని.. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే సంప్రదింపులు మొదలుపెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ ప్రాతిపదికన విలీనం జరగాలన్న అంశంపై ఆ రెండు పార్టీలు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చాయని.. కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు కేంద్ర మంత్రి పదవులు ఇవ్వడమే ఒప్పందమని పేర్కొన్నారు. పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లానని.. అక్కడ కలసిన ప్రతి కంపెనీ, ప్రతినిధి పెట్టుబడి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదని చెప్పారు. శుక్రవారం ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ అక్కడ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు సంచలన కామెంట్లు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపైనా స్పందించారు. రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే.. "బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందనుకుంటున్నా. ఈ విషయాన్ని కొన్ని సందర్భాల్లోనే కేటీఆర్ ఖండిస్తున్నారు. వివిధ స్థాయిల్లో బేరసారాలు సాగిస్తున్నారు. రాజ్యసభ కావచ్చు, ఇంకేదైనా కావచ్చు. అంతిమంగా కేసీఆర్ గవర్నర్, కేటీఆర్ కేంద్రమంత్రి, హరీశ్‌రావు లీడర్ ఆఫ్ ది అపోజిషన్..

మిగతా 2వ పేజీలో ▶

ఫోర్త్‌సిటీ ఏర్పాటులో మీ విజన్ అద్భుతం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించిన ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తానని హామీ..పెట్టుబడులకు సానుకూలత

2లో

కోల్‌కతాలో జూనియర్ వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ శుక్రవారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ చౌరస్తాలో వైద్య విద్యార్థుల నిరసన ప్రదర్శన



సహచరులే కీచకులా?

- వైద్యురాలిపై ఘాతుకంలో కొందరు డాక్టర్ల ప్రమేయం
- అనుమానం వ్యక్తం చేసిన బాధితురాలి తల్లిదండ్రులు

6లో

24 గంటలు ఓపీ వైద్యసేవలు బంద్

కోల్‌కతా ఘటనపై ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవల బంద్‌కు ఐఎంఏ పిలుపు

5లో

అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే విధ్వంసం

6లో


శుక్రవారం కురిసిన కుండపోత వర్షంతో మెదక్ పట్టణంలోని ఇండియన్ బ్యాంకు ఎదుట నీటిలో కొట్టుకుపోతున్న బైక్‌లు

నేడు కొన్ని జిల్లాల్లో కుండపోత

హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు

- వారం రోజులు ఎల్లో అలెర్ట్ జారీ...మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- చిగురుమామిడిలో 17.1 సెం.మీ., మెదక్‌లో 12.9 సెం.మీ., కొయ్యూరులో 10.9 సెం.మీ.ల వర్షం

2లో

రేవంత్‌పై చీటింగ్ కేసు పెట్టాలి



వందశాతం రైతు రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే రాజకీయాలను వదిలేస్తా

- రుణమాఫీపై రైతుల దగ్గరకే కాదు.. అవసరమైతే కోర్టుకు కూడా వెళతాం
- రేవంత్ మానసిక సంతులనం దెబ్బతింది..ఆస్పత్రిలో చూపించాలి
- మహిళలపై మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాను: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్ : 'రుణమాఫీ అంటూ రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చీటింగ్‌కేసు నమోదు చేయాలి. కొడంగల్‌లో మీడియా సమక్షంలో వందశాతం రుణమాఫీ జరిగినట్టుగా రేవంత్ నిరూపిస్తే రాజకీయాలను వదిలేస్తా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గాల్లో రుణమాఫీ అంశాన్ని పరిశీలించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. రూ.2లక్షల రుణమాఫీ సంపూర్ణంగా జరగకపోతే అవసరమైతే కోర్టుకు కూడా వెళతాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే కేపీ. వివేకానందలతో కలిసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..'రుణమాఫీపై దగా, మోసం చేసిన రేవంత్ సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి వెళితే చెడుగుడు

మిగతా 3వ పేజీలో ▶

ప్రాంతీయ పార్టీలపై అధ్యయనం

'ఉద్యమ పార్టీగా 24 ఏళ్ల క్రితం ప్రస్థానం ప్రారంభించి పదేళ్లపాటు అధికారంలో కొనసాగాం. ప్రతిపక్షపాత్ర తొలిసారి పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీని మరింత దృఢంగా చేసేందుకు ప్రాంతీయ పార్టీల పనితీరుపై అధ్యయనం చేస్తాం. డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, బిజూజనతాదళ్ వంటి పార్టీల నిర్మాణాన్ని పరిశీలించేందుకు సెప్టెంబర్‌లో నాతోపాటు కొందరు సీనియర్ నేతలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తాం. మంచి ఎక్కడ ఉన్నా సరే స్వీకరించి ఇక్కడ పార్టీ బలోపేతానికి వినియోగించుకుంటాం. ఆర్టీసీలో మహిళల ప్రయాణంపై నేను యథాలాపంగా మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాను. రేవంత్‌కు అదే సంస్కారం ఉంటే అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అసంపూర్తిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

- అధికారుల పరిశీలనతో వెలుగులోకి....
- మరోసారి వివరాల అప్‌లోడ్‌కు అవకాశమిచ్చిన పురపాలక శాఖ
- సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

- వివరాలు 3లో

హైదరాబాద్‌లో మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ టెర్రరిస్ట్ రిజ్వాన్ అలీ.. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు ఫరీదాబాద్ సరిహద్దుల్లో పట్టుబడ్డాడు. రిజ్వాన్ కొన్నాళ్లు హైదరాబాద్‌లోనే తలదాచుకున్నాడని, గజ ఉగ్రవాది, హైదరాబాద్‌కే చెందిన ఫర్హాతుల్లా ఘోరీతో సంప్రదింపుల్లో ఉన్నాడనే విషయాలు కలకలం రేపుతున్నాయి.

నిఘాకు చిక్కకుండా 6 నెలలు గడిపిన రిజ్వాన్



14లో

క్లుప్తంగా...

మంత్రి దామోదరను కలిసిన 317 జీవో బాధిత బృందం

లాలాపేట: జీవో నెంబర్ 317కు చెందిన వివిధ జిల్లాలకు చెందిన పలువురు బాధిత ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయురాళ్ల బృందం శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో 317 జీవో కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు మంత్రికి రాఖీ కట్టి వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. 317 బాధితులమైన తమకు న్యాయం చేయాలని, తమ స్థానికతను బట్టి తమ తమ జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

మంత్రి కొండా సురేఖ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్', ప్రెస్ మీట్‌లలో మహిళలకు క్షమాపణ చెప్పినంత మాత్రాన ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రాయశ్చిత్తం కాదని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ మహిళా సమాజం ముందుకు వచ్చి కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. మహిళలను నోటికొచ్చినట్లు దుర్భాషలాడి.. అవి యథాలాపంగా చేసిన వ్యాఖ్యలంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసి, ప్రెస్ మీట్‌లో మాట్లాడినంత మాత్రాన మహిళా సమాజం ఆ వ్యాఖ్యలను మరిచిపోదన్నారు. బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లో కేటీఆర్ మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చంటూ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. బ్రేక్ డ్యాన్సులకు అలవాటుపడిన వారే ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేటీఆర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మహిళలను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈనెల 24న కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరుకావాలని నోటీసులో పేర్కొంది. ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా, గురువారం పార్టీ సమావేశంలో చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. 'సోదరీమణులకు మనస్తాపం కలిగితే నేను విచారం వ్యక్తం చేస్తున్నాను'అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అక్కా చెల్లెళ్లను కించపరిచే ఉద్దేశం తనకు ఎప్పుడూ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

రేవంత్ భాష జుగుప్సాకరం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రవీందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రూ. 2 లక్షల రుణమాఫీపై మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఖమ్మం జిల్లా పర్యటనలో చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, ఆయన భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి శుక్రవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో రవీందర్‌రావు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ఉద్దేశాలను వివరించకుండా ఉద్యమ నేతలు కేసీఆర్, హరీశ్‌రావును తూలనాడటం సరికాదని హితవు పలికారు. ఆరు గ్యారంటీలు, రూ. 2 లక్షల రుణమాఫీ అమలు ఆగస్టు 15 లోగా పూర్తి చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్ ప్రకటించారని ఎమ్మెల్సీ మధు గుర్తు చేశారు.

'నిజాయితీకి మారు పేరు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి'

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఏపీకి రెండు సార్లు సీఎంగా పని చేసిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నీతి నిజాయితీలకు మారు పేరు అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శుక్రవారం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

మోదీజీ ... ఇంత అహంకారమా?

రాహుల్‌గాంధీకి నాలుగో వరుసలో స్థానమా?: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు హాజరైన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని చివరి వరుసకు పంపడంలో ప్రధాని మోదీ అహంకారం బహిర్గతమైందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. మోదీ వాస్తవ ప్రపంచంలోకి రాలేదని, గుణపాఠం నేర్చుకోలేదని ఈ ఘటనతో తెలుస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షనేతకు ఒలింపియన్ల తర్వాత నాలుగో వరుస సీటు కేటాయించడం సిగ్గుచేటని, ఒలింపియన్లకే గౌరవం ఇచ్చి ఉంటే అమిత్ షా, నిర్మలా సీతారామన్ వంటి కేబినెట్ మంత్రులకు వారికంటే ముందు వరుస సీట్లు ఎలా వస్తాయో ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఇది కేవలం రాహుల్ స్థానానికి మాత్రమే అవమానం కాదని, భారత ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఉభయ సభల ప్రతిపక్ష నేతలు కూడా ముందు వరుసలో కూర్చోవాలని ఆయన పేర్కొన్నారు.

నేడు కొన్ని జిల్లాల్లో కుండపోత

హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు

- వారం రోజులు ఎల్లో అలెర్ట్ జారీ... మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- చిగురుమామిడిలో 17.1 సెం.మీ., మెదక్‌లో 12.9 సెం.మీ., కొయ్యూరులో 10.9 సెం.మీ.ల వర్షం



కామారెడ్డిలో పిల్లల్ని స్కూల్ నుంచి తీసుకువస్తుండగా బైకు అదుపుతప్పి పడిపోయిన దృశ్యం



నిర్మల్‌లోని శాస్త్రినగర్ ప్రధాన రహదారి పక్కన దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో శనివారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వచ్చే వారం రోజులు రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, శుక్రవారం రాత్రి వరకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ఏకంగా 17.1 సెంటీమీటర్ల కుండపోత వర్షం కురిసింది. మెదక్‌లో 12.9 సెంటీమీటర్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూరులో 10.9, కామారెడ్డి జిల్లా పాత రాజంపేటలో 10.8 సెంటీమీటర్లు, సిద్దిపేట జిల్లా శనిగరంలో 10.1 సెంటీమీటర్లు, మెదక్ జిల్లా పాతూరులో 9.4 సెంటీమీటర్లు, జగిత్యాల జిల్లా పూదూరులో 9.2 సెంటీమీటర్లు, కామారెడ్డి జిల్లా బిక్నూరులో 8.8 సెంటీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది.

జడ్చర్ల పట్టణంలో శుక్రవారం రాత్రి వాన దంచికొట్టడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. సిగ్నల్‌గడ్డ - నేతాజీ చౌరస్తా ప్రధాన రహదారిపై వరద పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. హైదరాబాద్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో గంటల కొద్దీ వాహనాలకు రోడ్లపై నిరీక్షణ తప్పలేదు.

మెదక్‌లో భారీ వర్షం

మెదక్‌లో గంటన్నరపాటు ఏకధాటిగా వాన దంచికొట్టడంతో జనజీవనం అతలాకుతలమైంది. పట్టణంలోని ఇండియన్ బ్యాంకు సమీపం, వెంకట్రావునగర్ కాలనీలో రోడ్డుపై రెండు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహించింది. డ్రైనేజీలు ఉప్పొంగి మురుగు నీరు షాపుల్లోకి చేరింది. బయట నిలిపి ఉంచిన బైకులు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మెదక్ జిల్లా కేంద్రంలో 12.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు చెప్పారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పిడుగుపాటుతో ఇద్దరు మృతి చెందారు. కెరమెరి మండల కేంద్రంలోని బారేవాడకు చెందిన చౌదరి రమేశ్(30) వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో, ఆసిఫాబాద్ మండలం నందుప గ్రామానికి చెందిన గొత్రే అంజన్న(20) వ్యవసాయ పనులకు వెళ్లి వస్తుండగా పిడుగుపాటుకు మృతి చెందారు.

ఫోర్త్‌సిటీ ఏర్పాటులో మీ విజన్ అద్భుతం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించిన ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తానని హామీ.. పెట్టుబడులకు సానుకూలత



ఢిల్లీలో శుక్రవారం ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూను సన్మానిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్ రంజన్

సాక్షి, న్యూఢిల్లీ: ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతోపాటు అన్నిరంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్‌కు ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి నగరాన్ని సందర్శిస్తానని తెలిపారు. యంగ్‌లియూ నేతృత్వంలోని ఫాక్స్‌కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను సీఎం రేవంత్ ఫాక్స్‌కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాదిరాయి పడిన హైదరాబాద్‌లో అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగోనగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని సీఎం రేవంత్ వివరించారు. ఫోర్త్ సిటీలో విద్య, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్స్..ఇలా బహుముఖంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతోపాటు అవసరమైన మద్దతు అందజేస్తామని సీఎం ఫాక్స్‌కాన్ చైర్మన్‌కు హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల సీఎం రేవంత్ నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణకొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను మంత్రి శ్రీధర్ బాబు యంగ్‌లియూకి వివరించారు.ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని యంగ్‌లియూ రేవంత్‌ను అభినందించారు. తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తానని.. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ భారత దేశ ప్రతినిధి వీలీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఫాక్స్‌కాన్ చైర్మన్‌కు వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్ రంజన్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి , ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డిలతో పాటు డాక్టర్ ఎస్.కే. శర్మ, బాబ్‌చెన్, జొవ్వా, సూషాకూ, సైమన్‌సంగ్ తదితరులు పాల్గొన్నారు.

'టీపీసీసీ కొత్త అధ్యక్షుడిపై' నిర్ణయం తీసుకోండి

ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షుడి నియామకంపై నిర్ణయం తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను కోరారు. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా తేల్చాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఢిల్లీలో ఖర్గేతో రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పార్టీకి కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు రేవంత్ చెప్పినట్టు సమాచారం. త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపైనా చర్చించినట్టు తెలిసింది. పదవుల భర్తీల్లో భాగంగా, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కూడా అవకాశాలపైనా మంతనాలు జరిపినట్టు సమాచారం. రైతు రుణమాఫీ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించనున్న కృతజ్ఞత సభ, సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై కూడా చర్చించి, ఆహ్వానించినట్టు తెలిసింది. అనంతరం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తోనూ రేవంత్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రేవంత్‌తో సింఘ్వీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వీని ప్రకటించాక మొదటిసారి ఉభయులూ సమావేశమయ్యారు. సెప్టెంబర్ 3న ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. ఈ నెల 21న నామినేషన్ దాఖలు సహా వివిధ అంశాలపై లోతుగా చర్చించినట్టు అభిషేక్ మను సింఘ్వీ ట్వీట్ చేశారు.

గవర్నర్‌గా కేసీఆర్.. కేంద్ర మంత్రిగా కేటీఆర్!

▶ మొదటి పేజీ తరువాయి

ఇది ప్రాధాన్యత క్రమం. కవిత బెయిల్‌కు నలుగురు రాజ్యసభ సభ్యులు (ఫోర్ ఎంపీస్ ఈక్వల్ టు కవిత బెయిల్). నలుగురు బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలను బీజేపీలో చేర్పిస్తే కవితకు బెయిల్ వచ్చే అవకాశం ఉంది.

పెట్టుబడుల కోసమే వెళ్లా..

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లానే తప్ప ప్రచారం కోసం కాదు. ప్రభుత్వం మారింది. కాబట్టి కొత్త ప్రభుత్వం విధానాలు వివరించి పెట్టుబడులు ఆకర్షించేందుకే విదేశాలకు వెళ్లాం. విదేశాల్లో కలసిన ప్రతి ప్రతినిధి పెట్టుబడి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదు. మాది పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులతో పోటీ కాదు. నేను ప్రపంచ స్థాయిలో పోటీపడాలనుకుంటున్నా. అమెరికా, దక్షిణ కొరియా, తైవాన్ తదితర దేశాలు చైనా తర్వాత మరో దేశం కోసం వెతుకుతున్నాయి. వారు చైనా ప్లస్ వన్ ఇండియా అని భావిస్తున్నారు. కానీ చైనా తర్వాత తెలంగాణ అని నేనంటున్నా. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నాను.

ఏపీకి రాజధానే లేదు.. వాళ్లకు అడ్రస్ తెలియదు

మోదీ, చంద్రబాబుల దగ్గర హైదరాబాద్ లేదు. వాళ్లకు అహ్మదాబాద్, విజయవాడ ఉన్నాయి. నా దగ్గర హైదరాబాద్ ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడుందనేది వారికే (బాబుకు) తెలియదు. ఏపీకి రాజధానే లేదు. రాజధాని అడ్రస్ వారికే తెలియదు. చంద్రబాబు నాయుడు నా గురువు కాదు.. నన్ను ఆయన నాయకుడిని చేయలేదు. నేను నాయకుడిని అయ్యాకే టీడీపీలో చేరాను. జిల్లా పరిషత్ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించా. అప్పట్లో టీడీపీ ప్రతిపక్షంలో చాలా బలహీనంగా ఉంది. అలాంటి సమయంలో నేను టీడీపీలో చేరా. అలా ఎలివేట్ అయ్యాను.

విపక్ష నేతల జోలికి వెళ్తే కష్టమే..

విపక్ష నేతలను జైల్లో వేస్తే ఏం జరుగుతుందో చెప్పడానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలే నిదర్శనం. కేసీఆర్ నన్ను జైల్లో వేశారు. ఆయన నౌకరీ పోయింది. వైఎస్ జగన్ చంద్రబాబును జైల్లో వేశారు. ఆయన నౌకరీ పోయింది. ఇది సింపుల్ పాలసీ. దీనిని ఎన్డీయే సర్కారు కూడా అర్థం చేసుకోవాలి.

వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన రోజే అసెంబ్లీలోనే ఆ తీర్పుకు లోబడి నియామకాలు చేపడతామని ప్రకటించాం. సుప్రీంకోర్టు తీర్పును క్షుణ్ణంగా పరిశీలించాలని ఇప్పటికే సంబంధిత మంత్రికి, కమిటీకి సూచించాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. ప్రధాని మోదీ మందకృష్ణ మాదిగను ఆలింగనం చేసుకోవడం తప్ప ఏమీ చేయలేదు. వర్గీకరణను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రాల నిర్ణయమే.

కులగణన చేస్తే తప్పేంటి?

మేం కులగణన చేస్తే తప్పేంటి? ఎవరి శాతం ఎంతో తెలిస్తే వచ్చే నష్టమేంటి? ఎవరు ఎంత శాతం ఉన్నారో తెలిస్తే వారికి అంత రిజర్వేషన్లు లభిస్తాయి. ఇది విద్య, ఉద్యోగాలకు సంబంధించిన విషయం.. రాజకీయ రిజర్వేషన్ల కోసం కాదు. కాంగ్రెస్‌లో వి.హనుమంతరావును మించిన విశ్వాసపాత్రుడు ఎవరూ లేరు. అందుకే ఆయనకు గతంలో మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా అధిష్టానం అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వాళ్లకే పదవులు ఇస్తాం..'' అని రేవంత్ పేర్కొన్నారు.


నా కుటుంబానికి ఏవైనా పదవులిచ్చానా?

సోదరులు, కుటుంబమే నా బలం. వారిపై ఆరోపణలు సరికాదు. నాది పెద్ద ఫ్యామిలీ, మొత్తం 150 మంది ఉన్నారు. అది నా బలం. ప్రభుత్వంలోగానీ, పార్టీలోగానీ వారెవరికీ ఎలాంటి పదవులు ఇవ్వలేదు. వాళ్లు (బీఆర్ఎస్, బీజేపీ) ఎలా నా సోదరులను బద్నాం చేస్తారు? 30 ఏళ్లుగా నా సోదరులు విదేశాల్లో ఉంటున్నారు. కేటీఆర్ 2000వ సంవత్సరంలో విదేశానికి వెళ్లారు. నా సోదరులు 1992, 93లోనే వెళ్లారు. నేను సీఎం కాక ముందు నుంచే అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నేను సీఎం అయ్యానని వాళ్లు చేతులు కట్టుకుని కూర్చోవాలా? ప్రభుత్వంలో, పార్టీలో, ఇంకేదైనా వ్యవహారంలో.. నా సోదరులు, కుటుంబ సభ్యులు తలదూర్చారా? వారికి ఏమైనా పదవులు, బాధ్యతలు ఇచ్చానా? వారి కంపెనీలకు నేను రాయితీలు ఇచ్చానా? సోదరుడు ఆస్ట్రేలియా వెళ్లాడని ఆరోపిస్తున్నారు. డబ్బులున్నాయి. టికెట్ కొనుక్కుని వెళ్లాడు. ప్రభుత్వం డబ్బులు, ప్రోటోకాల్ ఏమైనా తీసుకున్నాడా? పెట్టుబడుల కోసం విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తున్నాం. తెలంగాణ వ్యక్తిని ఆహ్వానిస్తే తప్పేంటి? ఇక కేసీఆర్ సొంతంగా విమానం కొనుక్కోవచ్చు కానీ.. నేను ఖరీదైన చెప్పులు కొనుక్కోవద్దా?

'కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం

కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, కవితకు రాజ్యసభ సీటు ఖాయం

- కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం?
- కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: అతి త్వరలో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం కావడం తథ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని, అందులో భాగంగానే కవితకు బెయిల్ రాబోతుందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని బండి సంజయ్ పేర్కొన్నారు. కవితకు బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనేది న్యాయస్థానం పరిధిలోని అంశమని, కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం? అని ప్రశ్నించారు. ఆమ్‌ఆద్మీ పార్టీని విలీనం చేసుకుంటేనే ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా అని నిలదీశారు. సీఎం పదవిలో కొనసాగుతూ రాజకీయలబ్ధి కోసం రేవంత్‌రెడ్డి న్యాయస్థానంపై బురదచల్లి కోర్టుల ప్రతిష్టను తగ్గించడం దుర్మార్గమన్నారు. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కేంద్రమంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయమని, ప్రజలు ఛీత్కరించిన ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని, అతి త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యమన్నారు. కేసీఆర్‌ను ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కేటీఆర్‌ను పీసీసీ చీఫ్‌గా, హరీశ్‌రావుకు మంత్రిపదవి ఇవ్వడంతోపాటు, కవితకు రాజ్యసభ పదవి ఇవ్వడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులకు అంత ఉబలాటముంటే రాజ్యసభ ఎన్నికలొస్తున్నందున కవితను కాంగ్రెస్ పక్షాన రాజ్యసభకు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. గతంలోనూ బీఆర్ఎస్‌తో మంత్రి పదవులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. అందుకే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్‌ట్యాపింగ్ సహా అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీనే కాపాడుతోందని సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ దాగుడు మూతల వ్యవహారం జగమెరిగిన సత్యమని 'నువ్వు కొట్టినట్లు చెయ్... నేను ఏడ్చినట్లు చేస్తానన్నట్లుంది' కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల తీరు అని విమర్శించారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్

మండలి చైర్మన్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం



మండలి చైర్మన్ గుత్తాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోదండరాం, అమీర్ అలీఖాన్. చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా నామినేట్ అయిన ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్ చాంబర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా అభినందించడంతోపాటు వారికి గుర్తింపు పత్రం, మండలి నియమావళిని అందజేశారు. అనంతరం మండలి చైర్మన్, మంత్రులతో కలసి కోదండరాం, అమీర్ అలీఖాన్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తాజాగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

'కోదండరాంకు మంత్రి పదవి ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన గుర్తింపునిచ్చిందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక అన్నారు. కోదండరాం ఎమ్మెల్సీగా ఎన్నికవడం పట్ల యావత్ రెవెన్యూ ఉద్యోగుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి, మిగతా మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కోదండరాంకు మంత్రి పదవి కూడా ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. రాష్ట్రంలోని యువకులు, విద్యార్థులు, మహిళలు, ఇతర అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక, స్థితిగతులు తెలిసిన మేధావి కోదండరాం అని పేర్కొన్నారు.

మంత్రి సీతక్క విజ్ఞప్తికి కేంద్రం సానుకూలత

67 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి అనుమతులు మంజూరు



సాక్షి, హైదరాబాద్: ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న మారుమూల ఆవాస గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని మంత్రి సీతక్క చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తొలి విడతలో 28 ఆవాస గ్రామాలకు 66.97 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ లేఖ పంపింది. జూన్ 22న మంత్రి సీతక్క కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమై పీఎం జన్మన్ పథకం ద్వారా ఆవాస గ్రామాల రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందనగా... ఆయా గ్రామాలకు రహదారుల నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పంచాయతీరాజ్ శాఖకు సమాచారం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఊహాజనితం

ఇది కాంగ్రెస్ విషప్రచారం..


దీనిపై బీజేపీలో ఎలాంటి చర్చ లేదు: ఎంపీ ఈటల



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఊహాజనితం, అది జరగదు'అని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. 'ఇది కాంగ్రెస్ విషప్రచారం. బీజేపీలో అలాంటి చర్చ లేదు. దీనిపై పార్టీలో ఎలాంటి ప్రస్తావన లేదు'అని తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అవుతుందని ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈటల స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రుణమాఫీ పూర్తిగా జరిగిందని ప్రభుత్వం ప్రకటించడం బక్వాస్, బుకాయిస్తున్నారు'అని మండిపడ్డారు. 'అబద్ధపు ప్రచారంతో రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రుణమాఫీ పూర్తిగా కాలేదని దమ్ముంటే ఒప్పుకోవాలి. బ్యాంకర్ల లెక్కల ప్రకారం రూ.72 వేల కోట్ల వరకు రుణమాఫీ చేయాల్సి ఉండగా.. ఎన్నికల ముందు రేవంత్ రూ.63 వేల కోట్లు అని హామీఇచ్చారు. విధివిధానాల పేరుతో ఆ మొత్తాన్ని రూ.34 వేల కోట్లకు కుదించారు. ఇప్పుడు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసి, పూర్తి చేశామని చెప్పుకుంటున్నారు. ఒక్క ఘట్‌కేసర్ సొసైటీలోనే 1,200 మంది రైతులకు రూ.9 కోట్ల రుణాలలో ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. కానీ వందలకోట్ల ప్రజాధనంతో కేసీఆర్ తరహాలోనే ప్రచారాలు చేసుకుంటున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు'అని ఈటల ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం, ఉన్నతాధికారులు హంగామా చేస్తున్నారని ఆయన విమర్శించారు. 'హైడ్రా పేరుతో జరుగుతున్న డ్రామా ఆపాలి. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పట్టాభూముల్లో నిర్మాణాలు కూల్చవద్దు. నీళ్లు రాకుండా ఏర్పాటు చేయాలి. చిత్తశుద్ధి ఉంటే ఇకపై నిర్మాణాలు జరగకుండా చూడాలి. అక్రమకట్టడాల విషయంలో కఠినంగా ఉంటాం అని చెప్పుకుంటున్నారు. వాళ్లు ఏమి చేస్తున్నారో ఆ చిట్టా మా వద్ద ఉంది. డ్రామాలు ఆపితే మంచిది'అని ఈటల రాజేందర్ హెచ్చరించారు.


రక్షాబంధన్ కార్యక్రమానికి గవర్నర్‌కు ఆహ్వానం: ఈనెల 18న ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఉప్పల్ భగాయత్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న రక్షాబంధన్ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఈటల రాజేందర్ ఆహ్వానించారు.

కేటీఆర్, హరీశ్‌రావు ఫ్రస్టేషన్‌లో ఉన్నారు: యెన్నెం



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చొని కొత్త వేషంలో ప్రజలను ఎలా మోసం చేయాలని ఆలోచిస్తున్నారని, కాంగ్రెస్ ఏ మంచి పని చేసినా హరీశ్‌రావు, కేటీఆర్ బరితెగించి విషం చిమ్ముతున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్, హరీశ్‌రావు ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 8 నెలల నుంచి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. హరీశ్‌రావు దేవుడి పేరు చెప్పి శాపనార్థాలు పెడుతున్నారని, తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకు తిన్న వీళ్లు దేవుడి పేరు తీసుకోవడం విడ్డూరంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. అపరిచితుడు సినిమాలో ఉండే శిక్షలు, నరకంలో ఉండే శిక్షలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు పడాలన్నారు. కేటీఆర్ మహిళల మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయనకు ఏం సంస్కారం నేర్పారని ప్రశ్నించారు. కేటీఆర్ ఆంధ్రలో చదువుకున్నందున అక్కడి రికార్డింగ్ డ్యాన్సులు వంటపట్టి ఉండొచ్చని ఎద్దేవాచేశారు. రికార్డింగ్ డ్యాన్స్‌లు తెలంగాణ సంస్కృతి కాదన్న విషయం కేటీఆర్ తెలుసుకోవాలని శ్రీనివాస్‌రెడ్డి హితవు పలికారు. హరీశ్‌రావు ఇరిగేషన్ శాఖమంత్రిగా ఉండి అన్ని అవినీతి ప్రాజెక్టులు కట్టారని ఆరోపించారు. తెలంగాణకు కేటీఆర్, హరీశ్‌రావు దిష్టి చుక్కలుగా మిగిలిపోయారన్నారు.

రూ. 49,500 కోట్లు


SLBC TELANGANA

Name of the Bank	CROP Target	CROP Achievement
GRAND TOTAL	73437.9	49500.84


గత ఏడాది డిసెంబర్ నాటికి ఇచ్చిన వ్యవసాయ రుణాలపై బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) లెక్క

రూ. 31,000 కోట్లు



జూన్ 21న కేబినెట్ భేటీ తర్వాత రైతులకు చేసే రుణమాఫీపై సీఎం రేవంత్ స్వయంగా చెప్పిన లెక్క ఇది. జూలై 18న సచివాలయంలో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభిస్తూ.. మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

రూ. 26,000 కోట్లు



బడ్జెట్‌లో రైతులకు పంట రుణాల మాఫీ కోసం కేటాయించిన మొత్తం ఇది. ఇందులో నేరుగా 15,470 కోట్లు చూపగా.. మరో రూ.7,410 కోట్లను ఎస్సీ ఫండ్ కింద, రూ.3,120 కోట్లను ఎస్టీ ఫండ్ కింద కేటాయించారు

రూ. 17,933.18 కోట్లు

మొదటి విడతలో రూ.6,098.93 కోట్లు, రెండో విడత రూ.6,190.01 కోట్లు, మూడో విడత రూ.5,644.24 కోట్లు కలిపి మొత్తంగా రూ.17,933.18 కోట్లు రుణ మాఫీ చేశారు

అలా అలా తగ్గిపోతూనే...

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) లెక్కల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం 2023–24 మార్చి 31 నాటికి రైతులకు ఇచ్చిన మొత్తం పంట రుణాలు రూ.64,940 కోట్లు. ఇందులో డిసెంబర్ నాటికి ఇచ్చిన రుణాలు రూ.49,500 కోట్లు. ఆ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక కసరత్తు చేపట్టి.. రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవుతాయని ప్రాథమిక అంచనా వేసింది. కానీ మంత్రివర్గ సమావేశంలో రూ.31 వేల కోట్లుగా నిర్ణయించింది. బడ్జెట్ కేటాయింపులకు వచ్చేసరికి ఈ 'లెక్క' రూ.26 వేల కోట్లకు తగ్గిపోయింది. చివరికి రుణమాఫీ మూడు విడుతల్లో కలిపి రూ. 17,933 కోట్లు విడుదల చేసింది.

రుణం తీరలే..

కొర్రీలతో రాష్ట్రంలో లక్షలాది మందికి అందని రుణమాఫీ


ఈ ఫోటోలో కనిపిస్తున్న యువరైతు పేరు జిల్ల మహేశ్. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం తొండకూర్ గ్రామం. 2017లో కుద్వాన్‌పూర్ స్టేట్ బ్యాంకులో రూ. 1.10 లక్షలు రుణం తీసుకున్నారు. అర్హత ఉన్నా ఇంతవరకు రుణమాఫీ జరగలేదు. మూడో విడతలోనూ పేరు రాలేదు. కారణమేంటని వ్యవసాయ అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబ నిర్ధారణ కాలేదని సమాధానం ఇచ్చారు. విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. అంటే ఇక తన బ్యాంకు రుణం తీరనట్టేనా? అని ఆయన ఆందోళనలో పడిపోయారు.


ఈయన పేరు పాతకుంట వెంకటరెడ్డి. నల్లవెల్లి గ్రామం, నిజామాబాద్ జిల్లా. ఒకే రేషన్‌కార్డుపై ఉన్న వెంకటరెడ్డికి, ఆయన తల్లికి నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో రూ.1.40 లక్షల పంట రుణం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మూడో విడత రుణమాఫీ జాబితాలోనూ ఆయన పేరు రాలేదు. అర్హత ఉన్నా మాఫీ ఎందుకు కాలేదని అధికారులను అడిగితే సమాధానమేదీ రావడం లేదని ఆయన వాపోతున్నారు.


నల్లగొండలోని గొల్లగూడకు చెందిన జక్కుల యాదయ్య.. 2022 మార్చిలో రూ.99 వేలు రుణం తీసుకున్నారు. 2023 మార్చిలో రూ.6,800 వడ్డీ చెల్లించి రుణాన్ని రెన్యువల్ చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో రూ.7 వేల వడ్డీ చెల్లించి మళ్లీ రెన్యువల్ చేయించుకున్నారు. నిజానికి యాదయ్యకు తొలివిడతలోనే రుణమాఫీ జరగాల్సి ఉన్నా.. జాబితాలో పేరు రాలేదు. దీంతో నల్లగొండ వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. వెబ్‌సైట్‌లో బ్యాంకు వివరాలు లేవని అధికారులు చెప్పారు. దీనితో యాదయ్య బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకెళ్లి ఇచ్చారు. అయినా మాఫీ కాలేదు.


సూర్యాపేట జిల్లా ఏపూరుకు చెందిన మున్నా ముత్తిలింగం ఏపీజీవీ బ్యాంకులో 2023లో రూ.64 వేల రుణం తీసుకున్నారు. మార్గదర్శకాల ప్రకారం ఆయనకు రుణమాఫీకి పూర్తి అర్హత ఉంది. ఆయన కుటుంబంలో ఎవరికీ బ్యాంకులో రుణాలేవీ లేవు. అయినా మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు.


జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఇప్పగూడెంకు చెందిన పిట్ల రాజేందర్‌కు రూ.1.10 లక్షల వ్యవసాయ రుణం ఉంది. రుణమాఫీ జాబితాలో ఆయన పేరు రాలేదు. ఇదేమని వ్యవసాయ అధికారులను అడిగితే రేషన్‌కార్డు సమస్య అని చెప్పారు. రాజేందర్‌కు ఐదేళ్ల క్రితమే వివాహమైంది. విడిగా తన కుటుంబానికి కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనితో అధికారులు తల్లిదండ్రులతో ఉన్న రేషన్‌కార్డులోంచి ఆయన పేరును తొలగించారు. కొత్త కార్డు మాత్రం జారీ కాలేదు. దీనితో రుణమాఫీ కాలేదు.

-సాక్షి, హైదరాబాద్


...వీరే కాదు.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు తమకు రుణమాఫీ జరగలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు లేవని, గతంలో జరిగినట్టుగానే చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా.. తమకెందుకు రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తున్నారు. అటు బ్యాంకుల చుట్టూ, ఇటు వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూ.. తమకు రుణమాఫీ కాకపోవడానికి కారణాలేమిటని నిలదీస్తున్నారు. ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్... ఇప్పుడు ఏవేవో కొర్రీలు పెడుతూ మాఫీ చేయకపోవడం ఏమిటంటూ మండిపడుతున్నారు.

మాఫీ సొమ్ము తగ్గిందెందుకు..?

ఏటా బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య, రుణాల సొమ్ము పెరుగుతూనే ఉన్నాయి. కానీ ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతుల సంఖ్య, సొమ్ము భారీగా తగ్గిపోవడం ఏమిటనే అనుమానాలు వస్తున్నాయి. ఆర్థిక భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టిందని రైతులు, సంఘాల నేతలు మండిపడుతున్నారు. గత ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలో రైతులు తీసుకున్న రుణాల మొత్తంతో పోలిస్తే.. మాఫీ చేసినది మూడో వంతు మేర మాత్రమే ఉండటం ఏమిటని నిలదీస్తున్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) లెక్కల ప్రకారం.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రైతులకు రూ.64,940 కోట్ల పంట రుణాలు ఇచ్చాయి. ఆ ఏడాది డిసెంబర్ వరకే లెక్కలోకి తీసుకుంటే.. రూ.49,500 కోట్ల రుణాలు ఇచ్చాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తంగా మూడు దశల్లో కలిపి 22.37 లక్షల మందికి.. మొత్తంగా రూ. 17,933 కోట్లు బ్యాంకుల్లో జమ చేసింది. దీనిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నిరకాల అర్హత ఉన్నప్పటికీ కొందరికి రుణమాఫీ ఎందుకు జరగలేదో తమకు కూడా అంతుబట్టడంలేదని వ్యవసాయశాఖ వర్గాలే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

ఏటేటా పెరుగుతూపోతున్న రుణాలు

రైతులకు ఇస్తున్న పంట రుణాలు ఏటేటా పెరుగుతున్నట్లు ఎస్ఎల్‌బీసీ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2014–15లో రూ.17,019 కోట్లు పంట రుణాలు ఇవ్వగా.. 2023–24కు వచ్చే సరికి రూ.64,940 కోట్లకు పెరిగాయి. గత ప్రభుత్వ హయాంలోని లెక్కలను చూసినా.. 2014–18 మధ్య 36.68 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ కోసమే రూ.19,198 కోట్లు అయినట్టు లెక్క తేల్చారు. అలాంటిది ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి అర్హుల సంఖ్యను 22.37 లక్షలకు, మాఫీ సొమ్మును రూ.17,933 కోట్లకే పరిమితం చేయడం వెనుక మాయ ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి.



కొన్ని ప్రాంతాల్లో రుణమాఫీ పరిస్థితి ఇదీ

- నల్లగొండ జిల్లాలో తమకు రుణమాఫీ కాలేదంటూ వ్యవసాయ శాఖకు ఇప్పటివరకు 4 వేలకుపైగా ఫిర్యాదులు అందాయి.
- జనగామ జిల్లా కేంద్రం యూనియన్ బ్యాంక్ బ్రాంచీలో రుణాలు తీసుకున్న లింగాల ఘణపురం, రఘునాథపల్లి, జనగామ, దేవరుప్పుల తదితర మండలాలకు చెందిన 317 మంది రైతుల పేర్లు జాబితాలో లేవు.
- జగిత్యాల జిల్లాలో గల్ఫ్ వెళ్లిన కుటుంబాల్లో చాలా వరకు రుణమాఫీ అందలేదు. కలెక్టరేట్‌లో ఇప్పటివరకు 1,145 మంది మాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు.
- కామారెడ్డి జిల్లాలో రుణమాఫీ రాలేదంటూ 2,898 ఫిర్యాదులు వచ్చాయి. ఆధార్, బ్యాంక్ ఖాతాల్లో పేర్లు వేర్వేరుగా ఉన్న 1,127 మంది అర్జీ పెట్టుకున్నారు.

ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి విడుదల చేసిన నిధులు, రైతుల వివరాలివీ..

విడత	రైతుల సంఖ్య	రుణమాఫీ సొమ్ము (కోట్లు)
మొదటి విడత	11,50,193	6,098.93
రెండో విడత	6,40,823	6,190.01
మూడో విడత	4,46,832	5,644.24
మొత్తం	22,37,848	17,933.18

పారదర్శకంగా రుణమాఫీ జరగడం లేదు

రైతు రుణమాఫీ అందరికీ కావడం లేదు. రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనలతో అర్హులను తగ్గిస్తూ వచ్చారు. బ్యాంకు ఖాతాలు కూడా పెరిగాయి. గత వ్యవసాయ సీజన్ నాటికే 60 లక్షల రైతు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. అలాంటిది ఇప్పుడు ఇంత తక్కువ మంది ఎలా ఉంటారు? పారదర్శకంగా రుణమాఫీ జరగడం లేదు. ఇచ్చామని మభ్యపెడుతున్నారు. బ్యాంకులు, ప్రభుత్వం రైతుల వాస్తవ రుణమాఫీ డేటాను దాస్తున్నాయి. ఎంత అప్పుంది? ఇంత తీర్చారన్నది స్పష్టంగా చెప్పడం లేదు. ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడం కోసం కొర్రీలు పెడుతున్నారు. ఎవరికి, ఎందుకు రుణమాఫీ జరగలేదో స్పష్టత నివ్వడం లేదు.

– దొంతి నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణుడు



మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వివేకానంద

రేవంత్‌పై చీటింగ్ కేసు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఆడటం ఖాయం. రుణమాఫీ పేరిట కాంగ్రెస్ అతిపెద్ద మోసం చేసింది. రుణమాఫీకి తొలుత రూ.40వేల కోట్లు అవసరమని ప్రకటించడం, ఆ తర్వాత రూ.31వేల కోట్లు కావాలని కేబినెట్ తీర్మానించడం, బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు ప్రతిపాదించడం, చివరకు 22లక్షల మందికి రూ.17,934 కోట్ల మేర మాత్రమే మాఫీ చేయడం రైతులను మోసగించడమే.

ప్రచార ఆర్భాటమే.

'రుణమాఫీలో నిబంధనల పేరిట కోతలు విధించి చిల్లర ప్రచారంతో రేవంత్ రంకెలు వేస్తూ హరీశ్‌రావు రాజీనామా చేయాలంటున్నాడు. కేవలం 46శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. రేవంత్ చేస్తున్న మోసాలకు గిన్నిస్ బుక్ నిర్వాహకులు కూడా ఆశ్చర్యపోతున్నారు. రేవంత్ ప్రసంగం ఆయన అసహనానికి అద్దం పడుతోంది. ఇటీవలి కాలంలో ఆయన చేస్తున్న ప్రసంగాలు, వాడుతున్న భాష చూస్తే రేవంత్ మానసిక సంతులనం దెబ్బతిన్నట్టుగా కనిపిస్తోంది. రేవంత్ కుటుంబసభ్యులు ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళితే మంచిది. రుణమాఫీ అయ్యిందంటూ కొంతమంది చిల్లరగాళ్లు పోస్టర్లు పెట్టారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాలు చేసినట్టుగా సంపూర్ణ రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు జరిగిందా. సాక్షాత్తూ సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్రం దివాలా తీసిందని చెబుతుండటంతో పెట్టుబడులు తరలివెళుతున్నాయి. ఎన్నికల హామీలు నెరవేర్చని రేవంత్ ఎనిమిదినెలల కాలంలో 19 సార్లు ఢిల్లీకి వెళ్లాడు. ఇంకా ఎన్నిసార్లు వెళ్లాల్సి వస్తుందో కూడా తెలియదు.



నల్లగొండ రైల్వే స్టేషన్‌లో రైలు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులను సముదాయిస్తున్న రైల్వే పోలీసులు

రైలులో వసతులు లేవని ప్రయాణికుల నిరసన

నల్లగొండలో అరగంటపాటు నిలిచిన రైలు

నల్లగొండ క్రైం: శ్రీకాకుళం నుంచి నాందేడ్ వెళ్తున్న స్పెషల్ ట్రైన్ (నెంబర్ 074788)లో కనీసం తాగునీరు లేదని, బుకింగ్‌లో భోజనం, చిన్నారులకు పాలు తీసుకునే అవకాశం లేదని ప్రయాణికులు ఆందోళన చేశారు. పైగా రైలు రెండు గంటలు ఆలస్యంగా నడవడంతో అసహనానికి గురైన ప్రయాణికులు నల్లగొండ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం 30 నిమిషాలపాటు రైలు ఇంజన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్పెషల్ ట్రైన్ కావడంతో క్రాసింగ్‌ల వద్ద ఎక్కువసేపు నిలపడంతో పాటు తాగునీరు, ఆహారం సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రైలు నల్లగొండ స్టేషన్‌కు ఉదయం 10.50కు వచ్చి క్రాసింగ్ వద్ద నిలిచింది. ప్రయాణికులు 11.20 గంటల వరకు ఆందోళన చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సురేందర్‌గౌడ్ వచ్చి ప్రయాణికులతో మాట్లాడారు. ఎక్కడా క్రాసింగ్‌ల వద్ద నిలపకుండా సికింద్రాబాద్ వరకు రైలు సాఫీగా వెళ్లేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ప్రయాణికులు శాంతించారు. మధ్యలో ఎక్కడైనా ప్రయాణికులు నిరసన చేపడతారేమోనని భావించిన రైల్వే పోలీసులు.. ఒక కానిస్టేబుల్‌ను ప్రయాణికులతో సికింద్రాబాద్ వరకు పంపించారు.

రుణమాఫీతో దేశ రైతుల చూపు తెలంగాణ వైపు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీతో దేశంలో రైతాంగం తెలంగాణ వైపు చూస్తోందని కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్షం పేర్కొంది. రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎల్పీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో వారు మాట్లాడుతూ...ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు బాంధవుడిగా సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రకెక్కారన్నారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ రుణమాఫీ అవుతుందని స్పష్టం చేశారు. బడ్జెట్లో వ్యవసాయానికి రూ.73 వేల కోట్లు కేటాయించి రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారని తెలిపారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచినట్లు చెప్పారు. ఏ ముఖం పెట్టుకుని రుణమాఫీపై హరీశ్‌రావు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. హరీశ్‌రావు మాట మీద నిలబడి రాజీనామా చేస్తారా లేక తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాస్తారో తేల్చుకోవాలన్నారు.

రుణ మాఫీపై పెద్దసంఖ్యలో ఫోన్లు వస్తున్నాయి: గుజ్జుల

సాక్షి, హైదరాబాద్: తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు రైతు రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులనుంచి పెద్దసంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సహాయ కేంద్రానికి వినతులు, ఫిర్యాదులు అందుతున్నాయని తెలియజేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ, రైతుభరోసా అందని రైతులు 8886100097 నంబర్‌తో పాటు 9240015247 నంబర్‌కు డయల్ చేసి వారి ఫిర్యాదులను తెలియజేయాలని కోరారు.

అరకొర రుణమాఫీ.. ఆపై దుర్భాషలా?

రూ.17వేల కోట్లతో పూర్తి రుణమాఫీ ఎలా సాధ్యం: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరకొరగా అమలు చేసిందని ఇదే విషయాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై సీఎం నోరు పారేసుకుని దుర్భాషలాడతారా అని బీఆర్ఎస్ మాజీమంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ నేత ఇంతియాజ్ ఇషాక్‌తో కలసి నిరంజన్‌రెడ్డి శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ తోపాటు ఆరు గ్యారంటీలను రేవంత్ చెప్పిన గడువులోగా అమలు చేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ అన్నారని అయితే రేవంత్ మాత్రం రుణమాఫీ అమలు పూర్తయిందని దబాయిస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులందరికీ రూ.31వేల కోట్ల రుణమాఫీ జరుగుతుందని చెప్పి, ప్రస్తుతం రూ.17వేల కోట్లకే ఎందుకు పరిమితం చేశారని నిలదీశారు. రాష్ట్రంలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన హరీశ్‌రావును రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. రుణమాఫీపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఇప్పటివరకు 1,11,027 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు.

4,28,832
ఇప్పటివరకు పరిశీలించిన దరఖాస్తులు

60,213
ఇప్పటివరకు ఆమోదం పొందినవి

అసంపూర్తిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

- అధికారుల పరిశీలనతో వెలుగులోకి....
- మరోసారి వివరాల అప్‌లోడ్‌కు అవకాశమిచ్చిన పురపాలక శాఖ
- సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తుల్లో అన్ని డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయనివారు 75శాతం మంది దాకా ఉన్నారు. అధికారులు దరఖాస్తులు పరిశీలించే క్రమంలో ఈ విషయం వెలుగుచూసింది. 2020 ఆగస్టు 26కు ముందు ఉన్న అక్రమ లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. రూ.1,000 ఫీజుగా చెల్లించి దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే వివిధ కారణాల వల్ల ఎల్ఆర్ఎస్ ప్రక్రియ అప్పట్లో అర్ధాంతరంగా నిలిచిపోయింది. కాగా గత డిసెంబర్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 2020 నాటి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడంతో జనవరి నుంచి దరఖాస్తుల పరిశీలన మొదలైంది.

అరకొరగానే అప్‌లోడ్

దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్‌లు అప్పట్లో అప్‌లోడ్ చేయలేదు. మొత్తంగా 75 శాతం అసంపూర్తి దరఖాస్తులే అందజేశారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, లే అవుట్ కాపీలు, ఇతర పత్రాలు అప్‌లోడ్ చేయకుండా వచ్చిన దరఖాస్తులను పక్కనబెడుతూ అధికారులు దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. ఇప్పటి వరకు 4,28,832 దరఖాస్తులను పరిశీలించగా, వాటిలో కేవలం 60,213 దరఖాస్తులు మాత్రమే ఆమోదించినట్టు పురపాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తెలిపారు. తద్వారా రూ.96.60 కోట్లు ఫీజు రూపంలో వసూలైనట్టు చెప్పారు. పరిశీలించిన దరఖాస్తుల్లో 75 శాతం పూర్తిస్థాయి డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల వాటిని ఆమోదించడం లేదని దరఖాస్తుదారులకు చెప్పారు. షార్ట్‌ఫాల్స్ వివరాలను కూడా దరఖాస్తుదారులకు తెలియజేశారు.

మరోసారి అవకాశం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడానికి పురపాలకశాఖ మరో చాన్స్ ఇచ్చింది. దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయడానికి, మున్సిపాలిటీ/కార్పొరేషన్/నగరాభివృద్ధి సంస్థల నుంచి అధికారిక షార్ట్ ఫాల్స్ లెటర్ కోసం వేచిచూడకుండా పూర్తిస్థాయి డాక్యుమెంట్లను ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని సేల్‌డీడ్, ఈసీ, మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికెట్, లేఅవుట్ కాపీ వంటి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయవచ్చు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్, చిరునామా లేదా ఇతర దరఖాస్తు వివరాలను మొబైల్ నంబర్ ఓటీపీని వినియోగించుకొని ఈ పోర్టల్ ద్వారా సవరించుకోవచ్చునని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తెలిపారు. ఇందుకోసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగరాభివృద్ధి సంస్థలతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఏవైనా సందేహాలుంటే తీర్చుకోవడానికి లేదా వివరాల కోసం ఈ హెల్ప్‌డెస్క్‌లను సందర్శించవచ్చునని తెలిపారు.

ఈ సమస్త విశ్వమూ దేనిలోనైతే విహితమై వుంటుందో
ఆ పరమ తేజోమయ బ్రహ్మధామాన్ని విశుద్ధ అంతఃకరణం
గల వ్యక్తి తెలుసుకోగలుగుతాడు.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 17 ఆగస్టు 2024

ఎట్టకేలకు కశ్మీర్‌ ఎన్నికలు

పదేళ్లుగా అసెంబ్లీ ఎన్నికలూ...దాదాపు ఆరేళ్లనుంచి ప్రజా ప్రభుత్వం జాడా లేని జమ్మూ–కశ్మీర్‌లో ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. వచ్చే నెల 18, 25, అక్టోబర్‌ 1 తేదీల్లో మూడు దఫాలుగా ఈ ఎన్నికలుంటాయని ఎన్నికల సంఘం(ఈసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ సెప్టెంబర్‌ 30లోగా అక్కడ ఎన్నికలు నిర్వహించి తీరాలని సుప్రీంకోర్టు నిరుడు డిసెంబర్‌లో ఇచ్చిన ఆదేశాల పర్యవసానంగా ఈ ప్రకటన తప్పలేదు. జమ్మూ–కశ్మీర్‌ ఆఖరి దశ ఎన్నికలతోపాటే... అంటే అక్టోబర్‌ 1న హరియాణా అసెంబ్లీకి కూడా ఎన్నికలుంటాయి. రెండుచోట్లా ఎన్నికల ఫలితాలు అక్టోబర్‌ 4న వెల్లడవుతాయి. హరియాణాతోపాటే నవంబర్‌ నెలాఖరుకు గడువు ముగుస్తున్న మహారాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికలుంటాయని అందరూ భావించారు. జార్ఖండ్‌ అసెంబ్లీ పదవీ కాలం వచ్చే జనవరితో పూర్తవుతుంది. కానీ మహారాష్ట్రలో గణేశ్‌ చతుర్థి, దీపావళి కారణంగా ఆ ఎన్నికలు విడిగా నిర్వహిస్తామని ఈసీ చెబుతోంది. కశ్మీర్‌లో ఎన్నికల ప్రకటనకు కొన్ని గంటలముందు భారీ స్థాయిలో పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరగటం యాదృచ్ఛికం కాదు.

విపక్షంలో ఉండగా కశ్మీర్‌ పరిణామాలపై ఒంటికాలిపై లేచిన బీజేపీకి అధికారం వచ్చిన తొలినాళ్లనుంచీ అదొక అంతుచిక్కని పజిల్‌గా మారిందన్నది వాస్తవం. గవర్నర్‌ పాలన వచ్చినా, ఆ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తినిచ్చే 370 అధికరణను రద్దుచేసి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు– జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లుగా విభజించి లెఫ్టినెంట్‌ గవర్నర్‌ను నియమించినా ఆశించిన స్థాయిలో ప్రశాంతత ఏర్పడలేదు. కశ్మీర్‌ లోయ ఎంతో కొంత నయం. అంతక్రితం పెద్దగా ఉగ్రవాద ఘటనల జాడలేని జమ్మూ ప్రాంతంలో ఆ ఉదంతాలు పెరిగాయి. 21 మంది జవాన్లు ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు బలయ్యారు. నిరుడు ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకొచ్చాక ఇంతవరకూ 17 సార్లు భద్రతా బలగాలపై ఉగ్రవాద దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో 18మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈమధ్య ఆ రాష్ట్రానికి వెళ్లినప్పుడు జనం మార్పు కోరుకోవటంతోపాటు ఆ మార్పులో భాగస్వాములయ్యేందుకు ఉవ్విళ్లూరుతున్న వైనం కళ్లబడిందని ప్రధాన ఎన్నికల కమిషనర్‌ రాజీవ్‌ కుమార్‌ అన్నారు. వారు బుల్లెట్లకన్నా బ్యాలెట్లే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఎక్కడి ప్రజలైనా బుల్లెట్లు కోరుకోరు. తమ జీవనం సజావుగా సాగాలనీ, కనీస అవసరాలు తీరాలనీ కాంక్షిస్తారు. అది అసాధ్యమైనప్పుడే ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. దాన్ని ఏ శక్తులు ఎలా ఉపయోగించుకుంటాయన్నది వేరే విషయం. ఆయనన్నట్టు మొన్న లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లలో జనం బారులు తీరిన మాట వాస్తవం. కానీ అంతక్రితం కూడా ఇదే పరిస్థితి. అది రాష్ట్రంగా ఉన్నప్పుడు 2014 నవంబర్, డిసెంబర్‌ నెలల్లో చివరిగా ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికలప్పుడు సైతం ఉగ్రవాదుల బెదిరింపులు, వేర్పాటువాదుల ఎన్నికల బహిష్కరణ పిలుపు బేఖాతరు చేసి వోటర్లంతా పోలింగ్‌ కేంద్రాల ముందు క్యూ కట్టారు. కానీ వారికి దక్కిందేమిటి? ఎవరికీ మెజారిటీ రాని స్థితిలో మూడు నెలల పాటు గవర్నర్‌ పాలన తప్పలేదు. ఆ తర్వాత ఊహించని రీతిలో పీడీపీ–బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనా అది ముచ్చటగా మూడేళ్లు కూడా నడవలేదు.

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జమ్మూ–కశ్మీర్‌ అసెంబ్లీలో స్థానాల సంఖ్య 83 నుంచి 90కి పెరిగింది. జమ్మూ ప్రాంతానికి ఆరు, కశ్మీర్‌కు ఒకటి అదనంగా వచ్చాయి. దీనికితోడు పాక్‌ ఆక్రమిత కశ్మీర్‌ ప్రాంతానికి 24 స్థానాలున్నాయి. మొత్తంగా అసెంబ్లీ స్థానాలు 107 నుంచి 114కు పెరిగాయి. ఈమధ్య జరిగిన లోక్‌సభ ఎన్నికల సరళి గమనిస్తే 24.36 శాతం ఓట్లతో బీజేపీ ముందంజలో ఉండగా, 22.3 శాతంతో నేషనల్‌ కాన్ఫరెన్స్‌ రెండోస్థానంలో ఉంది. కాంగ్రెస్‌కు 19.38 శాతం, పీడీపీకి 8.48 శాతం ఓట్లు లభించాయి. బీజేపీ, నేషనల్‌ కాన్ఫరెన్స్‌లు చెరో రెండు సీట్లు గెల్చుకున్నాయి. యూఏపీఏ కింద అరెస్టయిన పాత్రికేయుడు ఇంజనీర్‌ రషీద్‌ జైల్లోవుంటూ బారాముల్లా స్థానంనుంచి ఇండిపెండెంట్‌గా గెలిచారు. మొత్తానికి ప్రస్తుతం తనకు అనుకూల వాతావరణం ఉన్నదని బీజేపీ విశ్వసిస్తోంది. తాజా ఎన్నికల ప్రకటనకు అది కూడా కారణం కావొచ్చు.

హరియాణాలో ఈసారి ఒంటరి పోరుకు సిద్ధపడుతున్న బీజేపీకి పరిస్థితి ఆశాజనకంగా లేదు. 2014లో 90 స్థానాలున్న అసెంబ్లీలో 47 స్థానాలు గెల్చుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ... 2019లో 40తో సరిపెట్టుకుంది. ఆ ఎన్నికల్లో పది సీట్లు గెల్చుకున్న దుష్యంత్‌ చౌతాలాతో కూటమి కట్టి పాలించింది. అయితే ఆ పార్టీ మూణ్ణెల్లక్రితం మద్దతు ఉపసంహరించుకోగా దినదినగండంగా నెట్టుకొస్తోంది. ఈసారి స్పష్టమైన మెజారిటీతో అధికారం ఖాయమని కాంగ్రెస్‌ అనుకుంటున్నా అదంత సులభం కాదని విశ్లేషకుల అంచనా. అంతర్గత పోరును అదుపు చేసుకుని, విపక్షాలతో కలిస్తేనే బీజేపీని నిలువరించటం వీలవుతుందని వారంటున్నారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలెలా ఉంటాయన్న సంగతి పక్కనబెడితే... ముందు ఎన్నికలకు విశ్వసనీయత తీసుకురాటం ఎలాగన్నది ఈసీ పరిశీలించాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 140 స్థానాల్లో పోలైన వోట్లకన్నా లెక్కించిన ఓట్లు అయిదు కోట్లు అధికమని వోట్‌ ఫర్‌ డెమాక్రసీ (వీఎఫ్‌డీ) బయటపెట్టింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఈ అధిక వోట్లు 47 లక్షలు. పర్యవసానంగా ఇతర రాష్ట్రాల మాటెలావున్నా ఏపీలో కూటమి సర్కారుకు ఈవీఎం ప్రభుత్వమన్న ముద్రపడింది. పైగా కొన్నిచోట్ల సీల్‌ చేసిన ఈవీఎంల బ్యాటరీ చార్జింగ్‌ పెరిగిన వైనం కూడా వెల్లడైంది. ఇంత అస్తవ్యస్తంగా నిర్వహణ ఉంటే ఇలాంటి ఎన్నికలను ఎవరైనా విశ్వసించగలరా? ఎన్నికల సంఘం ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.4.08 వరకు
తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.20 వరకు
తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.12 నుండి 7.44 వరకు,
దుర్ముహూర్తం: ఉ.5.42 నుండి 7.24 వరకు,
అమృతఘడియలు: రా.3.36 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అన్నిటికీ... విదేశీ హస్తమేనా?

ఇందిరా గాంధీ పొలిటికల్‌ టూల్‌ కిట్‌ నుండి నరేంద్ర మోదీ చాలావరకు అరువు తెచ్చుకున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సొంత రాజకీయ సమస్యలకు విదేశీ హస్తాన్ని నిందించడం అటువంటి అరువు ఆలోచనే. ప్రభుత్వాధినేతలు తెరవెనుక శక్తులతో కొట్టుమిట్టాడే యుగంలో ఇందిర పనిచేయవలసి వచ్చిందనేది మనం గమనించాలి. భారతదేశం బలహీనంగా, వెనుకబడి, అభివృద్ధి చెందకుండా ఉండాలని ఎవరూ కోరుకోవడం లేదు. అభివృద్ధి చెందిన, ఆత్మవిశ్వాసంతో కూడిన భారతదేశం తమ ప్రయోజనాలకు సరిపోతుందని పాశ్చాత్య శక్తులు కూడా గుర్తించాయి. కాబట్టి, దేశీయ వైఫల్యాలను సమర్థించుకోవడానికి ఒక సాకు వెతకడం కన్నా, పారదర్శక పాలనపై దృష్టి పెట్టడం మేలు.

విశ్లేషణ



సంజయ బారు

హిండెన్‌బర్గ్, జార్జ్‌ సోరోస్‌ నుండి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల నుండి వేగులు, గూఢచారుల వరకు, వివిధ రూపాల్లో విదేశీ హస్తం భారతదేశంలోకి తిరిగి జొరబడిందని ఆరోపణలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌ మాజీ ప్రధాని షేక్‌ హసీనాను దేశం వీడేలా చేయడానికి యువకులు పెద్దఎత్తున నిరసనలు జరిపినప్పటికీ, ఆమె బహిష్కరణ వెనుక విదేశీ హస్తం ఉందని ఆరోపణలు వినబడుతున్నాయి.

కచ్చితంగా చెప్పాలంటే, మునుపటి ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో జరిగినట్లుగానే, కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో దక్షిణాసియా ఒక ఆట స్థలం కావచ్చు. పెద్ద, చిన్న అనేక దేశాలు ఈ ప్రాంతంలో వాటాను పొందివున్నాయి. కాబట్టి, పాలనలో మార్పు వంటి విపత్తు సంఘటనలు సంభవించినప్పుడు, తెరవెనుక శక్తులు పనిచేస్తున్నాయని అనుకోవాల్సి వస్తుంది. అయితే, చాలా తరచుగా, దక్షిణాసియా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల మూలాలకు స్వదేశంలోని పరిస్థితులే కారణమవుతున్నాయి.

అప్పటినుంచే మొదలు...

అప్పుడప్పుడూ, భారతీయ రాజకీయ చర్చల్లో విదేశీ హస్తం ప్రత్యక్షమవుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు, సాక్షాత్తూ ప్రధానమంత్రే భారతదేశ అంతర్గత స్థిరత్వం, పురోగతి అంశాలపై ఉన్న ప్రపంచ ముప్పు గురించి మాట్లాడారు. అదేసమయంలో అఖండమైన పార్లమెంటరీ మెజారిటీతో 'బలమైన, స్థిరమైన' ప్రభుత్వ ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంలో, ఓటర్లు ఆ ముప్పును సీరియస్‌గా తీసుకోలేదు. మోదీకి అంతంత అనుకూల ఫలితాన్ని మాత్రమే అందించారు.

ఇందిరా గాంధీ పొలిటికల్‌ టూల్‌ కిట్‌ నుండి నరేంద్ర మోదీ చాలావరకు అరువు తెచ్చుకున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు తరచుగా వ్యాఖ్యానిస్తున్నారు. తన రాజకీయ సమస్యలకు విదేశీ హస్తాన్ని నిందించడం అటువంటి అరువు తెచ్చుకున్న ఆలోచనే. ప్రభుత్వాధినేతలు తెరవెనుక శక్తులతో కొట్టుమిట్టాడే యుగంలో ఇందిర పనిచేయవలసి వచ్చిందనేది మనం గమనించాలి. చిలీకి చెందిన సాల్వడార్‌ అలెండే 1973లో హత్యకు గురైన తర్వాత, విదేశీ హస్తం తదుపరి లక్ష్యం తానేనన్న భయంతో ఆమె 1974లో ఎమర్జెన్సీ పాలన విధించి ఉండవచ్చని ఆమె మీడియా సలహాదారు, దివంగత హెచ్‌వై శారదా ప్రసాద్‌ రాశారు. ఫిడెల్‌ క్యాస్ట్రో(క్యూబా), లియోనిడ్‌ బ్రెజ్నెవ్‌ (రష్యా) ఇద్దరూ ఆమెను తీవ్రంగా హెచ్చరించారని ఆయన తన నోట్స్‌లో పేర్కొన్నారు.

1960లు, 1970లు ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రంగా కొనసాగిన కాలం. నిజానికి అది విదేశీ హస్త యుగం. అమెరికా, సోవియట్‌ యూనియన్‌ రెండూ తమ సొంత శక్తిని పెంపొందించుకోవడానికి మిత్రులను, తోలుబొమ్మలను వెతుకుతూ ఉండేవి. భారతదేశం



అప్పట్లో పాశ్చాత్య శక్తులకు అభిముఖంగా ఉండేది. నేడు భారతదేశం తనను తాను అమెరికాకు 'వ్యూహాత్మక భాగస్వామి'గానూ 'నాటోయేతర మిత్రదేశం' గానూ భావిస్తోంది. అయినప్పటికీ, విదేశీ హస్తం చుట్టూ ఉన్న రాజకీయాల్లో అమెరికాను కూడా అనుమానించవలసి రావడాన్ని తోసిపుచ్చలేం.

ప్రచ్ఛన్న యుద్ధం ముగియడంతో, విదేశీ హస్తం గురించి చర్చ తగ్గుముఖం పట్టింది కానీ, అది పూర్తిగా అదృశ్యం కాలేదు. సోవియట్‌ యూనియన్‌ రద్దు కావడంతో అమెరికాకు భారతదేశం చేరువ కావడం; పశ్చిమం వైపు వెళ్లే భారతీయుల సంఖ్య పెరగడం; ఆంగ్లం మాట్లాడే దేశాల పౌరసత్వాన్ని కోరుకోవడం పెరగడంతో, బహిరంగ చర్చల నుండి విదేశీ హస్తం ప్రస్తావన వెనక్కి తగ్గింది. కానీ, తమిళనాడులోని కుడంకుళం వద్ద రష్యా సహాయంతో ఏర్పాటుచేస్తున్న అణు కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకుని నిరసనలు జరగడం వెనుక విదేశీ హస్తం ఉందని 2012లో అప్పటి ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ వంటి వివేకం కలిగిన నాయకుడు కూడా భావించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

అన్నింటికీ అదేనా?

ఈ నేపథ్యంలో మోదీ లాంటి నాయకుడి హయాంలో బీజేపీ లాంటి రాజకీయ పార్టీకి ప్రతి సమస్య, సవాలు వెనుక విదేశీ హస్తం కనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఒక దశాబ్ద కాలంగా దేశంలోని వివిధ ఏజెన్సీలు, ఫోర్డ్‌ ఫౌండేషన్‌ నుండి సెంటర్‌ ఫర్‌ పాలసీ రీసెర్చ్‌ వరకు అన్ని రకాల సంస్థలను విదేశీ హస్తాలు పన్నిన కుట్రదారులుగా బీజేపీ ఆరోపిస్తోంది. కాబట్టి, భారతదేశంలోని అధికార యంత్రాంగంలోని చాలామంది షేక్‌ హసీనాను తొలగించడం వెనుక మాత్రమే కాకుండా, హిండెన్‌బర్గ్‌ చేసిన స్టాక్‌ మార్కెట్‌ విశ్లేషణ పరిశోధన వెనుక కూడా విదేశీ హస్తం ఉందని భావించడంలో ఆశ్చర్యం లేదు.

విదేశాలలో 'భారతీయ హస్తం' పని చేస్తున్నట్లే, భారతదేశంలో చాలా విదేశీ హస్తాలు పనిచేస్తూ ఉండవచ్చు. భారతీయ ఏజెంట్లు విదేశాల్లో హత్యాకాండకు పాల్పడుతున్నారనే ఆరోపణలను ప్రపంచ వ్యాప్తంగా తీవ్రంగా పరిగణిస్తున్నారు. భారతీయ హస్తం పదును దేరుతోందని ఇది సూచిస్తోంది. ఒక దేశం వెలుపల ఉన్న శక్తులు ఒకరిపై కుట్ర పన్నుతుంటే గనక, అటువంటి దేశంలోని ఏ ప్రభుత్వమైనా సరే విస్తృతంగా పరిశీలించి, విదేశీ హస్తాలు ఆటాడేందుకు సహాయపడే స్థానిక శక్తులపై ఎలాంటి చర్యలనైనా తీసుకోవచ్చు అనేది ఇక్కడ గ్రహించాల్సిన ప్రాథమికాంశం.

ఇంటిని దిద్దుకోవాలి!

అనిశ్చితమైన, వేగంగా మారుతున్న ప్రపంచంలో, భారతదేశం వంటి ప్రధాన శక్తి అంతర్గత భద్రత, పాలనపై దృష్టి పెట్టాలి. తద్వారా 'విదేశీ హస్తం' ఆడుకోవడానికి స్థలాన్ని తెరిచే పరిస్థితులను సృష్టించకూడదు. జరిగే ప్రతి తప్పిదానికీ 'విదేశీ హస్తం' బాధ్యత వహించాలని ఆరోపించడం ద్వారా దేశీయంగా ఉన్న అసమర్థ పాలన నుండి జనాల దృష్టిని మళ్లించడం సులభం. నిజానికి హసీనా తన బహిష్కరణకు తానే పునాది వేసుకున్నారు. వాస్తవం ఏమిటంటే, భారతదేశంలోని దర్యాప్తు సంస్థల నుండి నియంత్రణ సంస్థల వరకు వివిధ సంస్థల ఏకపక్ష చర్యలు... సందేహాస్పద నిర్ణయాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ప్రచ్ఛన్న యుద్ధ యుగం దేశాన్ని అస్థిరపరిచే శత్రుపూర్వక విదేశీ హస్తం జ్ఞాపకాన్ని మిగిల్చిందనడాన్ని తోసిపుచ్చలేము. వలసవాద అనంతర సమాజంలో ఈస్టిండియా కంపెనీ బ్రిటిష్‌ రాజ్యంగా మారిన జ్ఞాపకాన్నీ విస్మరించలేము. కాబట్టి 'విదేశీ హస్తం' అనేది కేవలం వేగులు, పంచమాంగదళం లాంటి అనుమానిత చర్యలలో మాత్రమే కాకుండా కార్పొరేట్, ఆర్థిక ప్రపంచంలోని వారి చర్యలలో కూడా కనిపిస్తుంది.

అయితే, భారతదేశం మునుముందుకే నడిచింది. చాలా తక్కువ దేశాలు మినహాయిస్తే, భారతదేశం బలహీనంగా, వెనుకబడి, అభివృద్ధి చెందకుండా ఉండాలని ఎవరూ కోరుకోవడం లేదు. అభివృద్ధి చెందిన, ఆత్మవిశ్వాసంతో కూడిన భారతదేశం తమ ప్రయోజనాలకు సరిపోతుందని పాశ్చాత్య శక్తులు గుర్తించాయి. ఆఖరికి మన విదేశాంగ విధానం కూడా దేశ ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన బాహ్య వాతావరణాన్ని కోరుకుంటోంది. కాబట్టి, దేశీయ వైఫల్యాలు, దుష్పరిపాలనను సమర్థించుకోవడానికి ఒక సాకు కోసం వెతకడం కన్నా, స్వదేశంలో మంచి, పారదర్శక పాలనపై దృష్టి పెట్టడం మేలు.

వ్యాసకర్త మాజీ పత్రికా సంపాదకుడు, ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ మీడియా సలహాదారు
('ద ట్రిబ్యూన్‌' సౌజన్యంతో)

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్‌ మీడియా

అయితే రావొచ్చు!



మీకు ఏ ఆశలు, లక్ష్యాలు, కలలు లేకపోతే గనక ప్రపంచంలో మీరు నివసించడానికి అత్యుత్తమమైన ప్రదేశం ఇటలీ.

– ఆంటోనియో ట్రోపియానో, డేటా ఫ్రీలాన్సర్‌

వెనక్కి పోము!



ఎవరు వినాలో వాళ్లకు: 'భద్రత' అనే కారణంగా తిరిగి భారతీయ మహిళలం గేట్లలోకీ, ఇళ్లలోకీ వెనక్కి వెళ్లం. ఈ దేశంలోని బహిరంగ స్థలాల్లో ప్రతి అంగుళాన్నీ మేము తిరిగి పొందుతాం. మాకు సాయం చేయండి లేదా పక్కకు తప్పుకోండి.

– సరయు పానీ, రచయిత్రి

మారిన పరిస్థితి



షేక్‌ ముజీబుర్‌ రహమాన్‌ను 1975 ఆగస్ట్‌ 15న హత్య చేశారు. అది జాతీయ సెలవు దినం. కానీ మధ్యంతర ప్రభుత్వం అది ఎంతమాత్రమూ సెలవు దినం కాదంటోంది. ఆఖరికి జనాల్ని షేక్‌ ముజీబ్‌ కోసం బాధపడనివ్వడం లేదు. బంగ్లాదేశ్‌లో భావ స్వేచ్ఛ లేదు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

మా కాలపు గొప్పలు



నలభై ఏళ్లు దాటినవాళ్లకు 'మా కాలంలో ఇలామారియా' అనే తీవ్రమైన జబ్బు వస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. దీని లక్షణాలు ఏమంటే, 'మా కాలంలో' సంగీతం, సినిమాలు, సమాజం, రాజకీయాలు బాగుండేవనే నిర్హేతుక నమ్మకం.

– పర్మిందర్‌ సింగ్, వ్యాపారవేత్త

తెలివైన సీఎం



ఒక ముఖ్యమంత్రిగానూ, ప్రతిపక్ష నేతగానూ ఏకకాలంలో వ్యవహరించే అసాధారణ నేర్పు మమతా బెనర్జీకి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం నుంచి మమతా బెనర్జీ న్యాయాన్ని కోరుతున్నారు. తన ప్రత్యర్థులు రాజకీయ కథనాన్ని హైజాక్‌ చేయడానికి ఆమె అంగీకరించడం లేదు.

– గౌహర్‌ గిలానీ, కాలమిస్ట్‌

అడగాల్సిందే!



పశ్చిమ బెంగాల్‌కు ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి, హోమ్‌ కార్యదర్శి ఉన్నారు. హత్యాచార దారుణం మీద వాళ్లు ఏం చెబుతారు? ఈ అధికారులు తమ ప్రకటనలను నేరుగా 'సీల్డ్‌ కవర్‌'లో ఇవ్వాలని గౌరవనీయ హైకోర్టు వారు అడగాలని అభ్యర్థిస్తున్నా.

– కిరణ్‌ బేడీ, మాజీ గవర్నర్‌

జరగాల్సిన విచారణ



మనమందరం ఇండో–అమెరికా సంబంధాలు బాగుండాలనే కోరుకుంటాం. కానీ బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వంపై జరిగిన కుట్ర మీద పారదర్శక విచారణ జరగాలి. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అరుపులు ఎందుకు లేవు? బంగ్లాదేశ్‌ హిందువులపై జరుగుతున్న మారణకాండ మీద ఐక్యరాజ్యసమితి, అమెరికా కాంగ్రెస్, భారత పార్లమెంట్‌లో ఎందుకు చర్చ జరగడం లేదు?

– రాజీవ్‌ మల్హోత్రా, పరిశోధకుడు

పేదలకు దోచిపెట్టిన వీరుడు

బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప సామాజిక విప్లవకారుడు సర్దార్‌ సర్వాయి పాపన్న. ఆధిపత్య కులాల పాలకులు బహుజనులను అణగదొక్కుతున్న 17వ శతాబ్దంలోనే... స్వీయ సైన్యంతో దాడిచేసి దక్కన్‌లో తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు.

పాపన్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌ (1650–1709)లో నాసగోని ధర్మన్న, సర్వమ్మలకు జన్మించాడు. తండ్రి చిన్నతనంలోనే చనిపోతే అన్నీ తానై పెంచింది తల్లి. పాపన్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ పరమ భక్తుడు. తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు. పూజలు చేసే సంప్రదాయాలను యుక్త వయసు వచ్చే నాటికి క్రమక్రమంగా వ్యతిరేకించాడు. బానిసత్వం నుండి ప్రజలకు విముక్తి కల్పిస్తాననీ, కులవృత్తి చేయననీ తల్లి దగ్గర ప్రతిజ్ఞ చేశాడు. పాపన్న ఎక్కువగా ఇతర బహుజన కులాల వారితో కలిసి తిరిగేవాడు. వీరిలో చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్‌ మీరు సాహెబ్‌ ముఖ్యులు.



సర్దార్‌ సర్వాయి పాపన్న

పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం కాని, ధనంకాని లేవు. గిరిజనులను చేరదీసి వారికి యుద్ధ విద్యలను నేర్పాడు. పాపన్న ముందుగా తన చుట్టుపక్కల ఉన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు, కోటలు నిర్మించాడు. 1678 నాటికి తాటికొండ, వేములకొండలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. చివరకు గోల్కొండ కోటను స్వాధీనపర్చుకొని 7 నెలలపాటు అధికారం చలాయించాడు. అయితే మొఘల్‌ సేనలు వచ్చి అతడిని అతి కష్టం మీద పట్టుకొని ఉరితీశాయి.

పాపన్న ఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చినవాడు కనుక అతనికి ప్రజల కష్టనష్టాలన్నీ తెలుసు. అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఖజానా కొరకు జమీందార్, సుబేదార్లపై తన గెరిల్లా సైన్యంతో దాడి చేయించేవాడు. వారి వద్ద నుంచి దోచుకున్న సొమ్మును ప్రజలకు పంచిపెట్టాడు. వారి భూములను కూడా ప్రజలకు పంచాడు. పాపన్న అనేక ప్రజామోదయోగ్యమైన పనులు చేశాడు. అతని రాజ్యంలో సామాజిక న్యాయం పాటించేవాడు. తాటికొండలో చెక్‌డ్యామ్‌ నిర్మించాడు. అతను ఎల్లమ్మకు భక్తుడు కావున హుజురాబాద్‌లో ఎల్లమ్మ గుడి కట్టించాడు. అది రూపం మారినా నేటికీ అలాగే ఉంది.

పిచ్చుక కుంట్లవారు, దాసరి కాంద్రవారు, వీరముష్టి వారు పాపన్న చరిత్రను వీరగాథలుగా ఊరూరా తిరిగి చెప్పేవారు. అలా జానపద కళా రూపాల ద్వారానే పాపన్న చరిత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించాయి. అయితే ఆంగ్లేయ కవి జే.యే. బోయాల్‌ ఇండియన్‌ యెంటిక్వెరి పత్రికలో 1874 లోనే రాశారు.

పాపన్న వీరత్వానికి గుర్తుగా లండన్‌ మ్యూజియంలో విగ్రహాన్ని పొందుపరిచారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్‌బుక్‌లో పాపన్న గురించి రాశారు. జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో 17వ శతాబ్దంలో పాపన్న నిర్మించిన చారిత్రక కోట ఇప్పటికీ నిలిచి ఉంది. దాన్ని పరిరక్షించడానికి తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– పాకాల శంకర్‌ గౌడ్‌ । టీచర్, సిరిసిల్ల
(నేడు సర్దార్‌ సర్వాయి పాపన్న జయంతి)

బలగం ఎక్కువ... వాటా తక్కువ!

అభిప్రాయం



డా॥ కావలి చెన్నయ్య ముదిరాజ్‌

ఇంచుమించు ఒకటిన్నర శతాబ్దం క్రితమే కుల సంఘాన్ని ఏర్పరచుకునే స్పృహ ఉన్న కులం తెనుగు/తెలుగు (తెలగ కాదు)/ ముత్తరాశి/ ముత్రాశి/ బంటు/ కోలి/ ముదిరాజ్‌ కులం.

తెలంగాణలో బీసీలందరిలో సంఖ్యాపరంగా బలమైన సామాజిక వర్గం ముదిరాజ్‌ కులం. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీలలో సంఖ్యాపరంగా 4వ స్థానంలో ఉంటారు.

1951–52లో జరిగిన మొట్టమొదటి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి హైదరాబాద్, మద్రాస్‌ రాష్ట్రాల నుండి ఒక్క ప్రజా ప్రతినిధి కూడా ముదిరాజుల నుండి ఎన్నిక కాలేకపోయారు. మన తెలుగు రాష్ట్రాలు ఒకటిగా ఏర్పడ్డాక, రెండుగా విడిపోయాక జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే 1957–2024 మధ్య సుమారు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఎన్నికైన మొత్తం అసెంబ్లీ సభ్యుల సంఖ్య సుమారు 4,108. కానీ అందులో ముదిరాజులు కేవలం 20 మంది మాత్రమే. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల నుండి పార్లమెంటుకు ఎన్నికైన మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 632. అందులో ముదిరాజులు ఇద్దరు (2) మాత్రమే.

రాజ్యసభకు ఒకరు ఎన్నికయ్యారు. తెలంగాణలోని ప్రస్తుత శాసనసభలలో విధానమండలి (ఎగువ సభ) సభ్యుల సంఖ్య 40 (34 ఎన్నిక + 6 నామినేటెడ్‌). ఇందులో ముదిరాజుల ప్రాతినిధ్యం కేవలం 1 మాత్రమే. విధానసభ (దిగువ సభ) సభ్యుల సంఖ్య 119. ఇందులో కూడా ముదిరాజుల ప్రాతినిధ్యం కేవలం 1 మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు అసలు వీరి ప్రాతినిధ్యమే లేదు కానీ గత శాసనసభలో తెలంగాణలో జన్మించి ఆంధ్రప్రదేశ్‌ కోడలుగా వెళ్లిన విడదల రజిని చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభ్యురాలుగా గెలిచి ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు.

వివిధ రాష్ట్రాలలో అధిక సంఖ్యాక బీసీ కులాలకు చెందిన వారే ముఖ్యమంత్రులు అవ్వడం కనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఓబీసీల్లో అధిక శాతంగా ఉన్న యాదవుల నుండి ములాయం సింగ్‌ యాదవ్, లాలూ ప్రసాద్‌ యాదవ్, అఖిలేష్‌ యాదవ్‌లు ముఖ్యమంత్రి పదవులు పొందడం తెలిసిందే. కర్ణాటకలో లింగాయత్, గౌడ సామాజిక వర్గాల వారు ముఖ్యమంత్రి పీఠాలనే కాక, అన్ని రకాల అధికార స్థానాలనూ పెద్దఎత్తున స్వాధీనం చేసుకోవడమూ కనిపిస్తున్న దృశ్యమే. మరి తెలుగు రాష్ట్రాల్లో సంఖ్యాపరంగా గణనీయంగా ఉన్న ముదిరాజ్‌లు తగిన వాటాను ఎందుకు పొందలేకపోతున్నారు? తెలంగాణ జనాభాలో సుమారు 15 శాతం (50–60 లక్షల మంది) వీరు ఉంటే ఇప్పటివరకు కేవలం 20 మంది మాత్రమే ఎమ్మెల్యేలు కాగలిగారు. దీనంతటికీ కారణం అనైక్యత, ఈర్ష్యా ద్వేషాలతో పాటు విద్య, వైద్య, ఉద్యోగ, చలనచిత్ర, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో పరిపుష్టి లేకపోవడం కారణాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా కొన్ని నియోజకవర్గాలలో చాలా పెద్ద సంఖ్యలో ముదిరాజ్‌లు ఉన్నా ఆ నియోజకవర్గాలలో ముదిరాజ్‌ అభ్యర్థులు గెలవలేకపోవడం శోచనీయం. ఇక్కడ ఇతరులను నిందించాల్సిన అవసరం కూడా లేదు. రాజకీయ పార్టీలు కూడా ముదిరాజులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలలో అవకాశం ఇవ్వకపోవడం దారుణం.

బీసీ కులాల విభజన జరిగినప్పుడు ముదిరాజ్‌లను బీసీ (డి) గ్రూపులో ఉంచినందువల్ల అన్యాయం జరిగింది. ఈ అన్యాయాన్ని సరిచేసి బీసీ(ఎ)లో చేర్చమని ఎన్నో ఏళ్లుగా ముదిరాజ్‌లు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. వీరి వెనుకబాటుతనాన్ని బాగా అర్థం చేసుకున్న వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి ప్రభుత్వం జీవో నెంబర్‌ 15 ద్వారా ముదిరాజ్‌లను బీసీ (డి) గ్రూపు నుండి బీసీ (ఏ) గ్రూపులోకి మార్చింది. కానీ కొన్ని సోదర బీసీ కులాలు హైకోర్టు ద్వారా జీవో నెంబర్‌ 15ను రద్దు చేయించాయి. ఈ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది. సుప్రీంకోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని ముదిరాజ్‌ కులంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికను పంపమన్నది. కానీ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటి రెండు రాష్ట్రాలు సైతం పట్టించుకోవడం లేదు.

కొన్ని సామాజిక వర్గాలకు ప్రత్యేక ఆర్డినెన్స్‌ ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. మరి ముదిరాజులకు అలా చేయటానికి మాత్రం ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. కారణాలు ముదిరాజ్‌లే గ్రహించాలి. ముదిరాజ్‌లకు చేపలు పట్టుకునే హక్కు ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో వీరికి మత్స్యకార సొసైటీలలో సభ్యత్వాలు ఖాళీగా ఉన్నప్పటికీ సభ్యత్వం ఇవ్వడం లేదు. ఇందుకు కారణం ఈ సొసైటీలు ఇంకో చేపలు పట్టే సోదర కులాల ఆధీనంలో ఉండడమే. దీనిపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుంటే ఆ యా ప్రాంతాలలోని ముదిరాజ్‌లకు న్యాయం జరుగుతుంది. జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో రావలసిన వాటాను వారు ఆవేశంతో కాక ఆలోచనతో వ్యవహరించి సాధించుకోవాలి.

వ్యాసకర్త ముదిరాజ్‌ విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు
మొబైల్‌: 90004 81768



నిజామాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు


సిరిసిల్లలో వర్షంలోనూ జూడాల నిరసన


హైదరాబాద్‌లో ఉస్మానియా జూడాల నిరసన ర్యాలీ

24 గంటలు ఓపీ వైద్యసేవలు బంద్

- నేటి ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు
- అత్యవసర సేవలు మినహాయించాలని నిర్ణయం
- కోల్‌కతా ఘటనపై ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవల బంద్‌కు ఐఎంఏ పిలుపు

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో యువ పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ వైద్యసేవలు నిలిపి వేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. అయితే అత్యవసర వైద్య సేవలను మినహాయించింది. కోల్‌కతాలో వైద్యురాలి హత్యను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నేత డాక్టర్ నరహరి తీవ్రంగా ఖండించారు. శనివారం తెలంగాణ ప్రభుత్వ వైద్యులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఒక గంట పాటు నిరసన ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు ఇప్పటికే సమ్మె చేస్తున్న కారణంగా అవసరమైతే ఒక గంట ఎక్కువగా పనిచేసి ఓపీ నిర్వహించాలన్నారు. కోల్‌కతా ఘటనను తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల ఖండించారు. జూడాలు చేస్తున్న ధర్నాలకు హాజరు కావాలని నిర్ణయించామన్నారు.

మంత్రి దామోదర సంఘీభావం

డాక్టర్లు, నర్సులు చేస్తున్న ఆందోళనకు రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో సంఘీభావం తెలిపారు. డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలని ఆయన ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో సేవలను అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రతపై శాఖ ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు.

ఇందిరా పార్కు వద్ద నేడు ధర్నా

సుల్తాన్‌బజార్: మహిళా వైద్యురాలిపై అత్యాచారం,హత్య ఘటనను నిరసిస్తూ శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇందిరాపార్కులోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి.కాళీప్రసాద్‌రావు డాక్టర్ జె.విజయరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి కూడా ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నేడు నిరసన వ్యక్తం చేయాలన్న నర్సుల సంఘం

ఉత్తరాఖండ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై అత్యాచారం, హత్య, షాద్‌నగర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నర్సింగ్ ఆఫీసర్‌పై జరిగిన దాడితోపాటు కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను తెలంగాణ ప్రభుత్వ నర్సుల సంఘం ప్రధాన కార్యదర్శి మరియమ్మ తీవ్రంగా ఖండించారు. శనివారం తెలంగాణ ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్స్ అందరూ తమ షిఫ్ట్ డ్యూటీలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బహుజనులంతా ఏకం కావాలి

- సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పలువురు వక్తల పిలుపు
- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాజుల, స్వామిగౌడ్


పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పొన్నం ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జనాభాలో సగభాగం పైగా ఉన్న బహుజనులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పుడే సర్వాయి పాపన్నకు నిజమైన నివాళులర్పించినట్లవుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోనీ బాలరాజ్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం చిక్కడపల్లిలో సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ స్వామిగౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి హాజరై పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ...పాపన్న ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో నేడు అగర్వాల్ అంత్యక్రియలు

- సీఎస్‌కు ముఖ్యమంత్రి ఆదేశం


డాక్టర్ అగర్వాల్‌కు నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఓ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్/సంతోష్‌నగర్: అగ్ని క్షిపణి మిషన్ తొలి ప్రోగ్రామ్ డైరెక్టర్, దిగ్గజ శాస్త్రవేత్త డాక్టర్ రామ్ నరైన్ అగర్వాల్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. గురువారం కన్నుమూసిన అగర్వాల్ అంత్యక్రియలు శనివారం జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం.. అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయించింది. రక్షణ రంగంలో డాక్టర్ అగర్వాల్ చేసిన సేవలకు గుర్తింపుగా 1990లో పద్మశ్రీ, 2000 సంవత్సరంలో పద్మ భూషణ్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 1983లో భారత ప్రభుత్వం ప్రారంభించిన అత్యంత ప్రతిష్టాత్మక క్షిపణి తయారీ కార్యక్రమంలో డాక్టర్ అరుణాచలం, డాక్టర్ అబ్దుల్ కలాంతో కలసి అగర్వాల్ పనిచేశారు. డీఆర్‌డీవోలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆయన పనిచేశారు. డీఆర్‌డీవోలో విశిష్ట శాస్త్రవేత్తగా పదవీ విరమణ చేసిన డాక్టర్ రామ్ నరైన్ అగర్వాల్ హైదరాబాద్‌లోనే నివాసం ఏర్పరచుకొని చివరి వరకు రక్షణ రంగానికి సేవలందించారు. ఇదిలా ఉండగా డీఆర్‌డీఓ హైదరాబాద్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ అండ్ ఆర్‌అండ్‌డీలో ఉద్యోగులు శుక్రవారం అగర్వాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మోహినుద్దీన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

20న రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ముందు ఈనెల 20న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విగ్రహ ప్రాంగణ పనులను శుక్రవారం మంత్రులు పొన్నం, పొంగులేటి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ పరిశీలించారు. ఇప్పటికే విగ్రహ ఏర్పాట్లు పూర్తయ్యాయని, ల్యాండ్ స్కేపింగ్, ఇతర పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. వారు రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రాంగణ మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పాతకక్షలతో దంపతులపై దాడి

- షాక్‌కు గురై కుమార్తె అక్కడికక్కడే మృతి


పావని మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి సోమయ్య

నాగారం (తుంగతుర్తి): తన తల్లిదండ్రులపై కొందరు దాడిచేస్తుండగా.. ఆ ఘటనను చూసిన బాలిక భయపడి షాక్‌తో మృతిచెందింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాసం సోమయ్యకు అదే గ్రామానికి చెందిన కడారి సైదులు కుటుంబం మధ్య గతంలో గొడవలు జరగడంతో గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకున్నారు. కాసం సోమయ్య కొంతకాలంగా తన కుటుంబ సభ్యులతో కలసి సూర్యాపేటలో నివాసం ఉంటున్నాడు. తన చిన్న కూతురు పావని(14) అనారోగ్యానికి గురికావడంతో మూడు నెలలక్రితం తన స్వగ్రామానికి వచ్చి మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, గతంలో జరిగిన గొడవలను మనసులో పెట్టుకొని కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగంతో కలిసి గురువారం రాత్రి కాసం సోమయ్య ఇంట్లోకి వెళ్లి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో కాసం సోమయ్య, అతడి భార్య మంజులకు తీవ్రగాయాలయ్యాయి. తన తల్లిదండ్రులపై జరుగుతున్న దాడిని చూసి భయాందోళనకు గురైన పావని అపస్మారక స్థితిలోకి వెళ్లి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకొని దాడిచేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. బాలిక పావని మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాసం సోమయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. కాగా, పావని అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం పూర్తయ్యాయి.

తహసీల్ ఎదుట అన్నదమ్ముల ఆత్మహత్యాయత్నం

- భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని పురుగు మందు డబ్బాతో హల్‌చల్


పురుగు మందు డబ్బాతో చింత విష్ణు

నెన్నెల: తాము కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్ వారం రోజులు తిప్పుకోవడంతో విసుగు చెందిన అన్నదమ్ములు మంచిర్యాల జిల్లా నెన్నెల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. రిజిస్ట్రేషన్ చేయకపోతే ప్రాణాలు తీసుకుంటామని పురుగు మందు డబ్బాతో హల్‌చల్ చేశారు. పోలీసులు అడ్డుకుని వారికి సర్దిచెప్పారు. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన చింత విఘ్నేశ్, చింత విష్ణు సర్వే నంబర్ 332లో ఏడు ఎకరాల భూమి దమ్మ సునీత వద్ద కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 7న స్లాట్ బుక్ చేసుకున్నారు. తహసీల్దార్ సబ్బ రమేశ్ రేపు...మాపు అంటూ వారం రోజులుగా తిప్పుకుంటున్నాడు. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి సోదరులు కార్యాలయానికి వచ్చారు. సాయంత్రం వరకు ఉన్నా.. రిజిస్ట్రేషన్ కుదరదని తహసీల్దార్ చెప్పడంతో కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. స్లాట్ బుక్ అయిన తర్వాత రిజిస్ట్రేషన్ ఎలా నిలిపి వేస్తారని ప్రశ్నిస్తూ గొడవకు దిగారు. దీంతో ఎస్సై ప్రసాద్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ చాంబర్‌లో మాట్లాడుతుండగా విష్ణు పురుగు మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సై సర్దిచెప్పి తహసీల్దార్‌తో మాట్లాడారు. రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేసిన వెంటనే రెండ్రోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ చెప్పడంతో వారు తిరిగి వెళ్లారు.

మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమైన మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి డిమాండ్ చేశారు. అక్కడ ఓ మహిళే ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ మహిళలకు భద్రత లేకుండా పోయిందని మండిపడ్డారు. కోల్‌కతాలోని ఆర్జీ మెడికల్ కాలేజీలో మహిళా డాక్టర్ దారుణ హత్య బాధాకరమని... ఈ కేసు దర్యాప్తులో మమతా బెనర్జీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసును సీబీఐకు బదిలీ చేయడాన్ని చాలా రోజులు ఆలస్యం చేశారని, సరైన దర్యాప్తు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. ఈ జాప్యం కూడా కీలకమైన సాక్ష్యాల తారుమారుకు కారణమైందని ఆరోపించారు. అక్కడి గూండాలు అధికార టీఎంసీతో అంటకాగుతున్నందున పోలీసులు చర్యలు తీసుకోకుండా వెనుకాడుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ట్రైయినీ డాక్టర్ హత్యాచార ఘటన, తదనంతర పరిణామాలపై కోల్‌కతా హైకోర్టు కూడా తీవ్రంగా స్పందించిందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించకపోవడం దుర్మార్గమన్నారు.

నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే కాంట్రాక్టు రద్దు

- మంత్రి సీతక్క హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే కాంట్రాక్టు రద్దు చేస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. 'అంగన్‌వాడీ కేంద్రాల కు నాణ్యమైన గుడ్లు, వస్తువులు సరఫరా చేయండి.. లేకపోతే తప్పుకోండి.. లేకపోతే మేమే తప్పిస్తాం' అని సీతక్క స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార పదార్థాలు, కోడి గుడ్ల నాణ్యత పెంపు కోసం వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో మంత్రి సీతక్క, శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. నాణ్యమైన గుడ్లు సరఫరా చేయటం లేదని వార్తలు రావడంపై సప్లయర్ల వివరణ కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది నాణ్యతలేని వస్తువులను తిరస్కరించాలని సూచించారు. కాగా, పెరిగిన రేట్లకనుగుణంగా కోడిగుడ్ల రేట్లను పెంచాలని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగా గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి త్వరగా బిల్లు చెల్లించాలని సప్లయర్లు కోరగా.. ధరలు పెంచేందుకు మంత్రి సీతక్క ససేమిరా అన్నారు.

దళిత మహిళ నిర్బంధంపై పెల్లుబికిన నిరసన

- బషీరాబాద్ ఠాణా ఎదుట ఆందోళన


తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు కళావతి, దళిత నాయకులు

బషీరాబాద్: కొడుకు కేసులో తల్లిని నిర్బంధించిన ఘటనపై దళిత సంఘాలు భగ్గుమన్నాయి. లోహడ కళావతికి మద్దతుగా దళిత సంఘాలు శుక్రవారం బషీరాబాద్ ఠాణా ఎదుట ఆందోళన చేశాయి. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, ఎంఎస్పీ, దళిత బహుజన ఫ్రంట్, మానవ హక్కుల వేదిక, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. ఎస్ఐ రమేశ్‌ను సస్పెండ్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలోడీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నవీన్, జీడీ స్వార్టకస్, కె.శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, కృష్ణ, మహేందర్, బుగ్గప్ప, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళావతి దళిత సంఘాల నేతలతో వెళ్లి తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కలిసి ఎస్ఐ మూడు నెలలుగా ఠాణాకు పిలిపించి చిత్రహింసలు పెట్టాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ఘటనపై విచారణ చేసి ఎస్పీకి నివేదిక అందజేస్తానని ఆయన చెప్పారు. బషీరాబాద్ ఘటనపై ఎస్పీ నారాయణరెడ్డి ఆరా తీశారు.

బిడ్డ కడసారి చూపు కోసం..

- అమెరికాలో హనుమకొండ జిల్లావాసి మృతి
- మృతదేహం తీసుకురాలేక తల్లి రోదన
- ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వేడుకోలు


కుమారుడి ఫొటో పట్టుకుని రోదిస్తున్న నీలమ్మ

ఆత్మకూరు: కొడుకు అమెరికాలో ఉన్నాడని మాత్రమే ఆ పేద తల్లికి తెలుసు. ఏం చేస్తున్నాడో కూడా తెలియని ఆమెకు ఇప్పుడు బిడ్డ మరణవార్త తెలిసింది. బిడ్డ దగ్గరికి పోలేక.. శవాన్ని తీసుకురాలేక..ప్రభుత్వ సాయం కోసం ఆ తల్లి ఎదురుచూస్తోంది. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలకేంద్రానికి చెందిన ఏరుకొండ నీలమ్మ, సాంబయ్య దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాజేశ్ (42) ఎంఎస్ చేయడానికి 2015లో అమెరికాకు వెళ్లాడు. తొమ్మిదేళ్లుగా అక్కడే మిసిసిపీ రాష్ట్రంలో ఉంటున్నాడు. పదకొండు నెలల క్రితం తండ్రి సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి నీలమ్మ ఆరోగ్యం బాగాలేకపోవడంతో నర్సంపేటలో కుమార్తె దగ్గర ఉంటోంది. రాజేశ్ అమెరికాలో ఏం చేస్తున్నాడన్న విషయం కూడా కుటుంబ సభ్యులకు తెలియదు. నాలుగు రోజుల క్రితం రాజేశ్ అమెరికాలో అనారోగ్యంతో మృతి చెందినట్లు అక్కడివారు ఫోన్ చేసి చెప్పారని బంధువులు తెలిపారు. తల్లి పేదరికం వల్ల మృతదేహాన్ని తీసుకురాలేని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి రాజేశ్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తల్లి నీలమ్మ, కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

సీసీ కెమెరాలో చూసి అమెరికా నుంచి అలర్ట్ చేశాడు

- పలు ఇళ్లలో బంగారం, నగదు అపహరణ చేసిన దొంగలు
- స్థానికులు అప్రమత్తం కావడంతో పరార్


సీసీ కెమెరాలో రికార్డయిన దొంగల కదలికలు

చివ్వెంల (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు బంగారం, నగదు అపహరించుకుపోయారు. పీఎస్ఆర్ టౌన్‌షిప్ ఆరవ వీధిలో రాఘవ, బాలస్వామి, నగేశ్ ఇళ్లకు తాళం వేసి ఉండగా దొంగలు వాటిని పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. రాఘవ, బాలస్వామి ఇళ్లలో కొద్దిమొత్తంలో నగదు అపహరించారు. నగేశ్ ఇంట్లో 12 తులాల బంగారం చోరీ చేశారు. అదే కాలనీకి చెందిన నూనె సత్యనారాయణ అమెరికాలో ఉంటున్న తన బంధువుల దగ్గరకు వెళ్లాడు. తన ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను అమెరికా నుంచి సెల్‌ఫోన్‌లో పరిశీలిస్తుండగా దొంగలు అతని ఇంట్లోకి చొరబడిన దృశ్యాలు కనిపించాయి. వెంటనే కాలనీలో పలువురికి ఫోన్ చేసి అప్రమత్తం చేశాడు. దీంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంబంధిత ఇంటికి చేరుకోవడంతో వారి రాకను గమనించిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. నగేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. మూడు నెలల్లో కాలనీలో మూడోసారి దొంగలు పడటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

రామాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు

- అడ్డుకున్న భద్రాచల దేవస్థాన ఉద్యోగులు
- ఈవోపై దాడికి ఆక్రమణదారుల యత్నం
- పురుషోత్తపట్నం భూములపై ఆగని వివాదం


ఈవో రమాదేవికి రక్షణగా నిలిచిన ఉద్యోగులు


భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించి ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భూములపై మళ్లీ వివాదం చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా రగులు తున్న ఈ వివాదంపై ఏపీకి చెందిన పోలీసు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. శుక్రవారం అక్రమ నిర్మాణాలను అడ్డుకోవటానికి వెళ్లిన ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు, సిబ్బందిపై అక్రమ నిర్మాణదారులు దాడికి ప్రయత్నించటంతో తోపులాట జరిగింది.

ఈవోపై దాడికి యత్నం

పురుషోత్తపట్నంలోని రామాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిసి ఈవో రమాదేవి, అధికారులు అక్కడికి వెళ్లారు. నిర్మాణాలను నిలిపేయాలని, భూములపై కోర్టులో కేసు ఉన్నందున ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని సర్దిచెప్పేందుకు యత్నించారు. అయితే ఏళ్లుగా ఉంటున్న తమకే హక్కు ఉందంటూ అక్కడి మహిళలు వాగ్వాదానికి దిగడమే కాక ఈవో రమాదేవిపై దాడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆలయ సిబ్బంది ఆమెకు రక్షణ కల్పించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఏపీ రెవెన్యూ సిబ్బందిపై ఈవో రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయ భూముల్లో నిర్మాణాలు చేపట్టకుండా పర్యవేక్షించడంతో పాటు వాటిని దేవస్థానానికి అప్పగించాలని కోర్టు ఉత్తర్వులు ఉన్నా రెవెన్యూ ఉద్యోగుల నిర్లక్ష్యంతో అది సాధ్యం కావడం లేదని ఈవో తెలిపారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్లలో 46 ఫిర్యాదులు ఇచ్చామన్నారు. ఇకనైనా ఏపీ అధికారులు స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు.

కులగణన చేయకుంటే సామూహిక ఆమరణదీక్ష

- రేవంత్ సర్కార్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక


మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన చేయకుండా, బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొద్దని, కులగణన కాకుండా నోటిఫికేషన్ ఇస్తే అదేరోజు సామూహిక ఆమరణ దీక్షకు దిగుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. వివిధ బీసీ కుల సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో ఎంపీ, ఎమ్మెల్యేల సీట్ల కేటాయింపుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కనీసం బీసీలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా ఎన్నికయ్యేందుకు జనాభా దామాషా పద్ధతిన తమకున్న అవకాశాన్ని కూడా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల విశ్వసనీయత కోల్పోకముందే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, తక్షణమే కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

42 మందితో ఆమరణదీక్షకు దిగుతాం

సమగ్ర కులగణన చేయకుండా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వకుండా ఎన్నికల షెడ్యూల్ ఇస్తే అదే రోజు 42% ప్రతీకగా 42 మందితో ఆమరణ దీక్ష చేస్తామని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రకటించారు. హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు మాట్లాడుతూ...ప్రాణాలు పణంగా పెట్టి మరీ సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో 42% సాధిస్తామని ప్రకటించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ...కులగణన చేయకుండా, స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిడికిలి రాజు, బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గోర శ్యామ్‌సుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరో మహమ్మారి..!

ఇప్పటికే ఆఫ్రికా దేశాలను చుట్టేసిన ప్రమాదకర మంకీపాక్స్ వైరస్

దశాబ్దాల నిర్లక్ష్యం నేడు ప్రాణాంతకంగా మారిన వైనం





నిన్న స్వీడన్‌కు నేడు పాకిస్తాన్‌కు పాకిన వైరస్

అప్రమత్తంగా ఉండాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

కోవిడ్ మహమ్మారి సృష్టించిన మహావిలయం నుంచి ప్రపంచం పూర్తిగా తేరుకోకముందే ఎంపాక్స్ రూపంలో మరో వైరస్ భూతం భూమండలాన్ని చుట్టేస్తోంది. తొలుత ఆఫ్రికా దేశాలకే పరిమితమైన ఈ వైరస్ తాజాగా రూపాంతరాలు చెంది ప్రాణాంతకంగా పరిణమించింది. ఆఫ్రికాలో ఇన్నేళ్లలో వందలాది మంది మరణాలతో ప్రపంచదేశాలు ఇన్నాళ్లకు అప్రమత్తమయ్యాయి. నిర్లక్ష్యం వహిస్తే మరో మహమ్మారిని స్వయంగా ఆహ్వానించిన వారమవుతామని దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఈ మేరకు బుధవారం ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించింది. ఆఫ్రికా ఖండాన్ని దాటి వేరే ఖండాల దేశాల్లోనూ వేగంగా వ్యాపిస్తుండటంతో 2022 ఏడాది తర్వాత తొలిసారిగా డబ్ల్యూహెచ్ఓ 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ'ని ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే ఆఫ్రికాలో ఈ 7 నెలల్లో 15,600 కేసులు నమోదయ్యాయి. 537 మంది ఎంపాక్స్ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. తాజాగా స్వీడన్, పాకిస్తాన్‌లకూ వైరస్ పాకింది. ఈ నేపథ్యంలో వైరస్ వ్యాప్తి, కట్టడి, నివారణ చర్యలుసహా వ్యాధి పుట్టుపూర్వోత్తరాలను ఒకసారి తెల్సుకుందాం.

ఏమిటీ ఎంపాక్స్ వైరస్?

1958లో తొలిసారిగా కోతుల్లో ఈ వైరస్‌ను కనుగొన్నారు. అందుకే ఈ వైరస్‌కు మంకీపాక్స్ పేరు స్థిరపడిపోయింది. అప్పట్లో పరిశోధన కోసం డెన్మార్క్‌కు తరలించిన కోతుల్లో కొత్త రకం వ్యాధి లక్షణాలు కనిపించడంతో ల్యాబ్ పరీక్షలు జరిపి ఈ వైరస్ ఉనికి కనిపెట్టారు. 1970లో కాంగో దేశంలో తొమ్మిదేళ్ల బాలుడికి ఈ వైరస్ సోకడంతో తొలిసారిగా మనుషుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. మనుషులు, చిట్టెలుకలకూ వైరస్ సోకడంతో 'మంకీ'పాక్స్‌కు బదులు ఎంపాక్స్ అనే పొట్టిపేరును ఖరారుచేశారు. ఆర్థోపాక్స్ వైరస్ రకానికి చెందిన ఎంపాక్స్ సోకితే చర్మం ఎర్రగా మారి పొక్కులు వస్తాయి. సొన చేరి పొక్కులు ఇబ్బంది పెడతాయి. దశాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న మశూచి వ్యాధికి కారణమైన వైరస్, ఎంపాక్స్ ఒకే జాతికి చెందినవి. గోవులకు సోకే గోమశూచి, వసీనియా వంటి వ్యాధులను కల్గించే వైరస్ కూడా ఈ రకానిదే.

వైరస్ ఎలా సోకుతుంది?

- అప్పటికే వైరస్ సోకిన మనుషులు లేదా జంతువులను తాకినా, వారితో దగ్గరగా గడిపినా వైరస్ సోకుతుంది.
- కుక్క లేదా ఇతరత్రా పెంపుడు జంతువులకు వైరస్ సోకితే అవి మనుషులను కరిచినా, తాకినా, వాటి లాలాజలం, రక్తం, ఇతర స్రావాలు అంటుకున్నా వైరస్ సోకుతుంది.
- చర్మంపై గాయాలు, శరీర స్రావాలు, తుమ్మినపుడు పడే తుంపర్లు, నోటి లాలాజలం ఇలా వైరస్‌కు ఆవాసయోగ్యమైన ప్రతి తడి ప్రాంతం నుంచి వైరస్ సోకుతుంది
- ఎక్కువసేపు ముఖాన్ని ముఖంతో తాకినా, ముద్దుపెట్టుకున్నా సోకొచ్చు
- రోగి వాడిన దుస్తులు, వస్తువులను ముట్టుకున్నా, వాడినా వైరస్ సోకే అవకాశాన్ని కొట్టిపారేయలేం

వేటి ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది?

రోగి వినియోగించిన దుస్తులు, మంచం, టవల్స్, పాత్రలు సాధారణ వ్యక్తి వాడితే అతనికీ వైరస్ వస్తుంది. లాలాజలం తగిలినా, కరచాలనం చేసినా సోకుతుంది. తల్లి నుంచి బిడ్డకు వైరస్ సంక్రమించవచ్చు.

కొత్తగా ఏప దేశాల్లో విస్తరించింది

కొత్తగా 13 ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని గత వారం గణాంకాల్లో వెల్లడైంది. క్రితంతో పోలిస్తే ఇక్కడ కేసులు 160 శాతం, మరణాలు 19 శాతం పెరగడం గమనార్హం. కొత్త కేసుల్లో 96 శాతం కేసులు ఒక్క కాంగోలోనే గుర్తించారు. ఎంపాక్స్ కొత్త వేరియంట్ రోగుల్లో మరింతగా వ్యాధిని ముదిరేలా చేసి జననాంగాల వద్ద చర్మగాయాలకు కారణమవుతోంది. దీంతో తమకు ఈ వైరస్ సోకిందన్న విషయం కూడా తెలీక చాలా మంది కొత్త వారికి వైరస్‌ను అంటిస్తున్నారు. 2022 ఏడాదిలో ఎంపాక్స్ క్లాడ్2 రకం వేరియంట్ విజృంభిస్తే ఈసారి క్లాడ్1 వేరియంట్ వేగంగా సంక్రమిస్తోంది. ఈ వేరియంట్ అత్యంత ప్రమాదకరం.

- సాక్షి, నేషనల్ డెస్క్

లక్షణాలు ఏమిటీ?

- చర్మంపై దద్దుర్లతోపాటు జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాల నొప్పి, వెన్ను నొప్పి వస్తాయి. ఒళ్లంతా నీరసంగా ఉంటుంది. గొంతు ఎండిపోతుంది.
- మధ్యస్థాయి పొక్కులు పైకి తేలి ఇబ్బంది కల్గిస్తాయి.
- మనుషుల్లో ఒకరి నుంచి మరొకరికి, వణ్యప్రాణుల నుంచి సోకుతుంది. 90 శాతం కేసుల్లో ముఖంపైనా, 75 శాతం కేసుల్లో అరచేతులు, పాదాల మీద, 30 శాతం కేసుల్లో జననాంగాల మీద పొక్కులు వస్తాయి. నీటి బొడిపెలుగా చిన్నగా మొదలై పెద్దవై తర్వాత సొన చేరి ఎర్రగా, నల్లగా మారి పగులుతాయి.

వ్యాక్సిన్ ఉందా?

అత్యల్ప లక్షణాలు కనిపిస్తే వ్యాధి దానంతట అదే తగ్గిపోతుంది. ప్రస్తుతానికి ఎంపాక్స్ సోకిన వారికి నిర్దష్టమైన చికిత్స విధానంగానీ వ్యాక్సిన్‌గానీ లేవు. మశూచి చికిత్సలో వాడే యాంటీ వైరల్ ఔషధమైన టికోవిరమాట్(టీపీఓఎక్స్ ఎక్స్)ను ఎంపాక్స్ రోగులకు ప్రయోగాత్మకంగా వాడుతున్నారు. అమెరికాలో మశూచికి వాడే జెనియోస్ డ్రగ్స్‌నే 18 ఏళ్లు, ఆపైబడిన వయసు రోగులకు ఇస్తున్నారు. కోవిడ్ దెబ్బకు సంపన్న, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యాధులు ప్రబలేలోపే నివారణ చర్యలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్యపరంగా నిఘా కార్యక్రమాలు కొనసాగుతున్నాయిగానీ వెనుకబడిన ఆఫ్రికా దేశాల్లో అవేం లేవు. దీంతో వైరస్ వ్యాప్తి ఆగట్లేదు.

మోగింది ఎన్నికల భేరీ

జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

- జమ్మూకశ్మీర్‌లో మూడు దశల్లో, హరియాణాలో ఒక దశలో పోలింగ్
- అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు: సీఈసీ రాజీవ్ కుమార్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా ఎన్నికల సందడి

హరియాణా బలాబలాలు

పార్టీ	ఎమ్మెల్యేల సంఖ్య
బీజేపీ	40
కాంగ్రెస్	31
జననాయక్ జనతా పార్టీ	10
ఇండియన్ నేషనల్ లోక్‌దళ్	1
హరియాణా లోకహిత పార్టీ	1
స్వతంత్రులు	7

జమ్మూకశ్మీర్ (2014 ఫలితాలు)

పార్టీ	ఎమ్మెల్యేల సంఖ్య
పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ	28
బీజేపీ	25
నేషనల్ కాన్ఫరెన్స్	15
కాంగ్రెస్ పార్టీ	12
జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్	2
సీపీఎం	1
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	1
స్వతంత్రులు	3



జమ్మూకశ్మీర్ ఎన్నికలు (మొత్తం సీట్లు 90)

దశ	తేదీ	సీట్లు
1	సెప్టెంబర్18	24
2	సెప్టెంబర్25	26
3	అక్టోబర్ 1	40

హరియాణా ఎన్నికలు (మొత్తం సీట్లు 90)

దశ	తేదీ	సీట్లు
1	అక్టోబర్ 1	90

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో దశాబ్ద కాలం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన అనంతరం తొలిసారిగా ఎన్నికల సందడి ప్రారంభం కాబోతోంది. జమ్మూకశ్మీర్‌తోపాటు హరియాణా శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు దశల్లో, 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి ఒక దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న, హరియాణాలో అక్టోబర్ 1న ఎన్నికలు జరుగుతాయని, రెండు రాష్ట్రాల్లో అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలియజేశారు. జమ్మూకశ్మీర్‌లో మొదటి దశలో 24 సీట్లకు, రెండో దశలో 26 సీట్లకు, మూడో దశలో 40 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ చివరిసారిగా 2014 నవంబర్–డిసెంబర్‌లో ఐదు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను సాధారణంగా ఐదు దశల్లో నిర్వహిస్తుంటారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరిగాయి. దీనిపై విమర్శలు వచ్చాయి. అందుకే జమ్మూకశ్మీర్‌లో తక్కువ సమయంలోనే ఎన్నికలు నిర్వహిస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని రాజీవ్ కుమార్ చెప్పారు. ఈసారి కేవలం మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తి చేయబోతున్నామని తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో భద్రతా అవసరాల వల్లే..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మరికొన్ని రోజుల్లో ప్రకటిస్తామని రాజీవ్ కుమార్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌ను వాయిదా వేసినట్లు వివరించారు. 2019లో హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దాదాపు ఒకే సమయంలో జరిగాయి. ఈ ఏడాది, వచ్చే ఏడాది ఆరంభంలో మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సైతం జరగాల్సి ఉందని, వీటిలో రెండు రాష్ట్రాలకు కలిపి ఒకసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో పోలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన రాష్ట్రాల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. మీడియా సమావేశంలో రాజీవ్ కుమార్‌తోపాటు ఎన్నికల సంఘం కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది.

ముగ్గురు జెంటిల్‌మెన్ మళ్లీ వచ్చేశారు

ముగ్గురు పెద్దమనుషులు(జెంటిల్‌మెన్) మళ్లీ వచ్చేశారని మీడియా సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్ చమత్కరించారు. తన సహచర కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూను విలేకరులకు పరిచయం చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో 'లాపతా జెంటిల్‌మెన్' అంటూ ట్రోలింగ్ నడిచింది. 'లాపతా లేడీస్' చిత్రాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు కనిపించకుండాపోయారని, లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, రాజకీయ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని నెటిజన్లు విమర్శలు గుప్పించారు. జూన్ 3న విలేకరుల సమావేశంలో రాజీవ్ కుమార్ మాట్లాడుతూ... లాపతా జెంటిల్‌మన్లు త్వరలో తిరిగివస్తారని చెప్పారు. తాము ఎక్కడికీ వెళ్లలేదని, ఇక్కడే ఉంటున్నామని పేర్కొన్నారు.

సహచరులే కీచకులా?

- వైద్యురాలిపై ఘాతుకంలో కొందరు డాక్టర్ల ప్రమేయం
- అనుమానం వ్యక్తం చేసిన బాధితురాలి తల్లిదండ్రులు
- సీబీఐ దర్యాప్తులో కొన్ని పేర్లు బయటపెట్టిన వైనం

కోల్‌కతా: ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో యువ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులను ప్రశ్నించారు. తమ కుమార్తెపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో అదే ఆసుపత్రిలో పని చేస్తున్న కొందరు జూనియర్ వైద్యులు, ఇతర సీనియర్ వైద్యుల ప్రమేయం ఉందని అనుమానిస్తున్నామంటూ తల్లిదండ్రులు చెప్పినట్లు సీబీఐ అధికారులు శుక్రవారం వెల్లడించారు. కొన్ని పేర్లను సైతం బయటపెట్టారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో బాధితురాలితోపాటు కలిసి పనిచేసిన వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని తల్లిదండ్రులు తెలిపినట్లు స్పష్టంచేశారు. 30 మందిని పిలిపించి, విచారించాలని నిర్ణయించామని అధికారులు వివరించారు. ఆసుపత్రి వైద్యులను, పోలీసు అధికారులను ప్రశ్నించబోతున్నామని చెప్పారు. బాధితురాలు హత్యకు గురైన రోజు ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి సమన్లు జారీ చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా, ట్రైనీ డాక్టర్ హత్యకు గురైన గదిలో సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం జరిగిందని జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఏర్పాటైన విచారణ కమిటీ ఆరోపించింది. హత్య సంగతి బయటపడగానే ఆ గదిని పరిరక్షించాల్సి ఉండగా, కొందరు లోపలికి వెళ్లి శుభ్రం చేశారని పేర్కొంది. కోల్‌కతాలోని డాక్టర్ హత్యాకాండను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో వైద్యులు శుక్రవారం భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా డాక్టర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

విధ్వంసం కేసులో 25 మంది అరెస్టు

ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో విధ్వంసం కేసులో ఇప్పటిదాకా 25 మందిని అరెస్టు చేసినట్లు కోల్‌కతా పోలీసులు చెప్పారు. వారిని కోర్టుకు తరలించామని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానం వారిని ఈ నెల 22 దాకా పోలీసు కస్టడీకి అప్పగించిందని వెల్లడించారు.

మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్

ట్రైనీ డాక్టర్ హత్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పశ్చిమబెంగాల్‌లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లపై బైఠాయించారు. బీజేపీ నేతలకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. కోల్‌కతాలో ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. నిరసన కార్యక్రమాల్లో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) సైతం పాల్గొంది.

విధ్వంసం వెనుక సీపీఎం, బీజేపీ : మమత

జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన రాక్షసులకు ఉరిశిక్ష విధించాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమత డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని సీబీఐని కోరారు. ఆస్పత్రి విధ్వంసం వెనుక ప్రతిపక్ష సీపీఎం, బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. సాక్ష్యాధారాలను మాయం చేయడానికే ఈ విధ్వంసం జరిగిందని అన్నారు. జూనియర్ డాక్టర్ హత్యపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. డాక్టర్ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన భారీ ర్యాలీలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. సీపీఎం, బీజేపీ మధ్య బంధం త్వరలో బయటపడుతుందని చెప్పారు.



నేడు నాన్-ఎమర్జెన్సీ వైద్య సేవల నిలిపివేత

యువ డాక్టర్ హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 24 గంటలపాటు నాన్-ఎమర్జెన్సీ వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రకటించింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల దాకా ఆసుపత్రుల్లో ఈ సేవలను అందించబోమని వెల్లడించింది.

అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే విధ్వంసం

ఆర్‌జీ కార్ ఆసుపత్రి ఘటనపై కలకత్తా హైకోర్టు ఆగ్రహం

కోల్‌కతా: ఆర్‌జీ కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో దుండగులు సృష్టించిన విధ్వంసకాండపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వ అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆక్షేపించింది. ఆసుపత్రిలో దాడి ఘటనపై వివరణ ఇవ్వాలని, వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులు, ఆసుపత్రి వర్గాలను ఆదేశించింది. ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్. శివాజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. విధ్వంసాన్ని పోలీసు నిఘా వర్గాలు ఎందుకు పసిగట్టలేకపోయాయని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత అసలేం జరిగిందో చెప్పాలని అధికారులను ఆదేశించారు. వైద్యురాలి మృతదేహం కనిపించిన గదిని శుభ్రం చేసి, రంగులు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఆసుపత్రిని మూసివేయాలని ఆదేశాలు ఇవ్వగలమని స్పష్టం చేశారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో విచారణ పురోగతిని వివరించాలని, మధ్యంతర నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేశారు.

6 గంటల్లోపు కేసు పెట్టండి

- ఆస్పత్రి సిబ్బందిపై దాడి చేస్తే తక్షణం స్పందించండి
- ఆరోగ్య శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: జూనియర్ వైద్యురాలి మృతితో దుండగులు కోల్‌కతాలో ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధ్వంసం, సిబ్బందిపై దాడుల ఘటనల్లో యాజమాన్యం 6 గంటల్లోపు పోలీసులకు ఫిర్యాదు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలు జారీచేసింది. ఆలస్యమైతే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఆసుపత్రులను సేఫ్‌జోన్లుగా ప్రకటించండి

ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్.వి.అశోకన్


న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని, అప్పుడే డాక్టర్లు ఎలాంటి భయాలు లేకుండా పనిచేసుకోగలుగుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) చీఫ్ డాక్టర్ ఆర్.వి.అశోకన్ డిమాండ్ చేశారు. విమానాశ్రయాల్లాగే ఆసుపత్రులను కూడా సేఫ్‌జోన్లు ప్రకటించాలన్నారు. కోల్‌కతా వైద్యురాలి రేప్, హత్య, ఆర్.జి.కార్ ఆసుపత్రిపై దుండగుల దాడికి నిరసనగా ఐఎంఏ శనివారం డాక్టర్ల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. 'విమానాశ్రయాల్లో మూడంచెల భద్రత ఉంటుంది. కనీసం ప్రధాన ఆసుపత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి. అప్పుడు భద్రత తప్పనిసరి అవుతుంది' అని అశోకన్ కోరారు. ఐఎంఏ ప్రభుత్వం ముందుంచిన ఐదు ప్రధాన డిమాండ్లలో ఇది ఒకటన్నారు. వైద్య సిబ్బందిపై దాడలను అరికట్టడానికి కేంద్ర చట్టం ఉండాలన్నారు. 25 రాష్ట్రాల్లో డాక్టర్లు, ఆసుపత్రులపై దాడులను నిరోధించేందుకు చట్టాలు ఉన్నాయని, అయితే ఇప్పటిదాకా వీటి కింద శిక్షలు పడలేదన్నారు. రాష్ట్ర చట్టాలు వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించలేకపోతున్నాయన్నారు.

జమ్మూకశ్మీర్‌లో భారీగా బదిలీలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడం కంటే ముందే పెద్ద ఎత్తున అధికారుల బదిలీలు జరిగాయి. 89 మందిని బదిలీ చేస్తూ, పోస్టింగ్‌లు ఇస్తూ జమ్మూకశ్మీర్ సాధారణ పరిపాలనా విభాగం గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో వివిధ శాఖల సెక్రెటరీలు, కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు డైరెక్టర్ జనరల్స్, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు ఉన్నారు. పూంచ్, బందీపురా జిల్లాల డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులను వారి సొంత జిల్లాలు/ప్రాంతాల నుంచి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 31న ఆదేశాలు జారీ చేసింది.

బదిలీల గుట్టు ఏమిటో తేల్చండి

కేంద్ర ఎన్నికల సంఘానికి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి



శ్రీనగర్/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల కోసం ప్రజలు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, వారి నిరీక్షణ ఫలించి ఎట్టకేలకు షెడ్యూల్ వచ్చిందని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అసలు ఎన్నికల జరగకపోవడం కంటే ఆలస్యంగా జరగడం మేలేనని వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, త్వరలో ప్రచారం ప్రారంభిస్తామని చెప్పారు. కేవలం మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించడం మంచి పరిణామమేనని అన్నారు. పార్టీలకు ఇదొక కొత్త ప్రయోగం అవుతుందని అభిప్రాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో గత 24 గంటల వ్యవధిలో పెద్ద ఎత్తున అధికారులను బదిలీ చేశారని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ బదిలీల వ్యవహారంపై దృష్టి పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

రక్షణ కార్యదర్శిగా రాజేష్ సింగ్



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉన్నతస్థాయిలో పలువురు సీనియర్ బ్యూరోకాట్లను బదిలీ చేసి కొత్త స్థానాల్లో నియమించింది. రాజేష్ సింగ్ రక్షణశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న రాజేష్ తొలుత రక్షణ మంత్రిత్వ శాఖలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా చేరతారు. ప్రస్తుత రక్షణశాఖ కార్యదర్శి అరమానే గిరిధర్ అక్టోబరు 31న పదవీ విరమణ చేయనున్నారు. అప్పుడు గిరిధర్ స్థానంలో రాజేష్ బాధ్యతలు స్వీకరిస్తారు. పున్యా సలీలా శ్రీవాస్తవ ఆరోగ్యశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. పస్తుతం మైనారిటీ వ్యవహారాల కార్యదర్శిగా ఉన్న కటికిథల శ్రీనివాస్.. హౌసింగ్, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. సీనియర్ బ్యూరోకాట్ దీప్తి ఉమాశంకర్‌ను రాష్ట్రపతి కార్యదర్శిగా నియమించారు. నాగరాజు మద్దిరాల ఆర్థిక సేవల కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం నాగరాజు బొగ్గుశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్నారు.

హిందువులకు రక్షణ కల్పిస్తాం: యూనుస్



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత కల్పిస్తామని, దాడుల నుంచి రక్షణ కల్పిస్తామని తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్ భారత ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. యూనుస్ శుక్రవారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాతి పరిణామాల్లో మోదీ, యూనుస్‌లు మాట్లాడుకోవడం ఇదే తొలిసారి. 'ప్రజాస్వామ్యయుత, సుస్థిర, శాంతికాముక, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పునరుద్ఘాటించాను' అని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. 'ప్రొఫెసర్ యూనుస్ కాల్ చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై మాట్లాడుకున్నాం. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలకు రక్షణ కల్పిస్తామని, సురక్షితంగా చూసుకుంటామని హామీ ఇచ్చారు' అని మోదీ తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల్లో బంగ్లాదేశ్ ప్రజలకు సహాయపడటానికి కట్టుబడి ఉన్నామని యూనుస్‌కు తెలిపారు. అదే సమయంలో బంగ్లాదేశ్‌లోని హిందువులకు భద్రత కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితి అదుపులోకి వచ్చిందని, సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని మోదీకి స్పష్టంచేసినట్లు యూనుస్ 'ఎక్స్'లో తెలిపారు.

పుణె, థానే, బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో పుణే, థానే, కర్ణాటక రాజధాని బెంగళూరులో మెట్రో రైలు ప్రాజెక్టుల పొడగింపునకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-3లో రెండు కొత్త కారిడార్ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 44.65 కిలోమీటర్ల పొడవైన ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లలో మొత్తం 31 స్టేషన్లు ఉంటాయని ప్రభుత్వం వెల్లడించింది. జేపీ నగర్- కెంపపురా, హోసహళ్లి- కడబగెరే కారిడార్ల నిర్మాణానికి రూ.15,611 కోట్ల ఖర్చు కానుంది. బెంగళూరు పశ్చిమ ప్రాంతాన్ని ఈ మెట్రో రైలు ప్రాజెక్టు మెరుగ్గా అనుసంధానిస్తుందని కేంద్రం పేర్కొంది. పుణె మెట్రో ఫేజ్-1లో స్వరగేట్- కాత్రాజ్ భూగర్భ రైల్వే లైన్ పొడిగింపునకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. పుణే శివార్లలో కనెక్టివిటీని పెంచే ఈ లైన్-1బి పొడిగింపు ప్రాజెక్టు వ్యయం రూ.2,954 కోట్లని, కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చును సమంగా భరిస్తాయని తెలిపింది. థానే పశ్చిమ ప్రాంతాన్ని కలుపుతూ వెళ్లే.. థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టు కారిడార్‌కు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కారిడార్‌లో 22 స్టేషన్లు ఉంటాయి. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 12,200 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా భరిస్తాయని వెల్లడించింది.

రెండు విమానాశ్రయాల విస్తరణ

మౌలిక సదుపాయాల అభివృద్ధిని కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం రెండు విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేసింది. పశ్చిమబెంగాల్‌లోని బగ్డోగ్రా విమానాశ్రయంలో రూ. 1,549 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టనున్నారు. బిహార్‌లోని బిహ్తా విమానాశ్రయాన్ని రూ. 1,413 కోట్లతో విస్తరించనున్నారు.

థాయిలాండ్ ప్రధాని పీఠంపై పేటోంగ్‌టార్న్!

పార్లమెంటరీ ఓటింగ్‌లో మెజారిటీ సాధించిన యువ నాయకురాలు

బ్యాంకాక్: థాయిలాండ్ రాజకీయాల్లో షినవత్రల మరో కుటుంబ వారసురాలు ప్రధాని పీఠాన్ని అధిష్టించడానికి రంగం సిద్ధమైంది. నూతన ప్రధాని ఎన్నిక కోసం పార్లమెంటరీ ఓటింగ్‌లో అధికార ఫ్యూ థాయ్ పార్టీ తరఫున అభ్యర్థిగా నిలబడిన నాయకురాలు పేటోంగ్‌టార్న్ షినవత్ర ఓటింగ్‌లో సాధారణ మెజారిటీకి కావాల్సిన 247 ఓట్లను దాటేశారు. దీంతో పేటోంగ్‌టార్న్ నూతన ప్రధానిగా పగ్గాలు చేపట్టడం ఖాయమైంది. దీంతో షినవత్ర కుటుంబం నుంచి ప్రధాన మంత్రి అవుతున్న మూడో వ్యక్తిగా పేటోంగ్‌టార్న్ పేరు చరిత్రలో నిలిచిపోనుంది. గతంలో పేటోంగ్‌టార్న్ తండ్రి తక్షిన్ షినవత్ర, మేనత్త ఇంగ్లక్ షినవత్ర ప్రధానమంత్రులుగా చేశారు. 37 ఏళ్లకే ప్రధాని పదవి చేపడుతున్న నేపథ్యంలో థాయిలాండ్‌లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అతి పిన్న వయస్కురాలిగా, రెండో మహిళగా రికార్డ్‌నెలకొల్పనున్నారు. నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను ఆ పదవి నుంచి బుధవారం థాయిలాండ్‌లోని రాజ్యాంగ ధర్మాసనం తప్పించిన విషయం విదితమే.

సాక్షి
కరీంనగర్
శనివారం । 17 । ఆగస్టు । 2024


అమ్మవారిని దర్శించుకుంటున్న యువతులు


మహాశక్తి ఆలయంలో భక్తుల రద్దీ

వరలక్ష్మీ నమోస్తుతే..





పసుపు, కుంకుమ వాయినం ఇచ్చుకుంటూ..


వాయినం ఇస్తున్న మేయర్ సతీమణి అపర్ణ

ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, వ్రతాలు, వాయినాలతో శ్రావణ శుక్రవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా.. వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చనలు, అమ్మవారి నామస్మరణ, దీపకాంతులతో వెలుగొందాయి. ముత్తైదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించారు. చైతన్యపురి మహాశక్తి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం సామూహిక కుంకుమార్చన వైభవంగా సాగింది. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఎమ్మెల్యే కమలాకర్ కుటుంబసభ్యులు, మేయర్ సునీల్‌రావు సతీమణి అపర్ణ ప్రత్యేక పూజలు చేశారు. కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో పర్వతవర్ధిని అమ్మవారికి, పాతబజార్ గౌరీశంకరాలయంలో రాజరాజేశ్వరీదేవికి విశేషాలంకరణ చేశారు.

– కరీంనగర్ కల్చరల్


వరలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

న్యూస్‌రీల్

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్‌గా చంద్రశేఖర్


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ చంద్రశేఖర్‌ను నియమిస్తూ శుక్రవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో పూర్తి డీసీహెచ్‌ఎస్‌గా ఉంటూ డిప్యూటేషన్‌పై కరీంనగర్ ఆస్పత్రి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటేషన్లను రద్దు చేసింది. దీనిపై కోర్టుకు వెళ్లిన కృష్ణప్రసాద్ ఫిబ్రవరి 7నుంచి హైకోర్టు ఆదేశాలతో అదేపోస్టులో కొనసాగుతున్నారు. కృష్ణప్రసాద్ విధి నిర్వహణలో విఫలమయ్యారని, అధికారిక ఆదేశాలు పాటించడం లేదని, రోగుల సంరక్షణ, పరిపాలనకు అసౌకర్యం కలుగుతోందని, వీటిపై వివరణ ఇవ్వాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సీనియర్ అనెస్తీషియా వైద్యుడిగా పని చేస్తున్న చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి


గండిని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు

శంకరపట్నం: శంకరపట్నం మండలం పరిధిలోని గండి పడిన కల్వల ప్రాజెక్టును యుద్ధప్రాతిపాదికన పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కల్వల ప్రాజెక్టు గండిని శుక్రవారం పరిశీలించారు. గతేడాది ప్రాజెక్టుకు గండిపడగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రింగ్‌బండ్ వేసిందని, గతనెలలో కురిసిన వర్షాలకు బండ్ కొట్టుకుపోయిందని, మరమ్మతు చేపట్టకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతోందని మత్స్యకారులు విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, సంపత్‌రావు, అనిల్, ఆదిరెడ్డి, తిరుపతిరెడ్డి, డి.కొమురయ్య పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సంబరాలు


ఎస్‌ఈ గంగాధర్‌ను సన్మానిస్తున్న టీఈఈ 1104 యూనియన్ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ ఆవరణలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ప్రాంతీయశాఖ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. జేఎల్‌ఎం నుంచి ఏఎల్‌ఎంలుగా కరీంనగర్ సర్కిల్, టౌన్ డివిజన్లలో 83మందికి, రూరల్ డివిజన్‌లో 73 మందికి, హుజూరాబాద్ డివిజన్‌లో 49 మందికి పదోన్నతులు లభించడంలో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి చొరవ మరువలేనిదని, ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పదోన్నతులకు సహకరించిన ఎస్‌ఈ వి.గంగాధర్, డీఈలు జె.రాజం, ఎం.తిరుపతి, ఎస్.లక్ష్మారెడ్డి, పి.విజేందర్‌రెడ్డి, ఎస్‌ఏవో ఎ.రాజేశంను సన్మానించారు. యూనియన్ ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు వీరయ్య, భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగరావు, అదనపు కార్యదర్శి రమణారెడ్డి, డివిజన్ నాయకులు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, మల్లేశం, సురేఖ, రంగు వెంకటనారాయణ, వినీల్‌కుమార్, రాష్ట్ర నాయకులు మహేందర్ రావు, అంజయ్య, రమణారావు, నారాయణ పాల్గొన్నారు.

రేపు సర్వాయి పాపన్న జయంతి వేడుకలు


కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్‌ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, జిల్లా ప్రజాప్రతినిధులు, గౌడ కుల బాంధవులు హాజరు కావాలని కోరారు.

మాఫీ అయోమయం!

- మండలాల వారీగా ఇంకా అందని జాబితా
- మాఫీ అయినా ఖాతాల్లో జమకాలేదని రైతుల ఆందోళన
- రెండువిడతల్లో ఎదురైన సమస్యలే పునరావృతం
- 3.7 లక్షలకు 2.33 లక్షల మందికే రుణాలు రద్దు
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా అన్నదాతలు దూరం



ఉమ్మడి జిల్లా రుణమాఫీ సమాచారం



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ప్రభుత్వ ప్రతిష్టాత్మక రుణమాఫీ పథకం మూడో విడత పూర్తయింది. సీఎం రేవంత్‌రెడ్డి.. తాను చెప్పినట్లు ఆగస్టు 15లోగా మూడువిడతల్లో రుణం మాఫీ చేశారు. అయితే, అర్హులందరికీ మాఫీ కాలేదని, దాదాపు లక్ష మందికిపైగా అర్హులు దూరంగా ఉన్నామని చెబుతున్నారు. రుణమాఫీ జాబితా తమకు అందలేదని కొందరు, తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకాలేదని ఇంకొందరు, బ్యాంకు నుంచి తమకు ఇంకా ఎస్‌ఎంఎస్‌లు రాలేదని మరికొందరు రైతులు ఆరోపిస్తున్నారు. మొత్తానికి సాంకేతిక కారణాలతో మూడవిడతలోనూ సంపూర్ణంగా జరగలేదన్న వాదన పునరావృతమవుతోంది.

లక్ష మంది దూరమయ్యారా?

కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో దాదాపు 3.2 లక్షల నుంచి 3.7 లక్షల మందికిపైగా రైతులున్నారు. వీరేకాక ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు సైతం సాగు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడుదశల్లో 2,35,824 మందికి రూ.1,843.19 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ సంఖ్యతో రైతులు విభేదిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 3,77,984 మందికి రూ.లక్ష లోపు రుణమాఫీ జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 2.33 లక్షల మందికి రుణమాఫీ చేసిందని అన్నదాతలు మండిపడుతున్నారు.

పీఎం కిసాన్/ సాంకేతిక సమస్యలు..

రుణమాఫీ కాకపోవడానికి పీఎం కిసాన్ మెలికనే ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికితోడు ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో ఉండటం, పింఛన్‌దారులు ఉండటం, రేషన్‌కార్డు లేకపోవడం, కుటుంబాలు నిర్ధరణ కాకపోవడం (కొత్తకాపురాలు), ఆదాయపు పన్ను చెల్లించడం తదితర కారణాలతో మాఫీ కాలేదు. ఆధార్‌లోని పేరు, బ్యాంకు ఖాతాలో పేరుకు సరిపోకపోవడం, లోన్ రీషెడ్యూల్ చేసుకోవడం, ముందే చెల్లించి ఉండటం తదితర కారణాలు తోడయ్యాయి. ఉమ్మడి జిల్లాలో లక్షమందికిపైగా రుణమాఫీకి దూరంగా ఉండిపోయామని ఆవేదన చెందుతున్నారు. మండలాల జాబితా అందకపోవడం, బ్యాంకుల్లో నగదు జమకాకపోవడం, ఎస్సెమ్మెస్‌లు రాకపోవడం వీరి ఆందోళనను రెట్టింపు చేస్తోంది.

ఖాతాలో జమ కాలే



వీణవంకలోని యూనియన్ బ్యాంకులో 2023లో రూ.1.50లక్షల క్రాప్‌లోన్ తీసుకున్న. మిత్తితో కలిపితే రూ.1.60లక్షలు అయ్యింది. రుణమాఫీ కింద అర్హుడిని అయినా, ఇప్పటివరకు నా బ్యాంకు ఖాతాలో డబ్బు జమకాలే. మూడోవిడత డబ్బులు విడుదల చేస్తున్నట్లు సీఎం గురువారం చెప్పిండ్రు. శుక్రవారం బ్యాంకుకు పోయిన. బ్యాంకు ఖాతాలో ఇంకా పైసలు జమకాలేదని అధికారులు చెప్పిండ్రు. వ్యవసాయ అధికారులు ఇప్పటి వరకూ రుణమాఫీ లిస్ట్ విడుదల చేయలే.

– సతీశ్, రైతు, బేతిగల్, వీణవంక మండలం

వైద్యుల నిరసన

కరీంనగర్‌టౌన్: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ శుక్రవారం కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రి ఎదుట వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు వైద్య సేవలు నిలిపివేత

జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు కరీంనగర్‌లోని అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు నిలిపివేసి, ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు రాంకిరణ్, వెంకట్‌రెడ్డి తెలిపారు.



కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

విలీన గ్రామాల్లో తాగునీటి సరఫరా

- మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని విలీన గ్రామాల్లో త్వరలో తాగునీటి సరఫరా పనులు చేపట్టనున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శుక్రవారం నగరంలోని 12వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో రూ.20.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. కాలనీలో తిరుగుతూ సమస్యలను ఆరాతీశారు. రోడ్డుపై నీళ్లు నిలిచి ఉండడాన్ని పరిశీలించి, తొలగించేందుకు ఆదేశాలిచ్చారు. అమృత్ 2 పథకం కింద విలీన డివిజన్‌లలో తాగునీటి సరఫరా పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. త్వరలోనే ఈ పనులు చేపడతామన్నారు. విలీన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపనున్నట్లు వివరించారు. నగర ప్రజానీకంపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, అభివృద్ధి పనుల జాతర కొనసాగించామన్నారు. అన్ని డివిజన్‌లలో రోడ్లు, డ్రైనేజీల సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నగరంలో వెంకటేశ్వరకాలనీ తరహాలోనే కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయన్నారు. అలాంటి కాలనీల్లోనూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. 12 వ డివిజన్ లో దాదాపు 75 అభివృద్ధి పనులు చేపట్టామని, అంబేడ్కర్ స్టేడియం నుంచి సిరిసిల్ల బైపాస్ రోడ్డు వరకు రాంచంద్రపూర్‌కాలనీ రోడ్డును సుందరంగా మార్చామని తెలిపారు. కార్పొరేటర్ తోట రాములు, డీఈ ఓం ప్రకాశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: 2024–25వ విద్యా సంవత్సరానికిగాను విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ద్వారా నిర్వహించే అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు రూ.20లక్షల స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ఎం.నగైలేశ్వర్ తెలిపారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబర్ 13వ తేదీ వరకు [illegible] లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు కరీంనగర్ జిల్లాకి చెందిన ఎస్సీలై ఉండాలి, సంవత్సర ఆదాయం రూ.5లక్షలకు మించరాదని, డిగ్రీలో 60శాతం కన్నా ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలన్నారు. పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా ‘వెలిచాల’!



సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)కి త్వరలో కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు చేతికి డీసీసీ పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే వెలిచాల రాజేందర్‌రావు పేరును ఖరారు చేసింది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుతం మానకొండూరు శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వెలిచాల రాజేందర్‌రావుకు డీసీసీ పగ్గాలు అప్పగించాలని పార్టీపెద్దలు నిర్ణయించారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని సీనియర్ నాయకులు ‘సాక్షి’కి తెలిపారు. అయితే డీసీసీ పదవి కోసం పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా పోటీ పడుతున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే పదవికి పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు సైతం ఉన్నారు.

‘పోషణ ఆరోగ్య జాతర’పై సమీక్ష

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో త్వరలో నిర్వహించే ‘పోషణ ఆరోగ్య జాతర’పై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతి యునిసెఫ్ ప్రతినిధులతో సమీక్షించారు. పోషణ, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ‘పోషణ ఆరోగ్య జాతర’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషణ ఆరోగ్య జాతర నిర్వహణకు మానకొండూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. పోషణ జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, యునిసెఫ్ అధికారులు డాక్టర్ క్యాతీ తివారి, బీవీ.సుబ్బారెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సునీత, డీఎంహెచ్‌వో సుజాత, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, పంచాయతీ రాజ్ ఏవో ఫరీదుద్దీన్, మానకొండూర్ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.


మానకొండూరు పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, యూనిసెఫ్ ప్రతినిధులు

దంచికొట్టిన వాన

- అత్యధికంగా గుండిలో 7.1సెం.మీల వర్షం నమోదు


కరీంనగర్ అర్బన్/గన్నేరువరం/గంగాధర: కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఒక్కసారిగా ఉపశమనం లభించింది. వర్షాకాలంలో వేసవిని మరిపించగా జనం కూలర్లను ఆశ్రయించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా వర్షం కురియగా పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. గుండి(రామడుగు)లో అత్యధికంగా 7.1సెంటిమీటర్ల వర్షపాతం నమోదవగా చిగురుమామిడిలో 5.9, వెదురుగట్ట(చొప్పదండి) 5.8, గంగాధర 5.6, ఈదురుగుట్టపల్లి(మానకొండూరు) 4.0, కరీంనగర్ 3.5సెం.మీల వర్షపాతం నమోదైంది. గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో మొక్కజొన్న పంటకు అపార నష్టం వాటిల్లింది. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తా వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో వర్షానికి భారీ వృక్షం నేలకూలింది.


పారువెల్లలో నేలవాలిన మొక్కజొన్న పంట

సిటీలో పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కె.వీ.వావిలాలపల్లి, బ్యాంక్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, హౌజింగ్‌బోర్డుకాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని వావిలాలపల్లి, జ్యోతినగర్, క్రిస్టియన్‌కాలనీ, ఐబీ, సివిల్ ఆసుపత్రి, వెంకటేశ్వర, బ్యాంక్‌కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్, కోర్టురోడ్, జగిత్యాల రోడ్, సుభాష్‌నగర్, మంచిర్యాల ఎక్స్‌రోడ్, కిషన్‌నగర్,తీగలగుట్టపల్లి, కాపువాడ, హౌజింగ్‌బోర్డు,కమాన్,ఎల్లమ్మ 11 కే.వీ. ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. 9.30 నుంచి 11.30వరకు 33/11 కె.వీ.ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల సబ్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్, భాగ్యనగర్, విద్యానగర్, ఆదిత్యనగర్, జ్యోతినగర్, విజయదుర్గ కాలనీ, కొత్త లేబర్ అడ్డ, 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కె.వీ.కలెక్టరేట్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్,బస్టాండ్, వన్‌టౌన్, దోబీవాడ, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, ముకరంపుర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ పేర్కొన్నారు.

భావి వైద్యులకు భద్రతేది?



కోల్‌కతాలోని ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆమెపై గ్యాంగ్‌రేప్ జరిగిందన్న అనుమానాలను నాలుగు పేజీల పోస్టుమార్టం నివేదిక బలపరుస్తోంది. వైద్యురాలి కాళ్లు విరిచేశారని, రేప్ చేశాక గొంతు నులిమి చంపేశారని పేర్కొంది. ఆమె ఒళ్లంతా గాయాలున్నాయని, ఒక్క వ్యక్తే ఇలా చేయలేదని, ఇది కచ్చితంగా గ్యాంగ్ రేపేనని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సువర్ణ గోస్వామి తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో భద్రత, వసతులపై విద్యార్థినుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. కరీంనగర్, సిరిసిల్ల, రామగుండం మెడికల్ కాలేజీల్లో పరిస్థితులపై ప్రత్యేక కథనం.

– వివరాలు 8లో...

క్లుప్తంగా

మొరాయించిన రైల్వేగేట్.. ప్రయాణికుల పాట్లు



జగిత్యాలక్రైం: జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై నమిలికొండ రైల్వేగేట్ మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం భారీ వర్షం కురిసిన తర్వాత రైలు వస్తుందని తెలిసి సిబ్బంది గేటు వేశారు. రైలు వెళ్లిపోయిన తర్వాత సాంకేతిక లోపంతో గేటు తెరుకోలేదు. సుమారు గంట పాటు ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచి పోయాయి. రైల్వే టెక్నీషియన్ సహాయంతో గేటు ఓపెన్ చేసి రాకపోకలను పునరుద్ధరించారు. వర్షం కారణంగానే రైల్వేగేటులో సాంకేతిక లోపం తలెత్తిందని అధికారులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు



పెగడపల్లి(ధర్మపురి): గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. పెగడపల్లి నుంచి బతికపల్లి వైపు రెండు బైక్‌లపై వెళ్తున్న యువకులను ఆపి, తనిఖీ చేయగా 200 గ్రాముల గంజాయి లభించింది. జగిత్యాలకు చెందిన విగ్నేశ్, భువన్, సూర్యలతోపాటు మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పెగడపల్లికి చెందిన మల్యాల అజయ్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో గంజాయి, బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీజేపీ నాయకుడి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు నేవూరి దేవేందర్‌రెడ్డి(48) ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. దేవేందర్‌రెడ్డి వ్యవసాయం చేస్తూనే.. రెండు దశాబ్దాలుగా బీజేపీలో వివిధ పదవుల్లో కొనసాగారు. సాగులో వచ్చిన నష్టాలతోపాటు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. మద్యానికి బానిసై, తరచూ భార్యతో గొడవ పడేవారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నారు. దేవేందర్‌రెడ్డి మృతదేహానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు కంచర్ల పర్శరాములు, చందుపట్ల లక్ష్మారెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి, కోనేటి సాయిలు నివాళి అర్పించారు. మృతుడికి భార్య నర్మద, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

'హ్యాండ్లూమ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి'

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) డిప్లొమా కోర్సును ప్రారంభిస్తోందని సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు మిట్టకోల సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో 2024–25కు సంవత్సరానికి గానూ 60 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. పదోతరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. 01.07.2024 నాటికి బీసీలు, జనరల్ కేటగిరీల వారికి వయోపరిమితి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు చూడాలని, సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్‌లోనూ సంప్రదించవచ్చని సూచించారు.

భావి వైద్యులకు భద్రతేది?

- ఉమ్మడి జిల్లాలోని మెడికల్ కాలేజీల్లో పూర్తవని భవన నిర్మాణాలు
- తరగతులు ఒకచోట.. వసతి మరోచోట
- సీసీ కెమెరాల ఏర్పాటు. పర్యవేక్షణ కరువు

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్‌టౌన్/సిరిసిల్లటౌన్/కోల్‌సిటీ(రామగుండం): వైద్య విద్య.. జీవితంలో డాక్టర్‌గా స్థిరపడాలనుకునేవారి కలను నిజం చేస్తుంది. వైద్యులుగా రాణించాలనుకునేవారు ఎంబీబీఎస్‌లో చేరుతారు. మన రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్యను పెంచడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, రామగుండం, జగిత్యాలల్లో కొత్తగా ఏర్పాటయ్యాయి. అన్నిచోట్ల తరగతులు కొనసాగుతున్నాయి. అయితే, ఎక్కడా కాలేజీలకు సంబంధించిన భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. తరగతులు ఒకచోట, వసతి మరోచోట నిర్వహిస్తున్నారు. హాస్టళ్లు, కళాశాలల్లో సీసీ కెమెరాలు, కళాశాల భవనాలకు ప్రహరీలు లేవు. కెమెరాలు ఉన్నచోట అవి పని చేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి. కోల్‌కతా ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో మన విద్యార్థినుల భద్రతపై ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుకోని ఘటన జరిగితే ఎవరు బాధ్యులని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.



కొత్తపల్లిలోని కరీంనగర్ వైద్య కళాశాల

రామగుండం : ఎన్ని కెమెరాలు పని చేస్తున్నాయో?





రామగుండం మెడికల్ కాలేజీ, కెమెరాలు లేని జీజీహెచ్ కొత్త బ్లాక్

రామగుండం సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీ భవనంతోపాటు నాలుగు బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్లు, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, గెస్ట్‌హౌస్, కిచెన్, డైనింగ్, క్యాంటీన్ హాళ్లు నిర్మించారు. ప్రస్తుతం ఫస్టియర్, సెకండియర్ కలిపి మొత్తం 300 విద్యార్థులున్నారు. అయితే, కళాశాలలో ఎన్ని సీసీ కెమెరాలున్నాయో.. వాటిలో ఎన్ని పని చేస్తున్నాయో సంబంధింత అధికారులే సరైన వివరాలు చెప్పలేకపోతున్నారు. 200 కెమెరాలు ఏర్పాటు చేశామని అంటున్నా వాటిపై మానిటరింగ్ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. గతంలో బాయ్స్ హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీంతో సెకండియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరిట ఫస్టియర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థుల జుట్టును కత్తిరించారు. గోదావరిఖని జీజీహెచ్‌లో కొత్తగా 85 బెడ్స్ బ్లాక్ నిర్మించారు. ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్లకు ఇక్కడే ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే తెలుసుకునేందుకు ఒక్క సీసీ కెమెరా లేదు. ఆస్పత్రి భవనంలో కొన్నిచోట్ల ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు.

కరీంనగర్ : వేర్వేరు చోట్ల తరగతులు, వసతి



తీగలగుట్టపల్లిలోని విద్యార్థినుల వసతి గృహం

కరీంనగర్ వైద్య కళాశాల 2023–24 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమైంది. 100 సీట్లున్న ఈ కాలేజీకి పక్కా భవనం లేదు. దీంతో కొత్తపల్లి శివారులోని విత్తనాభివృద్ధి సంస్థ గోదాంలను ఆధునీకరించి, పరిపాలన భవనం, తరగతి గదులు, ల్యాబ్ ప్రారంభించారు. విద్యార్థులకు వసతి గృహాలకు అవసరమైన భవనాలు లేకపోవడంతో వేర్వేరుగా అద్దెకు తీసుకున్నారు. విద్యార్థినులు ఉంటున్న తీగలగుట్టపల్లిలోని అద్దె భవనానికి రక్షణ అంతంతమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. సెల్లార్‌కు ఒక గేట్‌ను అమర్చి, సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. సెల్లార్‌లో గానీ, గ్రౌండ్ ఫ్లోర్‌లో గానీ ఎక్కడా సీసీ కెమెరాలు కనిపించలేదు. హాస్టల్లో భద్రతా చర్యలను పరిశీలించేందుకు వెళ్లిన 'సాక్షి' విలేకరులను అక్కడి సెక్యూరిటీగార్డు అడ్డుకున్నారు. లోపలికి అనుమతి ఇవ్వాలని వార్డెన్ శిరీషను కోరగా డీఎంఈని సంప్రదించాలని, ప్రిన్సిపాల్ అందుబాటులో లేరంటూ దాటవేశారు. వసతి గృహంలో అన్ని సౌకర్యాలు, రక్షణ చర్యలు ఉంటే అనుమతించవచ్చు కదా అని అడిగిన ప్రశ్నకు సమాధానం లేదు. టీ, స్నాక్స్, భోజనం మగవారే తీసుకెళ్తున్నప్పుడు తమను ఎందుకు అనుమతించరని ప్రశ్నించగా.. అనుమతి లేదంటూ తిరస్కరించారు. అప్పటి వరకు సెల్లార్ గేట్ తీసి ఉంచిన సెక్యూరిటీ సిబ్బంది కాసేపటికే మూసివేయడం కొసమెరుపు.

సిరిసిల్ల : 4 కిలోమీటర్లు వెళ్లాలి



ప్రహరీ లేని సిరిసిల్ల వైద్య కళాశాల భవనం

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పెద్దూరు శివారులో ఏర్పాటు చేసిన వైద్య కళాశాల ఐదంతస్తుల్లో నిర్మిస్తున్న భవనంలో నడుస్తోంది. ఈ కాలేజీ గతేడాది 100 సీట్లతో ప్రారంభమైంది. వచ్చే నెలలో ఎంబీబీఎస్‌లో కొత్తగా చేరేవారితో విద్యార్థుల సంఖ్య 200కు చేరనుంది. విద్యార్థులకు పెద్దూరు శివారులోని సర్దాపూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ వసతి కల్పించారు. ఇది కాలేజీకి 4 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సులో వెళ్తున్నారు. ఇక్కడ ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. రోజుకు రెండు షిఫ్టుల్లో ఇద్దరు కేర్‌టేకర్లు(మేల్ 1, ఫిమేల్ 1), వార్డెన్లు 2, డిప్యూటీ వార్డెన్లు 2, ఇతర సిబ్బంది 10 మంది విధుల్లో ఉన్నారు. అయితే, వీధిలైట్లు, సీసీ కెమెరాలు సరిగా లేవు. కళాశాల భవనం పూర్తి కావస్తున్నా చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. కాలేజీలో సుమారు 60 సీసీ కెమెరాలు ఉండగా.. హాస్టల్ భవనంలో లేవు. కళాశాలతోపాటు వసతిగృహంలో పోలీస్ సెక్యూరిటీ కావాలని విద్యార్థులు కోరుతున్నారు.



హాస్టల్ భవనంలో వెలగని లైట్

24 గంటలూ నిఘా



విద్యార్థులపై 24 గంటలూ మా స్టాఫ్ నిఘా ఉంచుతారు. వారికి కావాల్సిన వసతులు కల్పిస్తారు. సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య పెంచుతున్నాం. హాస్టల్, కళాశాల భవనాల నిర్మాణంపై కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులను కళాశాల నుంచి హాస్టల్‌కు బస్సులో ఉచితంగా తీసుకెళ్లి, తిరిగి తీసుకువస్తున్నాం.

– డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

జర్నలిస్ట్ కుటుంబానికి అల్లం నారాయణ పరామర్శ



నివాళి అర్పిస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

గోదావరిఖని(రామగుండం): ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాయిని మధునయ్య కుటుంబాన్ని టీయూడబ్ల్యూజే–143 రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్నాని మారుతీసాగర్ శుక్రవారం పరామర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని మధునయ్య నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మధునయ్య నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిజంలో చేసిన సేవలు మరువలేనివని అల్లం నారాయణ గుర్తుచేశారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు, యూనియన్ నాయకులు రాంగోపాల్, లాయక్‌పాషా, నవీన్, ఎడ్ల రవీందర్ రెడ్డి, ముచ్చకుర్తి కుమార్ తదితరులు ఉన్నారు.

సింగరేణి ఉద్యోగి అదృశ్యం



రామ్మోహన్

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి ఉద్యోగి రామ్మోహన్ అదృశ్యమైనట్లు ఎన్టీపీసీ ఏఎస్సై బుచ్చి నాయుడు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అన్నపూర్ణ కాలనీకి చెందిన సింగరేణి 11 ఇంక్లైన్ ఉద్యోగి ధర్మల రామ్మోహన్ ఈ నెల 12వ తేదీన విధులు ముగించుకొని, కొత్తగూడెం వెళ్తానని భార్య రాజకుమారికి చెప్పి, వెళ్లాడు. కానీ, ఇంటికి తిరిగి రాలేదు. బాధిత కుటుంబసభ్యులు చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో అతని భార్య శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

మా బంగారు తల్లుల కడుపులో పుడతా

- భార్యకు మెస్సేజ్ పెట్టి, భర్త బలవన్మరణం
- అప్పులే కారణం



మిథున్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: 'సారీ.. మళ్లీ జీవితం అంటూ ఉంటే మా బంగారు తల్లుల కడుపులో పుడతా..' అంటూ భార్యకు వాట్సాప్ మెస్సేజ్ పెట్టిన భర్త తెల్లారేసరికి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. మెస్సేజ్ చదివిన ఆమె పరిగెత్తుకు వచ్చేసరికి ఉరితాడుకు వేలాడుతూ కనిపించడంతో గుండె పగిలేలా రోదించింది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన గీకురు మిథున్(35)కు కట్టరాంపూర్‌కు చెందిన మౌనికతో 2013లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మిథున్ డిష్ నడిపించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పులు, బ్యాంకు లోన్లు ఉండటంతో వాటిని ఎలా తీర్చాలంటూ తరచూ భార్యతో బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో పనికి సరిగా వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మౌనికకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పిల్లలను తీసుకొని, పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు లేచేసరికి ఆమె ఫోన్‌కు భర్త నుంచి మెస్సేజ్ వచ్చింది. అది చదివిన ఆమె వెంటనే భగత్‌నగర్‌లోని ఇంటికి వెళ్లింది. తలుపు గడియ పెట్టి ఉండటంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దింపి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాజన్న సన్నిధిలో శ్రావణ సందడి



మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

వేములవాడ: శ్రావణ శుక్రవారం సందర్భంగా వేములవాడ రాజన్న సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. ఉక్కపోత అధికంగా ఉండటంతో క్యూలైన్లలో ఇబ్బంది పడ్డారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, తలనీలాలు, నిలువెత్తు బెల్లం, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

'అల్ఫోర్స్'లో శ్రావణ శుక్రవార పూజలు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో శ్రావణ శుక్రవార పూజలతోపాటు రాఖీ వేడుకలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు విద్యార్థినులు ఆయనకు రాఖీ కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బుల కోసం కన్నబిడ్డలనే అమ్మింది!

- బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో ఓ మహిళ బాగోతం వెలుగులోకి?

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ మహిళ డబ్బుల కోసం తన ఇద్దరు కూతుళ్లను అమ్మిన విషయం పోలీసుల విచారణలో బయటపడినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పోతంగల్‌కు చెందిన మహిళకు అదే జిల్లా సారంగపూర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్తతో విభేదాలు రావడంతో వారిని తీసుకొని, బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే నాగేశ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, అతనితో కలిసి జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పిల్లలను విక్రయించాలని నిర్ణయించారు. అనాథ పిల్లలని నమ్మించి, మేడిపల్లి మండలం పోరుమల్లలో ఒకరిని, మెట్‌పల్లి పట్టణంలో మరొకరిని సంతానం లేని దంపతులకు విక్రయించారు. సులభంగా డబ్బులు రావడంతో ఇదే దందా చేయాలని అనుకున్నారు. కోరుట్లకు చెందిన దంపతుల కోసం మెట్‌పల్లి పట్టణంలో బాలుడిని కిడ్నాప్ చేశారు. కానీ, పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకోవడంతో వారి వ్యూహం బెడిసికొట్టింది. అనంతరం నాగేశ్‌తోపాటు అతనితో కలిసి ఉంటున్న మహిళను తమదైన శైలిలో విచారించగా, బాలికల విక్రయం వెలుగులోకి వచ్చింది. సీఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా.. అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, తొందరలోనే వాస్తవాలు వెల్లడిస్తామని తెలిపారు.

రాష్ట్ర పోపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ



నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ (పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం పోపా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పోపా అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ ఈమేరకు సత్యనారాయణకు నియామక పత్రం అందజేశారు. పోలు సత్యనారాయణ ప్రస్తుతం కరీంనగర్ జిల్లా పోపా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత నెలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్యనారాయణ పోటీ చేసి విజయం సాధించి పద్మశాలీల సత్తా ఏంటో నిరూపించాలన్నారు. పద్మశాలి సంఘాలన్నీ ఐక్యతతో పనిచేస్తే రాజకీయంగా ఎదుగుతామన్నారు. నాయకులు గద్దం శ్రీరాములు, వొల్లాల కృష్ణహరి, ఎలిగేటి మల్లికార్జున్, మంచికట్ల రమేశ్, గోలి వినోద్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పిస్కా లక్ష్మీనారాయణ, కొక్కుల గోవర్ధన్, ఆడెపు శ్రీనివాస్, దేవసాని సంపత్‌కుమార్, రుద్ర రమేశ్, దండే రాజశేఖర్, ఆదిచెర్ల రాజు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి?



స్వప్న (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (35) ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్ల మృతిచెందినట్లు తెలిసింది. జ్వరంతో బాధ పడుతున్న ఆమెను కుటుంబసభ్యులు గురువారం కేశవపట్నంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారని సమాచారం. ఆయన సెలైన్ పెట్టి, మూడు మాత్రలు వేయించి, రెండు ఇంజక్షన్లు వేశాడని తెలిసింది. తర్వాత స్వప్న పరిస్థితిని గమనించి, వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో తరలించారని, అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో వెళ్లగా చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారని సమాచారం.

ప్రాణం ఖరీదు రూ.2.70 లక్షలు!

స్వప్న ప్రాణం ఖరీదును రూ.2.70 లక్షలుగా పెద్ద మనుషులు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి సస్పెన్స్ కొనసాగగా రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

తేలుకాటుతో వృద్ధుడికి అస్వస్థత

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామానికి చెందిన కొంరయ్య అనే వృద్ధుడు తేలు కాటుతో అస్వస్థతకు గురయ్యాడని స్థానికులు తెలిపారు. శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లిన ఆయనను తేలు కాటు వేసిందన్నారు. బాధితుడు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లగా వైద్య సిబ్బంది చికిత్స చేశారని పేర్కొన్నారు.

సిరిసిల్లలో ఇద్దరి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: ఉపాధి కోసం ప్రారంభించిన ఆటోమొబైల్ షాప్‌లో నష్టం వాటిల్లడంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై అనారోగ్యంతో మనస్థాపానికి గురైన మరో వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు శుక్రవారం సిరిసిల్లలో చోటుచేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన కొండ భాను(35) సిరిసిల్ల ఆటోనగర్‌లో ఆటోమొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల గిరాకీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై షాప్‌లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య దీప్తి, ఐదేళ్ల బాబు, మూడేళ్ల కూతురు ఉన్నారు.

మద్యం మత్తులో ఒకరు..



భాను (ఫైల్)

సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సిరిమల్ల లక్ష్మీనారాయణ(75) అనే వృద్ధుడు చాలా కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వారికి వివాహాలయ్యాయి. కొన్నాళ్ల క్రితం భార్య చనిపోవడంతో ప్రస్తుతం చిన్నకొడుకుతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసకావడంతోపాటు బీపీ, షుగర్ సమస్యలు వెంటాడుతున్నాయి. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లికి చెందిన బూర్ల రాజమల్లు(73) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజమల్లు భార్య ఐదేళ్ల క్రితం మృతిచెందింది. ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వీపు భాగంలో గాయమై, తగ్గకపోగా మానసిక పరిస్థితి సరిగా ఉండటం లేదు. శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొత్త పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు

- జెన్‌కో విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన డైరెక్టర్లు

రామగుండం: మూతపడిన 62.5 మెగావాట్ల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సివిల్, థర్మల్, ప్రాజెక్టు, ప్లానింగ్ డైరెక్టర్లు శుక్రవారం సందర్శించారు. రామగుండంలో 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రం స్థాపించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో సింగరేణికి కాకుండా జెన్‌కో ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని ఇంజినీర్ల జేఏసీ ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు విన్నవించింది. ఈ నేపథ్యంలో బీ–థర్మల్ విద్యుత్ కేంద్ర స్థలంలో 800 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్ స్థాపన సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని డైరెక్టర్లను ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే డైరెక్టర్లు మల్యాలపల్లిలో మార్షలింగ్ యార్డు ఏర్పాటుకు అనుకూలతపై వివరాలు సేకరించారు. తమ భూములు అప్పగించేందుకు గ్రామస్తులు కూడా సుముఖంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. యాష్‌పాండ్ నిర్మాణానికి రాయదండి శివారులోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ ఒత్తిడి మేరకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆ దిశగా కార్యాచరణ వేగవంతం చేసినట్లు స్పష్టమవుతోంది. డైరెక్టర్ల పర్యటన సందర్భంగా విలేకరులెవరినీ లోనికి అనుమతించలేదు. డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందంతోపాటు స్థానిక ప్లానింగ్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్, సివిల్, జనరేషన్ విభాగాలకు చెందిన డీఈలు, ఏడీఈలు ఉన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు 90 రోజుల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలపెమెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను హైదరాబాద్ కుషాయిగూడ ఎల్బీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీలో 100 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం.అనిల్‌ప్రకాశ్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 24 లోగా ఆన్‌లైన్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై..
కరీంనగర్: జిల్లాలో రీజినల్ ట్రైనింగ్ మేనేజర్(1) పోస్టు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేసేందుకు ఈనెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు గెజిటెడ్ ప్రభుత్వ అధికారి అయి ఉండాలని, వయస్సు 62 ఏళ్లు మించొద్దని, 65 సంవత్సరాలు పూర్తి చేయడానికి కనీసం మూడు సంవత్సరాలు మిగిలి ఉన్న రిటైర్డు అధికారులకు ప్రాధాన్య ముందన్నారు.

హ్యాండ్లూం టెక్నాలజీ కోర్సుకు..
కరీంనగర్: జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూం టెక్నాలజీ కోర్సు(ఆరు సెమిస్టర్లు)కు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎస్.చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించిన విద్యార్థులకు 60 సీట్లు కేటాయించిందని, పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు..
కరీంనగర్: డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి(సెప్టెంబర్ 5)ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానానికి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

హమ్ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం

కరీంనగర్: హమ్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ముఖ్య అతిథిగా సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ రఘురామన్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాల నుంచి హమ్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను చూస్తున్నానన్నారు. సంస్థ సభ్యులందరినీ ఘనంగా సన్మానించారు. సభ్యులు అనంతం, అకుతోట సహదేవ్, కుంటాల శ్రీనివాస్, వేణుగోపాల్‌శర్మ, రాఘవేందర్, తిరుపతి, శ్రీధర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, సమత, శ్రీనివాస్, అనిల్, తిరుపతి, జలపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ పనులకు భూమిపూజ



ఫకీర్‌పేటలో కొబ్బరికాయ కొడుతున్న పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్, ఇరుకుల్ల, ఎలబోతారం, జూబ్లీనగర్, ఫకీర్‌పేట గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న ఓపెన్ జిమ్‌లు, హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మాజీ సర్పంచులు రుద్ర రాము, జమీల్ అహ్మద్, ఫకీర్‌పేట పంచాయతీ కార్యదర్శి దేవిక, నాయకులు ఎస్.తిరుపతి, కె.రాంరెడ్డి, ఎం.మంజుల, వి.రవీందర్‌రావు, బి.లక్ష్మణ్, వి.శ్రీనివాస్, బి.శేఖర్, ఎస్.శ్రీనివాస్, హరీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఆర్ ఏఈకి సన్మానం

కరీంనగర్‌రూరల్: మెట్‌పల్లి డీఈగా పదోన్నతిపై బదిలీ అవుతున్న కరీంనగర్ మండల పంచాయతీరాజ్ ఏఈ రమణారెడ్డిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచులు ఘనంగా సన్మానించారు. జక్కం నర్సయ్య, దబ్బెట రమణారెడ్డి, ఊరడి మల్లారెడ్డి, బలుసుల శంకరయ్య పాల్గొన్నారు.

రైల్వే బోర్డు సభ్యుడికి..
కరీంనగర్‌రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడిగా నియామకమైన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతిని శుక్రవారం బొమ్మకల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం ప్రతినిధులు బండి మల్లయ్య, దుంద్ర రాజయ్య, బబ్బూరి కుమార్, గాలి రవి, జంగా కొమురయ్య, తిరుపతి, మను, అంజయ్య, ప్రసాద్, నర్సయ్య, శ్రీనివాస్, కుమార్, కోటి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



మగువా కిట్టి మహిళల పూజలు



సిద్ధార్థలో..

సప్తగిరికాలనీ(కరీంనగర్): శ్రావణ మాసం సందర్భంగా మగువా కిట్టి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, సాహితి, సంధ్య, లావణ్య, కృష్ణవేణి, శ్వేత, రాధ, ఉమ, సంగీతలక్ష్మి, శాలిని, లక్ష్మి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు. మంకమ్మతోట సిద్ధార్థ విద్యాసంస్థల్లో చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి సతీమణి స్వప్నతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్దియాకు వచ్చేవారేరి!

సాక్షి ప్రత్యేకం

- ప్రహసనంగా సాధారణ బదిలీలు
- ఐదుగురు ఏఈలు ట్రాన్స్‌ఫర్ కరీంనగర్‌కు వచ్చింది ఒక్కరే..
- పాలనపై ప్రభావం చూపే చాన్స్



కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బదిలీలు ప్రహసనంగా మారాయి. దీర్ఘకాలికంగా ఉన్న బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేయడంతో గతనెలలో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ బదిలీలు జరగడం తెలిసిందే. బదిలీ అయినవారి స్థానంలో మరో అధికారి రావడం సహజంగా జరిగేదే. కానీ నగరపాలకసంస్థలో మాత్రం కీలకమైన ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు పోవడమే కానీ రాకపోవడం పాలనపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది.

డీసీపీ సరెండర్.. ఏసీపీ బదిలీ
నగరపాలకసంస్థ పరిపాలనలో మరో కీలకమైన విభాగం పట్టణ ప్రణాళిక. ఇప్పుడది సారథి లేని రథంలా మారింది. గతంలో డీసీపీగా ఉన్న సుభాష్‌ను వివిధ కారణాలతో సరెండర్ చేయగా, ఆ పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి ఏసీపీ భానుచందర్ ఇన్‌చార్జి డీసీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల భానుచందర్ బదిలీ కాగా, ఆయన స్థానంలో మరొకరిని కేటాయించలేదు. గతంలోనే మరో ఏసీపీ పోస్టు భర్తీ కాకుండా ఉంది. అంటే రెండు ఏసీపీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. టీపీవో శ్రీహరి స్థానంలో వేణు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం పట్టణ ప్రణాళిక విభాగంలో పైస్థాయి రెండు ప్రధాన పోస్టులు ఖాళీగానే ఉండడంతో, టీపీవో వేణుపైనే బాధ్యతలు ఉన్నాయి. నగరపాలకసంస్థలో కొత్తగా అదనపు కమిషనర్ సువార్త, సహాయ కమిషనర్ వేణుమాధవ్‌లు రావడం కాస్త ఊరట కలిగించే అంశం. ఏదేమైనా క్షేత్రస్థాయి పాలనలో కీలకంగా ఉండే ఇంజినీరింగ్ విభాగంలో పోస్టులు ఖాళీగా లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఐదుగురు ఏఈలు బదిలీ.. వచ్చింది ఒక్కరే..
నగరపాలకసంస్థలో కీలకమైన ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఏఈలు వాణి, నిఖిత, చైతన్య, గఫూర్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ఉన్న గంగాధర్ బదిలీ అయ్యారు. వీరికి బదులుగా ఒక్క ఏఈ సతీశ్ మాత్రమే కరీంనగర్‌కు వచ్చారు. ఐదుగురు ఏఈలకు బదులు ఒక్క ఏఈని మాత్రమే కరీంనగర్‌కు కేటాయించడంపై బల్దియా వర్గాలు విస్మయానికి గురవుతున్నాయి. దీంతో ఆయాస్థానాల్లో ఏఈలను ఇస్తే గాని బదిలీ అయినవారిని రిలీవ్ చేయరాదని బల్దియా నిర్ణయించింది. దీంతో బదిలీ అయినా నలుగురు ఏఈలు కరీంనగర్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. బల్దియాలో పూర్తిస్థాయిలో ఎస్‌ఈని కూడా నియమించలేదు. గతంలో ఎస్‌ఈగా పనిచేసిన నాగమల్లేశ్వరరావు తరువాత, ఈఈగా ఉన్న మహేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మహేందర్ బదిలీ కాగా, ఆయన స్థానంలో వచ్చిన ఈఈ రాజ్‌కుమార్‌కు ఎస్‌ఈ బాధ్యతలు అప్పగించారు.

అలాట్ కోసం కోరాం
బదిలీ అయినవారి స్థానంలో ఏఈలను కేటాయించాలని కోరాం. ఇప్పటికే ఈ విషయమై ఈఎన్‌సీకి లేఖ కూడా రాశా. వారి స్థానంలో కొత్తవారు ఎవరూ రాకపోవడంతోనే పాత ఏఈలను రిలీవ్ చేయలేదు.
– ప్రఫుల్‌దేశాయ్, ఇన్‌చార్జి కమిషనర్

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కరీంనగర్ కార్పొరేషన్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గోపాల్‌పూర్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: మహిళలను అవమానించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్షమాపణ చెప్పాల్సిందేనని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. క్షమాపణ చెప్పకుంటే యావత్ మహిళా లోకం ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో రికార్డు డ్యాన్సులు చేసుకోవాలంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మహిళా కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. నగరంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపింది. మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, తాజొద్దీన్, భాస్కర్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, రజితారెడ్డి, మెరుగు స్వప్న, మాలోతు మహాలక్ష్మి, అస్తపురం తిరుమల పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్, రికార్డ్ డ్యాన్స్‌లు చేసుకోవాలని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు లింగంపల్లి బాబు, నాయకులు రామిడి రాజిరెడ్డి, నూనె గోపాల్‌రెడ్డి, బాలబద్రి శంకర్, సాయిరి దేవన్న, గుండా మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు చేసుకోవాలంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం కరీంనగర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ రహదారిలోని గోపాల్‌పూర్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు వెంటనే కేటీఆర్ క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, మీసాల సాయిలు, బాషవేణి మల్లేశం, మూల వెంకటేశం, ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, అనుముల తిరుపతి, రాకేశ్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన టీఎన్జీవోలు



కరీంనగర్ అర్బన్: ఇటీవల సుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సుడా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ఇంటి పర్మిషన్ల సమస్యతోపాటు పంచాయతీ సెక్రటరీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నేతలు నాగుల నరసింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, జిల్లా నాయకులు జలాలుద్దీన్ అక్బర్, రమేశ్‌గౌడ్, సుస్మిత, ప్రవీణ్‌రావు, రాజిరెడ్డి, బరిగెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఇక నూకలు చెల్లినట్లే..



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, రవిశంకర్

కరీంనగర్: అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లినట్లేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం కొప్పుల ఈశ్వర్ క్యాంపు కార్యాలయంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ ఓ అంకెల గారడీ అని, ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మూడు దఫాల్లో అరకొరగా రుణమాఫీ చేసి రైతాంగం నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో 2018లో రూ.లక్ష వరకు 36.68లక్షల మందికి రుణమాఫీ చేశామన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 2లక్షల వరకు రుణమాఫీకి మూడు విడతల్లో 23.75లక్షల మంది రైతులకు మాత్రమే చేసి చేతులు దులుపుకుందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

వైభవంగా మైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. రోడ్ నంబర్ 1 జెండా చౌరస్తాలో గతంలో ఉన్న గుడిని ఆధునికీకరించారు. రెండు రోజుల పూజల అనంతరం మైసమ్మ తల్లి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. గుడి వ్యవస్థాపకుడు జాజాల మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్, కాలనీవాసులు తోట సాగర్, నారదాసు వసంత్‌రావు, రఘు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృ సంస్థకు బదిలీ అయిన మెప్మా పీడీ రవీందర్



కరీంనగర్ కార్పొరేషన్: జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా మెప్మా పీడీగా పని చేస్తున్న రవీందర్ తన మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. వ్యక్తిగత అభ్యర్థనపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రాజెక్టు డైరెక్టర్ విధుల నుంచి విడుదల చేశారు. 2007 గ్రూప్ వన్‌కు చెందిన రవీందర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు శాఖల్లో పని చేశారు. ప్రస్తుతం ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి హోదాలో ఉన్నారు.



నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్‌లో మమత థియేటర్ వెనకాల ఖాళీ స్థలంలో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు, పందులకు ఆవాసంగా మారింది. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.
– పాశం ప్రశాంత్‌రెడ్డి, భగత్‌నగర్, 33వ డివిజన్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వై.శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఫోన్ నంబర్: 9502933311

వాట్సప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.
మా ఫోన్ నంబర్: 94400 77555

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	04	1,008
నందీశ్వర్ నాన్ఏసీ	07	560
నందీశ్వర సూట్స్	01	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	02	448
పార్వతీపురం స్పెషల్	03	672
పార్వతీపురం సాధారణ	05	336

– వేములవాడ

రైల్వే సమాచారం

కరీంనగర్–తిరుపతి రైలు వివరాలు
- కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ప్రతీ గురు, ఆదివారాల్లో రాత్రి 7.10గంటలకు రైలు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతి నుంచి ప్రతీ బుధ, శనివారాల్లో రాత్రి 8గంటలకు బయలు దేరి మరుసటి రోజున ఉదయం 8.20గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది.

కాచిగూడ–కరీంనగర్ రైలు వివరాలు
- కాచిగూడలో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు రైలు బయల్దేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుంది.
- కరీంనగర్ నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరి రాత్రి 10.45గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

– కరీంనగర్‌రూరల్

యువత చేతిలో దేశ భవిష్యత్



కరీంనగర్: దేశ భవిష్యత్ అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, దేశంలో వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమని, డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడానికి ప్రజాస్వామికవాదులు, మేధావులు, యువత ముందుకు రావాలని వన్‌టౌన్ సీఐ సరిలాల్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలిద్దాం –సమాజాన్ని కాపాడదాం అనే నినాదంతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తెలంగాణ చౌక్ వద్ద సీఐ ప్రారంభించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేశ్, తిరుపతి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి మారుమూల గ్రామాలు, పట్టణాలకు వ్యాప్తి చెందడం అత్యంత ఆందోళన కలిగించే విషయమన్నారు. జిల్లా నాయకులు రాజునాయక్, రవీందర్, గంగాధర్, సురేశ్, రైనా, రహీం, రాజేందర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

ప్రాథమిక స్థాయి శిక్షణ లేకే..



కొత్తపల్లి: దేశంలోని పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచి క్రీడాపోటీల్లో శిక్షణ లేకపోవడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆశించిన మేర రాణించలేకపోతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు చదువుకుంటే చాలన్నట్లు వ్యవహరిస్తూ విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడం లేదు. ఫలితంగా 140 కోట్ల భారత జనాభా నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. క్రీడా పాఠశాలల్లో అరకొర వసతులు, కోచ్‌ల లేమి, సరైన శిక్షణ లేక క్రీడాకారులు రాణించలేకపోతున్నారు. అదే విదేశాల్లో మూడేళ్ల నుంచే ఆటల వైపు ప్రోత్సహించడం వల్ల 16 ఏళ్లు వచ్చేసరికి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదుగుతున్నారు.
– గిన్నె లక్ష్మణ్, ఎస్‌ఏపీఈడీ, ఎలగందుల జెడ్పీహెచ్

ప్రబలుతున్న వ్యాధులు

- విష జ్వరాలపై ఇంటింటా వైద్య సిబ్బంది సర్వే
- గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు



చామనపల్లిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విష జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. చాలామంది జ్వరాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దుర్శేడ్‌లో ఇప్పటికే రెండు డెంగీ కేసులు నమోదు కాగా.. పలు గ్రామాల్లో పలువురు విష జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే డ్రై డేలు నామమాత్రంగా మారాయనే ఆరోపణలున్నాయి.

ఇంటింటా జ్వరాల సర్వే
కరీంనగర్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో విష జ్వరాలపై వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వైద్యసేవలందిస్తున్నారు. శుక్రవారం 605 నివాస గృహాల్లో 1,226 మందిని వైద్య సిబ్బంది పరీక్షించగా.. ఇద్దరికి జ్వర లక్షణాలుండటంతో డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించారు. చెర్లభూత్కూర్, నగునూరు గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కళ్లు ఎర్రగా మారడం, శరీరంపై దద్దుర్లు ఏర్పడితే డెంగీ లక్షణాలుగా వైద్య సిబ్బంది నిర్ధారిస్తున్నారు. చలి జ్వరం, తలనొప్పి, సాయంత్రం పూట జ్వరం, వాంతులతోపాటు నీరసం వస్తే మలేరియాగా గుర్తిస్తున్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తం
విష జ్వరాలపై వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రతిరోజు ఇంటింటా సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి చికిత్స అందిస్తున్నాం. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.
– డాక్టర్ మనోహర్, చామనపల్లి పీహెచ్‌సీ

దోమల నియంత్రణకు చర్యలు
- డెంగీ, మలేరియా వ్యాధులకు కారణమైన దోమల నియంత్రణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లోని కూలర్లు, కుండీలు, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలి.
- ఇళ్ల తలుపులు, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలి. సాయంత్రం కాగానే దోమలు ఇంట్లోకి రాకుండా తలుపులు, కిటికీలను మూసివేయాలి.
- జ్వరం లక్షణాలు కన్పించిన వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలి.

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన

కరీంనగర్‌రూరల్: ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖల అధికారులు పి.శ్రీనివాస్‌రావు, జి.అనిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరెపల్లిలో కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాక్ అండ్ మౌంటెన్ క్లయింబింగ్ ట్రైనర్ రాజాతోపాటు కొత్తపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు పి.సుగుణాకర్‌గౌడ్, కరీంనగర్ గౌడ యువజన సంఘం అధ్యక్షుడు ఆశీష్‌గౌడ్, చిగురుమామిడి గౌడ సంఘం అధ్యక్షుడు బొమ్మ వెంకటేశం శిక్షకులుగా వ్యవహరించారు. కాటమయ్య రక్షణ కవచం ఉపయోగించే విధానం, మెలకువలను 10 మంది గీత కార్మికులకు నేర్పించారు. అనంతరం ప్రయోగాత్మకంగా గీత కార్మికులతో తాటి చెట్టు ఎక్కించారు. రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై విజయభాస్కర్, ఆరెపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు గౌరయ్య, ప్రతినిధులు బత్తిని రమేశ్, రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, అశోక్, మురళి, వెంకటేశ్ పాల్గొన్నారు.

అవినీతి బయటపడుతుందనే ఎంబీ మాయం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్ నిర్మాణంలో అక్రమాలు బయటపడుతాయనే సంబంధిత ఎంబీ మాయం చేశారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ ఒక ప్రకటనలో ఆరోపించారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విద్యార్థుల హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...


తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూ ర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ పి.రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక


మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు

వైద్యవిద్య ప్రవేశాలు, ఆసుపత్రుల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానాల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల ప్రవేశాల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. దీంతోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం వంటి అన్ని విభాగాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టనుంది. నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

ఇస్రో అమ్ములపొదిలోకి మరో రాకెట్

ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి సురక్షితంగా చేరిన ఈవోఎస్-08, డెమోశాట్ ఉపగ్రహాలు



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) డి-3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్-08), ఎస్ఆర్-0 డెమోశాట్ అనే రెండు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగానికి శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. అరున్నర గంటలపాటు కౌంట్‌డౌన్ అనంతరం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్‌వీ డి-3 రాకెట్ నింగివైపునకు దూసుకెళ్లింది. రాకెట్‌లోని మొత్తం నాలుగు దశలు సక్రమంగా పనిచేయడంతో 16.56 నిమిషాల్లోనే ప్రయోగం విజయవంతంగా ముగిసింది. భూమికి 475 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లో 37.2 డిగ్రీల వృత్తాకారపు కక్ష్యలోకి విజయవంతంగా ఉప గ్రహాలను ప్రవేశపెట్టారు. మొదట ఈవోఎస్-08ను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఎస్ఆర్-0 డెమోశాట్ అనే చిన్న ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఇస్రో చిన్న తరహా ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ అందుబాటులోకి రావడంతో వాణిజ్యపరమైన ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా ఇస్రో ఎదుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఇవీ ఉపయోగాలు...

ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-08లో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం-రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డొసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చారు. వీటి ద్వా రా ఈ ఉపగ్రహం భూమి మీద వాతావరణ పరిస్థితులు(భౌగోళిక-పర్యావరణం)పై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు, నేల తీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఇది భవిష్యత్తులో ప్రయోగించనున్న గగన్‌యాన్ మాడ్యూల్‌కు అవసరమైన వాతావరణ పరిస్థితులను కూడా అధ్యయనం చేస్తుంది. మైక్రోశాట్ ఉపగ్రహాల్లో అత్యంత అధునాతన టెక్నాలజీ కలిగిన ఈ ఉప గ్రహం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలు అందిస్తుంది.

ఇస్రోకు సరికొత్త రాకెట్ అందుబాటులోకి వచ్చింది

ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ ఇస్రోలో సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ చేరిందని చెప్పారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్-3 వంటి ఐదు రకాల రాకెట్లు మాత్రమే ఉండేవని తెలిపారు. 2022 ఆగస్టు 7న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ డి-1 రాకెట్ విఫలం కావడంతో అందులో ఏర్పడిన లోపాలను సరిచేసుకుని పలు ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగానికి సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దీనికోసం అహర్నిశలు పనిచేసిన ఇస్రోలోని అన్ని విభాగాల టీమ్‌లకు అభినందనలు తెలిపారు వాణిజ్యపరంగా కూడా ఈ రాకెట్‌ను వినియోగిస్తామని చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్, శాటిలైట్ డైరెక్టర్ ఎ.అవినాశ్ మాట్లాడుతూ ఉపగ్రహం నుంచి నిర్దేశించిన విధంగా సిగ్నల్స్ అందాయని తెలిపారు. కాగా, ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

కృషి ఫలించింది.. గేటు పడింది

తుంగభద్ర డ్యాం స్టాప్‌లాగ్ గేటు తొలి భాగం అమరిక

- నేడు మరో రెండు భాగాలు ఏర్పాటు

సాక్షి, బళ్లారి/ హొసపేటి/అనంతపురం సెంట్రల్: వారం రోజులుగా ఇంజినీర్లు చేస్తున్న కృషి ఫలించింది. తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతంగా మొదలైంది. స్టాప్‌లాగ్ గేట్‌లో మొదటి భాగాన్ని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, కార్మికులు విజయవంతంగా అమర్చారు. 15 టన్నులు బరువుతో 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఈ భాగాన్ని భారీ క్రేన్ల సాయంతో అమర్చారు. ఇక్కడ మరో నాలుగు భాగాలు అమర్చాల్సి ఉంది. శనివారం రెండు, మూడు భాగాలు అమర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత డ్యాం నుంచి 60 టీఎంసీల నీటిని వదిలేసి, 40 టీఎంసీలకు చేరుకున్నాక గేటు అమర్చాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు. అయితే నీటి వృథాను అడ్డుకొని రైతులకు అందించే లక్ష్యంతో స్టాప్‌లాగ్ గేటును అమర్చుతున్నారు.


గేటును విజయవంతంగా అమర్చుతున్న దృశ్యం

ప్రస్తుతం జలాశయంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, మొదటి భాగాన్ని విజయవంతంగా అమర్చారు. మిగిలిన భాగాల ఏర్పాటులో పెద్ద అవరోధాలు ఉండవని డ్యాం అధికారులు తెలిపారు.

భర్తకు జీవిత ఖైదు సరైందే

భార్య హత్య కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: భార్య హత్య కేసులో భర్తకు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించడం సరైందేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'మృతిరాలితో అప్పీలెంట్ (భాస్కర్)కు వివాహం జరిగి నాలుగు నెలలే అయ్యింది. ఆమె మంటల్లో కాలిపోతున్నప్పుడు గదిలో నిందితుడు ఉన్నాడని సాక్ష్యులు చెబుతున్నారు. ఆ మంటలను ఆర్పేందుకు అతను ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భర్తకు వ్యతిరేకంగా మృతురాలు తప్పుడు వాంగ్మూలం ఇచ్చిందనడానికి ఎలాంటి కారణాలు లేవు. ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదు' అని హైకోర్టు తీర్పునిచ్చింది. 2012లో జరిగిన హత్య కేసులో అప్పీలెంట్‌కు జీవిత ఖైదు సరైందేనని 2015లో తేల్చిచెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పెద్దింటి భాస్కర్‌కు మృతురాలితో 2012, ఏప్రిల్ 25న వివాహం జరిగింది. వివాహం తర్వాత నెల పాటు దంపతులు భార్య తల్లిగారింట్లోనే ఉన్నారు. 2012, జూలై 15న రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించారు. అయితే తనకు పీడకలలు వస్తున్నాయని, తల్లి వద్ద నిద్రిస్తానని భాస్కర్‌ను కోరింది. అందుకు నిరాకరించి దుర్భాషలాడుతూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆసుపత్రిలో మృతురాలు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భాస్కర్‌ను ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించింది.

బాధితురాలి మానసిక స్థితి బాగానే ఉంది...

2015, ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా కోర్టు తనకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెద్దింటి భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జితేందర్‌రావు వీరమల్ల వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మృతురాలి తల్లి కూడా నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేదని, పథకం ప్రకారం హత్య చేశాడని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... బాధితురాలి నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం తీసుకునేముందు ఆమె మానసిక పరిస్థితి బాగానే ఉందని డాక్టరు ధ్రువీకరించారని పేర్కొంది. మరణ వాంగ్మూలం ఆధారంగా శిక్ష విధించవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ అప్పీలును కొట్టివేసింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు ఈనెల 30

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాలనుకునే వారు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీజీ శ్రీహరి తెలిపారు. ప్రతీ పేపర్‌కు రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9 వరకు ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు http://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బాబు తప్పిదం వల్లే.. 'వాల్' ఢమాల్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

2017, 2018లో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ మీదుగా వరద ప్రవాహం

- ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్న కమిటీ
- వరదల ఉధృతికే డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బ తిన్నట్లు స్పష్టీకరణ
- 2017లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాదులు జెట్ గ్రౌటింగ్ వాల్‌ల నిర్మాణం
- వరద ప్రభావం వాటిపై పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోని టీడీపీ సర్కారు
- 2018 వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో 200 -260 మీటర్ల మధ్య దెబ్బతిన్న జెట్ గ్రౌటింగ్ వాల్

అరెస్టుపై ఏఎస్పీ ప్రకటన.. నిందితుడి పరారీ

- మారణాయుధాలతో తిరుగుతూ పట్టుబడిన వ్యక్తి
- గతంలో ఓ హత్య కేసులో అరెస్ట్.. బెయిల్‌పై బయటకు
- తాజాగా పోలీసులకు చిక్కి.. అంతలోనే తప్పించుకున్న వైనం..
- నిర్మల్ జిల్లా భైంసా పోలీస్‌స్టేషన్‌లో ఘటన


నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: గతంలో హత్య కేసులో అరెస్టయిన నిందితుడు ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. జైల్లో ఉన్నా అతడి ప్రవర్తన మారలేదు. మారణాయుధాలతో తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్పీ అరెస్టు చూపిన కాసేపటికే నిందితుడు పోలీసుస్టేషన్ నుంచి పారిపోయాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా భైంసా పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నయాబాదికి చెందిన అబ్దుల్ జుబేర్ మార్చిలో నర్సింహానగర్ వద్ద సయ్యద్ సోహైల్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టు కాగా, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ క్రమంలో గురువారం స్థానిక పాత ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా, అనుమానాస్పద స్థితిలో జుబేర్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని తనిఖీ చేయగా కత్తి దొరికింది. దీంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా గతంలో తాను హత్య చేసిన సోహైల్ కుటుంబీకులు తనపై దాడి చేస్తారన్న భయంతో నాందేడ్ నుంచి తల్వార్ కొనుగోలు చేసి ఇంట్లో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. ఈ మేరకు అతడి ఇంటికి వెళ్లి తల్వార్, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తామని ప్రకటించారు.

కాసేపటికే పరార్..

అరెస్ట్ వివరాలను ఏఎస్పీ వెల్లడించిన కాసేపటికే నిందితుడు అబ్దుల్ జుబేర్ పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయాడు. ఈ విషయం స్థానికంగా కలకలం రేపింది. ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచే తప్పించుకోవడం గమనార్హం. అప్రమత్తమైన పోలీసులు అతని ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. నిందితుడి పరారీ విషయమై ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ను సంప్రదించగా.. వాస్తవమేనని, గాలింపు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

బాసర భద్రతపై ఎస్పీ సమీక్ష


విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హోంగార్డులను హెచ్చరిస్తున్న ఎస్పీ జానకిషర్మిల

- ఎస్పీ ఆఫీస్‌కు ఆరుగురు హోంగార్డుల అటాచ్
- విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

బాసర: బాసర జ్ఞాన సరస్వతిదేవి ఆలయాన్ని జిల్లా ఎస్పీ జానకీషర్మిల శుక్రవారం సందర్శించారు. ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగిన నేపథ్యంలో ఎస్పీ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న హోం గార్డుల నిర్లక్ష్యంతోనే ఆలయంలో దొంగతనం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చి ఎస్పీ చోరీ జరిగిన రాత్రి విధుల్లో ఉన్న హోంగార్డులు జైశ్యామ్, టి.గణేశ్, ఐ.సతీశ్, డి.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్, జి.గోపాల్‌ను ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మిగత హోమ్ గార్డులకు భద్రతపై సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, ప్రోటోకాల్ పరంగా సమస్యలు ఎదురైతే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆలయంలో అడుగడుగునా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. రౌండ్ క్లాక్ నిఘా ఉండాలని కిందిస్థాయి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. నెల రోజుల్లో ఆలయాన్ని పూర్తి పర్యవేక్షణలో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో దొంగతనం చేసిన నిందితుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని ముథోల్ సీఐ, మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్‌ను ఆదేశించారు. ఎస్పీ వెంట ఆలయ కార్యనిర్వణ అధికారి విజయరామారావు, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

బాసర: బాసరలోని ట్రిపుల్ ఐటీల బయాలజీ డిపార్ట్‌మెంట్ సీనియర్ అధ్యాపకుడు కైరంకొండ మధుసూదన్ యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సైన్స్ అకాడమీ సంస్థ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ప్రొఫెసర్ సీహెచ మోహన్‌వు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ టీఏఎస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జనరల్ సెక్రెటరీ, ఓయూ మాజీ వీసీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు యంగ్ సైంటిస్టు అవార్డు అందుకోవడంపై యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అభినందించారు. సైన్స్ రంగంలో కృషి చేసినందుకుగాను మధుసూదన్‌కు అవార్డు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. ఫలప్రదమైన పరిశోధనారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. మధుసూదన్‌ను ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



అవార్డున అందుకుంటున్న అధ్యాపకుడు

టోల్ ఫుల్.. నిర్వహణ నిల్


రాజీవ్ రహదారి మధ్యలోని డివైడర్లపై ఇలా ఏపుగా గడ్డి పెరగడంతో పశువులు మేతకు వస్తున్నాయి. వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రేణిగుంట నుంచి అలుగునూరు వరకు డివైడర్లపై గడ్డి, మొక్కలు ఏపుగా పెరగడంతో యూటర్న్‌ల వద్ద అవతలివైపు వాహనాలు కనిపించడం లేదు·


రహదారి అప్రోచ్ రోడ్డువెంట ఏర్పాటుచేసిన ఈ గ్రిల్స్ వాహనాలు ఢీకొని విరిగిపోయాయి. కొత్తపల్లి, అలుగునూరులో గ్రిల్స్ విరిగిపోయి ఏడాది గడిచినా నిర్వాహకులు పునరుద్ధరణ చర్యలు తీసుకోవడం లేదు. చీకట్లో కొందరు వాహనదారులు ఈ గ్రిల్స్‌ను ఢీకొని గాయపడుతున్నారు.

- అధ్వానంగా రాజీవ్ రహదారి
- చెదిరిపోయిన తారు.. డివైడర్ల మధ్య పెరిగిన గడ్డి
- రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు..
- నిత్యం రూ.లక్షల్లో టోల్ వసూలు
- రోడ్డు మరమ్మతులు పట్టించుకోని హెచ్‌కేఆర్ సంస్థ


రోడ్డు పక్కనుండే చెట్ల కొమ్మలు రహదారిని కమ్మేస్తున్నాయి. మూలమలుపుల వద్ద ఈ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. తిమ్మాపూర్, కొత్తపల్లి, నుస్తులాపూర్‌లో సగం రోడ్డును ఇలా చెట్లే ఆక్రమించేస్తున్నా చర్యలు శూన్యం.


రహదారి అక్కడక్కడ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. తిమ్మాపూర్ స్టేజీ వద్ద, అలుగునూరు చౌరస్తా, టోల్‌గేట్ రెస్టారెంట్ వద్ద గుంతలు పడింది. ఒక్కోసారి వేగంగా వెళ్లే ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు.

తిమ్మాపూర్: రాజీవ్ రహదారి అధ్వానంగా మారింది. అడుగుకో గుంతతో ప్రయాణికులకు చుక్కలు చూపుతోంది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే హైదరాబాద్– రామగుండం రాజీవ్ రహదారి నిర్వహణ బాధ్యతను హెచ్‌కేఆర్ సంస్థ గాలికొదిలేసింది. వాహనదారుల నుంచి టోల్ చార్జీలను ముక్కుపిండి మరీ వసూలు చేస్తోంది. దాదాపు 228 కిలోమీటర్ల పొడవైన రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి రామగుండం వరకు దుద్దెడ, రేణికుంట, బసంత్‌నగర్ వద్ద మూడు టోల్ ప్లాజా లున్నాయి. వీటి ద్వారా సంస్థకు రోజుకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది.

రేణికుంట నుంచి రామగుండం వరకు ..

హైదరాబాద్– కరీంనగర్– రామగుండం మధ్య ఏకైక రోడ్డు మార్గం ఇదే. నిత్యం వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధి ప్రారంభమయ్యే రేణికుంట హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా నుంచి రామగుండం పరిధిలోని బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వరకు రాజీవ్ రహదారి అధ్వానంగా తయారైంది. నుస్తులాపూర్, అల్గునూర్‌లో అప్రోచ్ రోడ్ల గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. రామగుండం పవర్ హౌస్‌నుంచి గోదావరిఖని వరకూ ఇదే పరిస్థితి. డివైడర్లపై యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ సిగ్నల్ బ్లింకింగ్ లైట్లు పనిచేయడం లేదు. డివైడర్ల మధ్యలో గడ్డి విపరీతంగా పెరిగి పశువులు మేతకోసం రోడ్డెక్కుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు రోడ్డును కమ్మేస్తున్నాయి. కల్వర్టుల వద్ద రేడియం సూచికలు లేవు.

సెంట్రల్ లైటింగ్ నిర్వహణ గాలికి

హెచ్‌కేఆర్ సంస్థ రాజీవ్ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ చాలా వరకు పనిచేయడం లేదు. కొన్ని స్తంభాలు వాహనాలు ఢీకొని వంగిపోయాయి. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి ఇసుక క్వారీ వద్ద వందల సంఖ్యలో లారీలు రహదారి పైనే నిలిచి ఉంటున్నా హెచ్‌కేఆర్ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ స్టేజీ వద్ద హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో రాత్రివేళలో విద్యార్థులు రోడ్డు ప్రమాదాల గురవుతున్నారు.

చెదిరిపోయిన తారు

రాజీవ్ రహదారిపై చాలాచోట్ల తారు చెదిరిపోయింది. వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. అల్గునూర్ చౌరస్తా, టోల్‌గేట్ రెస్టారెంట్ ఎదురుగా రోడ్డు ప్రమాదకరంగా మారింది. టోల్ వసూలుపై హెచ్‌కేఆర్ సంస్థ చూపుతున్న శ్రద్ధ రహదారి నిర్వహణపై చూపడం లేదన్న ఆరోపణలు వస్తుండగా.. ప్రశ్నించిన ప్రయాణికులపై టోల్‌ప్లాజా సిబ్బంది దాడులు పెరిగిపోతున్నాయి.

మంత్రి జోక్యం చేసుకోవాలి



హెచ్‌కేఆర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకో వాలి. రహదారి వెంట ఉన్న గ్రామాల్లో ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాలి. నిర్వాహకులు పద్ధతి మార్చుకోకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతాం. – బోయిని తిరుపతి, సీపీఐ మండల కార్యదర్శి, తిమ్మాపూర్

పిచ్చి మొక్కలు తొలగిస్తాం

డివైడర్ల మధ్యలో గడ్డి, రోడ్డును ఆనుకుని ఉన్న పిచ్చిచెట్లను తొలగిస్తాం. రోడ్డుపై గుంతలు పడిన ప్రదేశాలు గుర్తించి ఇదివరకే మరమ్మతులు చేపట్టాం. ఇంకేమైనా ఉంటే సరిచేస్తాం. స్టేజీల వద్ద సోలార్ లైట్లు త్వరలో పునరుద్ధరిస్తాం.
– శ్రీనివాస్, రేణికుంట టోల్‌ప్లాజా ఇన్‌చార్జి

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 17-8-2024



యుద్ధకళ నేర్చుకున్న మను భాకర్

కత్తిలాంటి చూపు కోసం...

యుద్ధంలో గెలవాలంటే దేహం ఒక ఆయుధంగా మారాలి దృష్టి, ఆలోచన ఆయుధంగా మారాలి. పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మను భాకర్ గురి నిలవడానికి ప్రత్యర్థులను గెలవడానికి 'థాంగ్ తా'ను నేర్చుకుంది. కేరళ కలరిపట్టులాగా మణిపూర్‌కు చెందిన ఈ యుద్ధకళ మనసును లగ్నం చేసి దేహాన్ని ఉద్యుక్తం చేయడంతో సాయం చేస్తుంది.

'ఒలింపిక్స్‌లో పతకం సాధించడం పెద్ద లక్ష్యం. ఇందుకోసం అన్ని విధాలా సిద్ధం కావాలి. ఇది ఎవరి మీదో ఆధారపడే విషయం కాదు. మనల్ని మనమే తీర్చిదిద్దుకోవాలి. నేను స్త్రీని కాబట్టి పేలవమైన ప్రదర్శన చేసినా సాకులు చెప్పొచ్చులే అనుకోకూడదు. అందుకే నేను షూటర్‌గా గట్టిగా నిలవడానికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకున్నాను. అందులో థాంగ్ తా నేర్చుకోవడం ఒకటి' అంది మను భాకర్.

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున పతకం సాధించిన తొలి మహిళా షూటర్‌గా, ఒకే సీజన్‌లో రెండు పతకాలు సాధించిన మహిళా షూటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. అయితే గెలుపు అంత సులభంగా రాదు. ప్రపంచ వేదికపై ప్రత్యర్థులతో తలపడాలంటే ఎంతో ఆందోళన ఉంటుంది. ప్రాక్టీస్‌లో, వేదిక బయట ఎంత గొప్పగా రాణించినా సరిగ్గా నిర్దిష్ట క్షణంలో తొణకక బెణకక పోటీ పడినప్పుడే గెలుపు సాధ్యం. ఇందుకు కఠోర సాధన అవసరం.

యోగా, గుర్రపు స్వారీ, థాంగ్ తా

షూటర్‌గా రాణించడానికి శరీరం, మనసు రాటుదేలి ఉండేందుకు మను భాకర్ సంవత్సరాల తరబడి శారీరక, మానసిక శ్రమ చేసింది.యోగాతో మనసుకు శిక్షణ ఇస్తే గుర్రపు స్వారీతో శరీరంలో చురుకుదనం తెచ్చుకుంది. గురి వైపు తుపాకీ పేల్చడం అంటే గుర్రాన్ని లక్ష్యం వైపు ఉరకెత్తించడమే. ప్రాణం ఉన్న అశ్వాన్ని అదుపులోకి తెచ్చుకుంటే ప్రాణం లేని తుపాకీ అదుపులోకి వస్తుంది. అయితే ఇవి మాత్రమే చాలవు అనుకుంది మను భాకర్. అందుకే థాంగ్ తా నేర్చుకుంది.



● థాంగ్ తా



గురువుకు లోబడి

మను భాకర్ కోచ్ జస్పాల్ రాణ. మనలో ఎంత ప్రతిభ ఉన్నా గురు ముఖతా నేర్చుకున్నప్పుడే విజయం సిద్ధిస్తుంది. గురువు దగ్గర నేర్చుకోవాలంటే గురువు ఆధిపత్యాన్ని అంగీకరించాలి. చాలామంది శిష్యులు ఆ పని సంపూర్ణంగా చేయలేరు. 'థాంగ్ తా'లో మొదట నేర్పేది శిష్యుడు తన అహాన్ని వీడి గురువుకు లోబడటమే. కత్తి, బల్లెం, డాలు ఉపయోగించి నేర్పే ఈ యుద్ధకళలో గురువు చెప్పిందే వేదం అనుకునేలా ఉండాలి. క్రమశిక్షణ, నిజాయితీ, గౌరవం ఈ కళలో ముఖ్యం. షూటింగ్ సాధనలో గురువు దగ్గర క్రమశిక్షణ తో, నిజాయితీతో, నేర్పే విద్యను గౌరవిస్తూ నేర్చుకోవడంలో మను భాకర్‌కు థాంగ్ తా ఉపయోగపడింది.

తెగలను కాపాడుకునేందుకు...

మణిపూర్ తెగల యుద్ధకళ 'హ్యుయెన్ లల్లాంగ్'. ఇందులో కత్తి, బరిసెలతో చేసేది థాంగ్ తా. ఆయుధాలు లేకుండా చేసేది సరిత్ సరక్. బయట తెగలు వచ్చి స్వీయ తెగలను రూపుమాపకుండా ఉండేందుకు పూర్వం మణిపూర్‌లో ప్రతి ఒక్క పురుషుడు థాంగ్ తాను నేర్చుకుని సిద్ధంగా ఉండేవాడు. స్త్రీలు కూడా నేర్చుకునేవారు. ప్రస్తుతం ఇది జాతీయ స్థాయి క్రీడగా మారింది. చెక్క కత్తి, డాలుతో ఈ యుద్ధక్రీడను సాధన చేస్తున్నారు. భవిష్యత్తులో దీనిని ఒలింపిక్స్ కమిటీ గుర్తిస్తుందనే ఆశ ఉంది. 'ఎంత వీరులైతే అంత వినమ్రులవుతారు ఈ యుద్ధ కళలో' అంటారు మణిపూర్ గురువులు. మను భాకర్ గెలవడానికి ఆమెలోని వినమ్రత కూడా ఒక కారణం కావచ్చు.

మంచి ఆలోచన

గోడకు మొలిచిన పుస్తకాలు

రియల్ ఎస్టేట్ వాళ్లు ఏయే ఎమినిటీస్‌తో ఫ్లాట్లు కడతారో చెబుతుంటారు... క్లబ్‌హౌస్, స్విమింగ్‌పూల్... ఇంకా ఏమిటేమిటో. కాని దానిలో లైబ్రరీ ఉంటుందా? పుస్తకాలు ఉంటాయా? పుస్తకాలు లేని ఇళ్లు సరైన ఇళ్లేనా? 'చెన్నైలో కొన్ని అపార్ట్‌మెంట్లకు ప్రయివేట్ లైబ్రరీలు ఉన్నాయి. ఇది చాలా మంచి విషయం. కాని కాలనీల్లో అలాంటి వీలు లేని ఇళ్లు, వాటిలో నివసించే పిల్లలు పుస్తకాలు చదవాలంటే ఎలా? అందుకే నాకు చేతనైనట్టుగా ఫ్రీ లైబ్రరీ తెరిచాను. ఇక్కడ నుంచి పుస్తకాలు తీసుకోవచ్చు... పుస్తకాలు ఇవ్వొచ్చు' అంటాడు 55 ఏళ్ల జయకుమార్.

చెన్నైలోని అన్నై ఇందిరానగర్‌లో నివసించే ఈ పుస్తక ప్రేమికుడు గతంలో బాగా వెలిగి ఇప్పుడు పలుచబడిన 'లిటిల్ ఫ్రీ లైబ్రరీస్' (ఎల్.ఎఫ్.ఎల్) ఉద్యమానికి నడుం బిగించాడు. తన ఇంటి గోడకు చిన్న అల్మారా బిగించి అందులో పుస్తకాలు ఉంచాడు. 'పుస్తకాలు మనుషుల్ని దగ్గర చేస్తాయి. ఈ పెట్టె బిగించినప్పటి నుంచి స్కూలు, కాలేజీ కుర్రాళ్లు ఆసక్తిగా వీటిని తీసి చూడటం గమనిస్తున్నాను. వాళ్లే కదా పుస్తకాలు చదవాలి' అంటాడు జయకుమార్. 'పుస్తకాలు అద్దెకిచ్చే లైబ్రరీలు ఇప్పుడు లేవు అంకుల్' అని ఆ కుర్రాళ్లు నాతో అన్నారు అంటాడు బాధగా. అయితే ఇలా ఫ్రీ లైబ్రరీ లు గోడకు బిగించి వదిలి



పెట్టడం అంత సులువా? 'చాలా రోజుల వరకు పుస్తకాలు ఎవరూ తాకలేదు. కాని ఇటీవల రాత్రి ఒంటి గంటకు ఒక ఆటో వచ్చి షెల్ఫ్‌లోని 22 పుస్తకాలను దొంగిలించుకుని వెళ్లింది. ఇది నేను సిసి టీవీలో చూశాను. చాలా బాధపడ్డాను. అయితే ఇది తెలిసిన కాలనీ వాళ్లు డొనేషన్లు ఇచ్చారు. ఆశ్చర్యంగా ఒక వ్యక్తి చాలా పెట్టెల పుస్తకాలు తెచ్చి డొనేట్ చేశాడు. అంటే జనం కోసం పెట్టిన ఈ చిన్ని లైబ్రరీ ఎప్పుడూ ఖాళీగా ఉండదన్నమాట' అని చిరునవ్వు నవ్వాడు జయకుమార్. సెల్‌ఫోన్లకు బానిసలు గా మారి, రీల్స్ పిచ్చిలో ప్రాణాలు తీసుకుంటున్న ఈనాటి యువతను మేల్కొలపడానికి చిన్నదైతేనేం ప్రతి గోడకు ఇలా బుజ్జి లైబ్రరీని బిగిస్తే ఈ దేశ మేధో వికాసం మరింత పరిమళిస్తుంది కదా. ఆలోచించేదీ అమలు చేసేదీ ఎందరు?

కోల్‌కతా నిరసన



ఒక్క పిలుపు ఇవ్వగానే వేలాదిమంది మహిళలు అర్ధరాత్రి వేళ వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆమె ప్రఖ్యాత ఉద్యమ నాయకురాలు, రాజకీయ నాయకురాలు కాదు. సాధారణ మహిళ. కోల్‌కత్తాలోని జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై 29 ఏళ్ల రిమ్‌జిమ్ సిన్హా ఫేస్‌బుక్ పోస్ట్ వైరల్ కావడమే కాదు అర్ధరాత్రి వేళలో ఉద్యమ స్వరమై ప్రతిధ్వనించింది...

చీకట్లో ఉరిమిన చిరు స్వరం

కోల్‌కత్తా, ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణ హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమబెంగాల్‌తో పాటు ఎన్నో రాష్ట్రాలలో ఎంతోమంది మహిళలు ఆగస్ట్ 14 అర్ధరాత్రి వీధుల్లోకి వచ్చారు. 'రీక్లెయిమ్ ది నైట్: ది నైట్ ఈజ్ అవర్' కాప్షన్‌తో రిమ్‌జిమ్ సిన్హా ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్ సంచలనంగా మారింది. అర్ధరాత్రి వేళ మహిళలు వీధుల్లోకి వచ్చి నిరసన గళం వినిపించేలా చేసింది.

'మహిళల కొత్త స్వాతంత్ర్య పోరాటం'గా 'రీక్లెయిమ్ ది నైట్' క్యాంపెయిన్‌ను అభివర్ణించింది రిమ్‌జిమ్ సిన్హా. రీక్లెయిమ్ ది నైట్' చిహ్నమైన నెలవంక పట్టుకున్న ఎర్ర చేతి పోస్టర్ వైరల్ అయింది.

రిమ్‌జిమ్ సిన్హా కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సోషల్‌సైన్స్ రిసెర్చర్. జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన నన్ను బాధ పెట్టడమే కాదు అభద్రతాభావానికి గురి చేసింది. నగరాల్లో మహిళలు ఎంత సురక్షితంగా ఉన్నారు? అని ఆలోచిస్తేనే భయంగా ఉంది. వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు కోరుతూ ఆగస్ట్ 14 అర్ధరాత్రి నిరసన ప్రదర్శన చేయాలనుకున్నాను. రాత్రిపూట బయటకు వెళ్లే హక్కు మహిళలకు ఎందుకులేదు?' అంటున్న రిమిజిమ్ సిన్హా సోషల్ మీడియా వేదికగా ఎంతో మంది మహిళలను ఐక్యం చేసింది.

మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలపై రిమ్‌జిమ్ సిన్హా మండిపడింది. 'జూనియర్ డాక్టర్ ఒంటరిగా సెమినార్ హాల్‌కు ఎందుకు వెళ్లింది?' అని ఆయన ప్రశ్నించాడు.

'బాధితురాలిపై నిందలు మోపే కుసంస్కారాన్ని అంగీకరించబోము. రాత్రివేళ బయట ఎవరు ఉండాలో, ఎవరు ఉండకూడదో నిర్ణయించే అధికారం ఎవరికీ లేదు' అంటుంది సిన్హా. తన పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని, దేశవ్యాప్తంగా వేలాది మంది అర్ధరాత్రి వేళ వీధుల్లోకి వస్తారని ఆమె ఊహించలేదు.

'వందమంది వరకు వస్తారనుకున్నాను. ఒక వేళ ఎవరూ రాకుంటే నేను ఒక్కదానినే బయటికి రావాలనుకున్నాను. ఇంతమంది మహిళలు అర్ధరాత్రి ఇల్లు దాటి బయటికి వస్తారని నేను ఊహించలేదు. వారి స్పందన నాకు సంతృప్తిని ఇచ్చింది' అంటుంది సిన్హా. రిమ్‌జిమ్ సిన్హా పేరు సంచలనం కావడం మాట ఎలా ఉన్నా ఎంతోమంది రాజకీయ నాయకులకు టార్గెట్‌గా మారింది. 'రీక్లయిమ్ ది నైట్' ఉద్యమ చిహ్నానికి రకరకాలుగా భాష్యం చెబుతూ విమర్శిస్తున్నవారు కూడా ఉన్నారు.

'అర్ధరాత్రిపూట బయటకు వస్తున్నారు. మీకేమైనా అయితే పూచీ మాది కాదు' అంటున్న రాజకీయ నాయకులు ఉన్నారు.

జాదవ్‌పూర్‌లోని 8బీ బస్‌స్టాండ్‌కు దగ్గర జరిగిన సభకు హాజరమైన రిమ్‌జిమ్ సిన్హా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన గురించి మాత్రమే కాదు రాత్రివేళలో మహిళలకు ఎదురయ్యే ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు, పని ప్రదేశంలో మహిళలకు సెపరేట్ టాయిలెట్‌లు, బడులలో లింగ సమానత్వంపై పాఠ్యాంశాలు, రాత్రి విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులకు సురక్షితమై విశ్రాంతి గదులు... మొదలైన వాటి గురించి మాట్లాడింది. 'రీక్లయిమ్ ది నైట్: ది నైట్ ఈజ్ అవర్స్'ను దృష్టిలో పెట్టుకొని 'ఇది మహిళల కొత్త స్వాతంత్ర్య పోరాటం' అంటున్న రిమ్‌జిమ్ సిన్హా ఆ పోరాటానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది.



యంగ్ రైటర్స్... కథలు రాస్తారా?

కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథా వస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34.
ఈమెయిల్: funday.kathalu@gmail.com

బ్యూటిప్స్ — పెసర పిండితో చర్మకాంతి

- టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.
- పెసరపిండిలో కొద్దిగా పెరుగు, కొబ్బరి నూనె కలిపి చేతులకు రాయాలి. మృదువుగా రబ్ చేసి, పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పెసరపిండి, పెరుగు, కొబ్బరి నూనెలో ఉండే గుణాలు చర్మాన్ని మృదువుగా మారుస్తాయి.

- ఆమె కండక్టర్
- అతను హోంగార్డ్

బతుకు బండికి భరోసా!

ఆమె చేస్తున్నది టీజీఎస్ ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం. ఆమె భర్త హోంగార్డు.. వారిది దిగువ మధ్య తరగతి కుటుంబం.. అయితేనేం, థలసీమియా వ్యాధి బారిన పడిన చిన్నారులకు చేతనైన మేరకు అండదండలు అందించాలన్న సంకల్పానికి ఇవేమీ అడ్డంకి కాలేదు. తన సమీప బంధువు కుమారులు థలసీమియాతో చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు పడిన వేదనను చూసి చలించి పోయింది. అప్పడే ఆమె థలసీమియా బాధితులకు చేతనైన సేవ చేయాలని సంకల్పించింది. ఆమె సంకల్ప బలం ముందు తనకు వచ్చే ఆదాయం ఎంత..? తాను ఎలా సాయపడగలననే ఆలోచనలు చిన్నవే అయ్యాయి.

రక్త సంబంధాలు



● సంకల్ప తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న చిన్నారులు

ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న ప్రొద్దుటూరి అనిత ఖమ్మం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త రవిచందర్ సీపీ కార్యాలయంలో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వారి బంధువుల పిల్లలిద్దరూ థలసీమియాతో బాధపడుతూ మృతిచెందారు. ఆ బాలల తల్లిదండ్రులు పడిన వేదనను దగ్గర నుంచి చూసిన అనిత అలాంటి చిన్నారుల కోసం ఏదైనా చేయాలని సంకల్పించారు. గతంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించే స్వచ్ఛంద సంస్థలో పని చేసిన అనుభవంతో రక్త సేకరణపై దృష్టి పెట్టారు. ఆమె నిర్ణయానికి కుటుంబం మద్దతుగా నిలిచింది.

స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం...

థలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు హైదరాబాద్ వెళ్లి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితులు. దీంతో గతంలో అనిత పనిచేసిన ఎన్‌జీవో ద్వారా సేవ చేద్దామని చూసినా.. వీలు కాకపోవడంతో వ్యక్తిగత దాతల నుంచి రక్తదానం చేయించడం ద్వారా పిల్లలకు రక్తం ఎక్కించేవారు. ఆ తర్వాత 2010లో 'సంకల్ప స్వచ్ఛంద సంస్థ' పేరుతో రిజిస్టర్ చేశారు. తొలుత 25 మందికి ఈ సంస్థ ద్వారా రక్తం ఎక్కించడం ప్రారంభించారు. హైదరాబాద్ వెళ్లి రక్తం ఎక్కించుకోవడం చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పని కావడంతో ఇక్కడ సంఖ్య పెరిగింది. దీంతో రక్తదాతల కోసం కాలేజీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రక్తదాతల భాగస్వామ్యంతో ఇప్పుడు 'సంకల్ప' ద్వారా 220 మందికి రక్తం అందుతోంది. ఇక్కడ చికిత్సతో పాటు మందులు కూడా ఉచితమే. 2009 నుంచి ఇప్పటివరకు 500కు పైగా బ్లడ్‌క్యాంపులతోపాటు వ్యక్తిగత దాతల నుంచి 15 వేల లీటర్లకు పైగా రక్తాన్ని సేకరించి చిన్నారులకు అందజేశారు.

'కరోనా' కాలంలోనూ...

కరోనా కష్ట కాలంలోనూ థలసీమియా చిన్నారులకు రక్తం ఎక్కించే ప్రక్రియ నిరాటంకంగా సాగింది. అనిత చేస్తున్న సేవతో స్ఫూర్తి పొందిన అనేకమంది బయటకు రావడానికే భయపడుతున్న ఆ సమయంలోనూ ఆ చిన్నారుల కోసం రక్తదానం చేశారు.

సంస్థ ఆధ్వర్యంలో అవగాహన...

థలసీమియా అనేది నివారించదగిన వ్యాధి. అలాగే వంశపారంపర్యంగా వస్తుంది. పెళ్లికి ముందు హెచ్‌బీఎ -2 (ఎలక్ట్రో ఫోర్సెస్) పరీక్ష చేయించుకుంటే థలసీమియా వ్యాధితో పుట్టే పిల్లలు లేకుండా చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వాలు కూడా పోలియో, ఎయిడ్స్‌పై ప్రచారం చేసినట్లుగా థలసీమియా పరీక్షలపై అవగాహన కల్పించడం లేదు. ఈ క్రమంలో సంకల్ప స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 7,500 మంది డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. థలసీమియాపై అవగాహన కల్పించేలా ప్రతి ఏడాది ర్యాలీ నిర్వహిస్తున్నారు.

బోన్‌మ్యారో ఆపరేషన్లపై దృష్టి...

థలసీమియా రహితం కావాలంటే బోన్ మ్యారో ఆపరేషన్ ఒక్కటే మార్గం. ఇది సామాన్యులకు సాధ్యపడేది కాదు. అయితే చిన్నారులకు ఈ ఆపరేషన్లు చేయించడం పై దృష్టి పెట్టింది సంకల్ప. నామమాత్రపు ధరలతో ఆపరేషన్ జరిగేలా సంస్థ చర్యలు తీసుకుంటోంది. ఈ సంస్థ ప్రారంభించిన తర్వాత రక్తం అందక చనిపోయిన వారు లేరంటే సంస్థ సంకల్ప బలం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.

- బొల్లం శ్రీనివాస్, సాక్షి, ఖమ్మం

ఓ కుటుంబంలో తలసేమియాతో ఉన్న పిల్లలు పుట్టారంటే వారిని ఎలా కాపాడుకోవాలన్నది బాధ చెప్పలేనిది. ఆ నరకం నుంచి తల్లిదండ్రులు బయటపడాలనేది మా సంకల్పం. ప్రస్తుతం ఇది నిర్విఘ్నంగా సాగుతోందంటే దాతల వల్లనే సాధ్యమవుతోంది. నేను కండక్టర్‌గా బస్సులో ఏ గ్రామానికి వెళ్లినా అక్కడ బస్సు ఎక్కే యువకులకు థలసీమియా గురించి చెప్పి.. రక్తదానం చేయమని

కడుపు కోత తప్పించాలనే...



● అనిత, రవిచందర్

కోరేదాన్ని. దాంతో కండక్టర్‌గా నేను ఆ బస్సుకి వస్తే.. నన్ను చూసి భయపడి బస్సు ఎక్కేవాళ్లు కాదు. కొంత కాలం తర్వాత రక్తదానంతో తాము ఒకరికి ప్రాణం పోస్తున్నామని యువకులకు అర్థమైంది. ఇలా మొదలైన ప్రస్థానం యువకుల రక్తదానంతో ముందుకు సాగుతోంది. థలసీమియాతో బాధపడుతున్న పిల్లలకు ప్రభుత్వం పింఛన్ ఇస్తే వారికి ఉపయోగపడుతుంది.

- ప్రొద్దుటూరు అనిత,
సంకల్ప స్వచ్ఛంద సంస్థ, ఖమ్మం

రిపోర్ట్

తాజాగా కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్యాచార ఉదంతం... దానిని ఖండిస్తూ జరుగుతున్న నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నప్పటికీ నిజానికి పని ప్రదేశంలో లైంగిక వేధింపులు అనేవి

వర్క్‌ప్లేస్‌లో పెరుగుతున్న లైంగిక వేధింపులు

కొత్తేమీ కాదు. పని ప్రదేశాలలో ప్రతి ఏటా మన దేశంలో 400కు పైగా లైంగిక వేధింపుల కేసులు నమోదవుతున్నట్లు బిజినెస్ స్టాండర్డ్ పత్రిక తెలియజేసింది. నేషనల్ క్రైమ్ రిపోర్ట్స్ బ్యూరో నివేదికను అనుసరించి ఏటా సగటున 445 కేసులు, నెలకు 35 చొప్పున లైంగిక వేధింపుల కేసులు నమోదవుతున్నాయి. అంటే పని ప్రదేశంలో కనీసం రోజుకు ఒక లైంగిక వేధింపుల కేసు నమోదవుతోందన్నమాట.

వీటిలో హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా 97 కేసులు నమోదయితే, కేరళలో 83, మహారాష్ట్రలో 46 కేసులు, కర్ణాటకలో 43 కేసులూ నమోదయ్యాయి. ఈ గణాంకాలన్నీ అధికారికమైనవీ, అందులోనూ 2022 వరకు మాత్రమే నమోదయినవే. అయితే ఆ తర్వాత నుంచి అనధికారికంగా నమోదైన, నమోదవుతున్న లైంగిక వేధింపుల కేసులు అంతకు రెండింతల కన్నా ఎక్కువే ఉండటం గమనార్హం.

2022-23లో 1160 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. ఇది గత దశాబ్దిలోకెల్లా అతి పెద్ద సంఖ్య. ఇవి సుమారు 300 కంపెనీల నుంచి అందిన గణాంకాలు మాత్రమే.

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం మహిళలను రక్షించడం, లైంగిక వేధింపులను అడ్రస్ చేసే విధానాలను అందించడం కోసం సుమారు ఒక దశాబ్దం క్రితం రూపుదిద్దుకుంది.

ఫస్ట్ టైమ్



● సాధనా సక్సేనా నాయర్

ఆర్మీ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా తొలి మహిళ

భారత సాయుధ దళాల జనరల్ హాస్పిటల్ సర్వీసెస్ డైరెక్టర్‌గా లెఫ్టినెంట్ జనరల్ సాధనా సక్సేనా నాయర్ నియమితులయ్యారు. మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులైన తొలి మహిళగానూ ఆమె వార్తల్లో నిలిచారు. వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కి ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన మొదటి మహిళగా కూడా.

సాధనా సక్సేనా పుణెలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ నుంచి విశిష్ట విద్యా రికార్డుతో డిగ్రీ పొందింది. ఫ్యామిలీ మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, తల్లి-పిల్లల ఆరోగ్యంలో డిప్లొమాలతో సహా వివిధ విద్యా అర్హతలు సాధించిన సాధన సక్సేనా న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో మెడికల్ ఇన్ఫర్మేటిక్స్‌లో రెండు సంవత్సరాల శిక్షణా కార్యక్రమం పూర్తి చేసింది. 1985లో ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో చేరిన సాధనా స్విట్జర్లాండ్‌లోని స్పీజ్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్, మిలిటరీ మెడికల్ ఎథిక్స్‌తో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ వార్‌ఫేర్‌లో శిక్షణ పొందింది. లెఫ్టినెంట్ జనరల్ నాయర్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) 2019లోని మెడికల్ ఎడ్యుకేషన్ కాంపోనెంట్‌లో కొంత భాగాన్ని రూపొందించడానికి ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ కస్తూరి రంగన్ కమిటీకి నిపుణులైన సభ్యురాలిగా నామినేట్ చేయబడింది. మెరిటోరియస్ సర్వీస్ కోసం వెస్ట్రన్ ఎయిర్ కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ బాధ్యతలు నిర్వహించింది. భారత రాష్ట్రపతిచే విశిష్ట సేవా పతకం పొందింది. ఆమె కుటుంబంలోని మూడు తరాల వారూ గత ఏడు దశాబ్దాలుగా సాయుధ దళాలలో పని చేశారు.

ఫ్రూట్‌ఫుల్‌గా తినండి

‘మధ్య వయసులో పండ్లు ఎక్కువగా తిన్న వారికి వార్ధక్యంలో డిప్రెషన్ రాదు, మంచి ఆరోగ్యం కోసం రోజుకు మూడు లేదా నాలుగు సార్లు పండ్లు లేదా పండ్లతో కూడిన ఆహారం తీసుకోవాలి’ ఇది ‘ద జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్, హెల్త్ అండ్ ఏజింగ్’ నిర్వహించిన అధ్యయనం. ఇరవై ఏళ్ల పాటు 14 వేల మంది మీద నిర్వహించిన సుదీర్ఘ అధ్యయనం వెల్లడించిన వాస్తవం ఇది.

ఈ అధ్యయనం సింగపూర్‌లో 1993 – 98ల మధ్య అనేక బ్యాచ్‌లుగా మొదలై 2014 నుంచి 2016 వరకు సాగింది. 52 ఏళ్ల వయసు వారితో మొదలైంది. స్టడీ పూర్తయ్యే నాటికి వారి వయసు 72కు చేరింది. రోజుకు మూడు దఫాలు పండ్లు లేదా పండ్ల ఆధారిత ఆహారాలు తీసుకుంటున్న వారితో పోలిస్తే ఒకసారి కూడా క్రమం తప్పకుండా పండ్లు తీసుకోని వారిలో జీరియాట్రిక్ డిప్రెషన్ (వార్ధక్య మాంద్యం) ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వార్ధక్య మాంద్యాన్ని దూరంగా ఉంచడానికి దోహదం చేస్తున్న పండ్లలో ఆరెంజ్, టాంజేరిన్, బొప్పాయి, అరటిపండ్లు, పుచ్చకాయలు ప్రధానంగా ఉన్నాయి. ఈ స్టడీ సింగపూర్‌లో దొరికే పండ్లు, సింగపూర్‌లో నివసించే వారి ఆధారంగా సాగింది. కాబట్టి తమ దేశానికి, వాతావరణానికి నూటికి నూరుశాతం వర్తించడం కష్టమని పాశ్చాత్య దేశాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ స్టడీ మనదేశానికి మాత్రం వర్తిస్తుంది.

స్థూలంగా అధ్యయనం ఏం చెబుతోందంటే... నలభై- యాభైల నుంచి క్రమం తప్పకుండా పండ్లు తింటే మానసిక ఆరోగ్యం బాగుంటుంది. తాజా పండ్లు, ఫ్రోజన్ ఫ్రూట్స్, సోలార్ డ్రైడ్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్, పండ్లతో చేసిన స్మూతీలు, సలాడ్‌లు, కస్టర్డ్, ఫ్రూట్ కేసరి... ఇలా ఏదో ఒక రూపంలో ఆహారంలో మూడు దఫాలు పండ్లు తీసుకోవడం మంచిది.



మెడిటరేనియన్ డైట్

మనం తీసుకునే ఆహారం దేహానికి, మనసుకి మధ్య దూరాన్ని పెంచుతోంది. ఆ దూరాన్ని, ఆందోళన, ఒత్తిడి, మానసిక బాధలను తగ్గించడానికి మెడిటరేనియన్ డైట్ దోహదం చేస్తోందని ఒక అధ్యయనాన్ని ప్రకటించారు న్యూయార్క్ చెందిన పరిశోధకులు.



పాశ్చాత్య శైలి ఆహారం– మెడిటరేనియన్ శైలి ఆహారం మధ్య జరిగిన తులనాత్మక అధ్యయనం ఇది. ప్రొఫెసర్ లినా బిగ్‌దాషే ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని బింఘంటన్ యూనివర్సిటీ పరిశోధకులు 1,591 మంది ఆహారపు అలవాట్లు, వారి మానసిక శారీరక ఆరోగ్యం మీద సర్వే నిర్వహించారు. ఆ ఫలితాలు ‘క్లోజ్ ఏ గ్యాప్’ పేరుతో న్యూట్రిషన్ అండ్ హెల్త్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మెడిటరేనియన్ డైట్‌లో పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, సీ ఫుడ్, ఆలివ్ ఆయిల్, బీన్స్ ప్రధానంగా ఉంటాయి. ఈ ఆహారం గుండెపోటు, గుండె వ్యాధులు, పక్షవాతాన్ని నివారిస్తుంది. మెడిటరేనియన్ ఫుడ్ దేహాన్ని తేలిగ్గా ఉంచడంతోపాటు మానసిక ఒత్తిడి, మానసిక బాధ తగ్గిస్తుంటే వెస్టర్న్ డైట్‌లో హైగ్లైసిమిక్ స్వభావం, ప్రాసెస్ చేసిన చక్కెరలు ఎక్కువ. ఇవి ఒత్తిడి పెరగడానికి కారణమవుతాయి. ఒత్తిడి అనేది మానసిక బాధలకు ముఖద్వారం వంటిది. అలాగే మాంసం ప్రధానంగా ఉండే ఆహారం నుంచి మనసు నెగెటివ్ స్వభావాన్ని గ్రహిస్తుంది. మెడిటరేనియన్ ఆహారం మెంటల్ అండ్ ఫిజికల్ హెల్త్‌ను పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మెంటల్ వెల్‌బీయింగ్‌కు దోహదం చేస్తుంది.

తిడితే మీరే చెడ్డవుతారు

పేరెంటింగ్

పిల్లలు మాట వినడం లేదు... చదవడం లేదు
ఫోన్ చూస్తున్నారు
ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు.
ఎంత తిట్టినా దారికి రావడం లేదు.
తల్లిదండ్రుల పరేషానీ ఇది.
పిల్లల్ని తిట్టే కొద్దీ వారి తప్పు ఎంతైనా
తల్లిదండ్రులను వారు
నెగెటివ్‌గా చూడటం మొదలెడతారు.
వారిచ్చే గౌరవం తగ్గుతూ పోతుంది.
పిల్లలిచ్చే గౌరవం తగ్గకుండా వారిని
దారికి ఎలా తీసుకురావాలి?



పిల్లలు మాట వినరు. ఎందుకు వినరంటే వాళ్లకు కొన్ని చెల్లుబాటు కావాలి. ఏది తినాలి, ఏ ఆట ఆడుకోవాలి, ఎప్పుడు స్కూల్ మానేయాలి, ఏ బట్టలు ధరించాలి, హోమ్‌వర్క్ ఎప్పుడు చేసుకోవాలి... ఇవన్నీ వాళ్ల దృష్టిలో తమ అధికారాన్ని తాము నిలబెట్టుకునే విషయాలు. పిల్లలు పిల్లలే అయినా వారూ అధికారం కోసం చూస్తారు. ఆ అధికారం నెరవేర్చుకునే క్రమాన్నే తల్లిదండ్రులు ‘మాట వినడం లేదు’ అని భావిస్తారు. అంతేకాదు పిల్లలకు ఇంట్లో తల్లిదండ్రుల నుంచి సరిగ్గా ప్రేమ అందకపోయినా, తోబుట్టువులతో ఘర్షణ ఉన్నా, తమను పట్టించుకునేవారు లేరనే ఫీలింగ్ కలిగినా వారు మొండికేస్తారు. సబబైన కారణాలను కూడా వ్యతిరేకిస్తారు. వారిని తిట్టేకొద్దీ తల్లిదండ్రులను మరింత విలన్లుగా భావిస్తూ వెళతారు. అందుకే తల్లిదండ్రులు తమ తరఫు నుంచి వారి తరఫు నుంచి కూడా ఆలోచించి విషయాలను దారికి తెచ్చుకోవాలి. ఏం చేయాలి?

సుదీర్ఘ ఉపన్యాసాలు వద్దు

తల్లిదండ్రులు కూడా మాట వినని పిల్లల్ని దొరికినప్పుడు ఇచ్చి పడేద్దాం అనుకుంటారు. పిల్లలు ఏదైనా తప్పో, పొరపాటో చేస్తే పాత చిట్టాపద్దులు తీసి సుదీర్ఘ క్లాసులు పీకుతారు. అస్సలు క్లాసులు పీక కూడని సమయమది. ‘ఈ పొరపాటు మళ్లీ జరక్కుండా చూసుకో’ అనే ఒక్కమాటతో ఆ సందర్భాన్ని వదిలి మళ్లీ ఆ పిల్లలు ప్లెజర్ మూడ్‌లో ఉన్నప్పుడు మెల్లగా వారు చేసిన తప్పును ఎనలైజ్ చేసి సలహాలు ఇవ్వాలి. ఇదే వారు వినే టైము. అది కాదు.

మెచ్చుకోలు

పిల్లల్ని మెచ్చుకుంటే డబ్బులు ఖర్చవుతాయన్నట్టు కొందరు తల్లిదండ్రులు ఉంటారు. ‘బాగా చేశావు’, ‘చక్కగా పని అందుకున్నావు’, ‘నువ్వు చాలా కన్సర్న్ ఉన్న పిల్లాడివి’, ‘అన్నీ అర్థం చేసుకునే అమ్మాయివి’... ఇలా మాట్లాడితే ఈ మెచ్చుకోలుకు కొనసాగింపుగా వారి తప్పుల్ని సరిదిద్దే మాటలు వారికి చెప్పొచ్చు. ప్రశంస లేకుండా విమర్శ మాత్రమే ఉండాలంటే ఎలా? అది కుదరదు పిల్లల విషయంలో.

వారితోనే మాట్లాడండి: పిల్లలు దారికి రావాలంటే వారికి సుద్దులు చెప్పే సమయంలో తల్లిదండ్రులు టీవీ చూస్తూ, రెడీ అవుతూ, కూరగాయలు తరుగుతూ, ఫోన్ చూసుకుంటూ ఉంటే వారు వినరు. వారి పక్కన కూచోవాలి. వారిని నిలబెట్టి వారి ముందు మోకాళ్ల మీద కూచుని కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ మృదువుగా వారికి చెప్పాల్సింది చెప్తే మన తపన వారికి అర్థమవుతుంది. వింటారు. వాళ్లు కోరే బ్రేక్‌ఫాస్ట్ ఇవాళ పెట్టలేకపోతే రేపు పెడతామని చెప్పినా గొడవ ముగుస్తుంది.

వద్దు అనే మాట వద్దు: ఇంట్లో పరిగెత్తొద్దు, తమ్ముణ్ణి తాకొద్దు, ఫ్రిజ్ తెరవొద్దు, ఫోన్ చూడొద్దు... ఈ వద్దు అనే మాట పిల్లలను సగం మొండిగా మారుస్తుంది. ఎందుకు వద్దు అనిపిస్తుంది. ఈ వద్దును ఇంకోలా చెప్పాలి. ‘ఇప్పుడే ఇల్లు తుడిచాను. ఆరాక తిరుగు నాన్నా’, ‘తమ్ముడు చిరాగ్గా ఉన్నాడు. పాపం వాణ్ణి కాసేపు వదిలెయ్’, ‘ఫ్రిజ్‌ను ఊరికూరికే తెరిస్తే కూలింగ్ పోయి నీ చాక్లెట్లే పాడవుతాయి కన్నా’... ‘ఫోన్‌లో అంత ఇంటరెస్టింగ్ ఏముందోయ్... క్రికెట్ కోసం పిలుస్తున్నారు చూడు’... ఇలా.

తుఫానుకు ముందు సంకేతం: పిల్లలు మాట వినడం లేదనేది తుఫానుకు ముందు సంకేతం. వారికి ఏ సమస్య ఉంది, ఏ అలజడి ఉంది, అది చెప్పలేక ఇలా ప్రవర్తిస్తున్నారా... అనేది చూసుకోవాలి. స్కూల్ వాతావరణం, ఇంటి వాతావరణం, స్నేహితులు, ఇరుగు పొరుగు, బంధువులు, పరీక్షలు, మార్కులు... ఈ మొత్తం ఆవరణంలో వారు ఎక్కడ అవస్థ పడుతున్నారో తెలుసుకుని పరిష్కారం చూపితే ఈ మాట వినకపోవడం ఆటోమాటిక్‌గా పోతుంది. తల్లిదండ్రుల గౌరవం మిగులుతుంది.

లైఫ్@360

పళ్లు జివ్వు..?

కొంతమందికి వేడి కాఫీ, టీ తాగినప్పుడు లేదా చల్లని పానీయాలు తాగినప్పుడు, చల్ల గాలిలోనూ, బ్రష్ చేసేటప్పుడు, స్వీట్స్ తీసుకున్నప్పుడు పంటి నొప్పి వస్తుంది. ఈ సమస్యకి చెక్ పెట్టాలంటే కొన్ని ఇంటి చిట్కాలు ఫాలో అవ్వాలి. అవేంటో చూద్దామా...



గ్రీన్ టీ... గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కార్డియోవాస్క్యులర్, క్యాన్సర్ సమస్యల్ని దూరం చేస్తాయి. అంతే కాకుండా గ్రీన్ టీ తీసుకోవడం వల్ల ఓరల్ హెల్త్ బాగుంటుంది. దంత సమస్యలు ఉన్నప్పుడు గ్రీన్ టీని రోజుకి రెండుసార్లు తాగడం మంచిది.

పసుపు... పసుపులోని కర్క్యుమిన్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి ఆయుర్వేదిక్ చికిత్సలు, జీర్ణ సమస్యలు, గాయాలని తగ్గించడంలో వాడతారు. దీనికోసం.. పచ్చి పసుపుకొమ్ముని పళ్ళపై రుద్దాలి. లేదంటే..టీ స్పూన్ పసుపుని అర టీస్పూన్ ఉప్పు, అరటీస్పూన్, ఆవనూనెలో కలపాలి. దీనిని చిగుళ్ళపై రాస్తే నొప్పి తగ్గుతుంది.

తేనె, గోరువెచ్చని నీరు... తేనెలో యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. దీనిని వాడడం వల్ల వల్ల నొప్పి, వాపు తగ్గుతాయి. దీనికోసం ముందుగా గోరువెచ్చని నీటిలో స్పూన్ పరిమాణంలో తేనె కలపండి. దీంతో పుక్కిలించండి.

పుక్కిలించడం... ఉప్పులో యాంటీ సెప్టిక్ గుణాలు ఉన్నాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్‌ని దూరం చేస్తుంది. దీంతో నొప్పు తగ్గుతుంది. అందుకోసం ఉప్పు నీటితో రోజుకి రెండుసార్లు పుక్కిలించాలి.

దీనికోసం... కొద్దిగా ఉప్పుని గ్లాసు గోరువెచ్చని నీటిలో వేయాలి. ఈ నీటిని నోటిలో పోసి 30 సెకన్ల పాటు ఉండాలి. తర్వాత నీటిని ఉమ్మేయాలి.
దీంతోపాటు... ఈ ఇంటి చిట్కాలన్నీ తాత్కాలిక ఉపశమనానికి మాత్రమే. వీటిని పాటిస్తున్నా, సమస్య తగ్గకపోతే డాక్టర్‌ని కలవాలి. సమస్య రాకుండా ఉండాలంటే.. ఓరల్ హైజీన్ సరిగ్గా ఉండాలి. దంతాలను, నోటిని చక్కగా శుభ్రం చేయాలి. సాఫ్ట్ టూత్ బ్రష్ వాడాలి. అసిడిటీని కలిగించే ఆహార పానీయాలను తగ్గించాలి. రెగ్యులర్‌గా డెంటల్ చెకప్స్ చేయించాలి.

ఇంటిప్

బట్టలు ఆరడం లేదా?



వర్షాకాలం వచ్చిందంటే చాలు.. బట్టలు ఆరడం పెద్దపని అని చెప్పొచ్చు. వాటిని నీరు లేకుండా ఎంత గట్టిగా పిండి ఆరేసినా అంత త్వరగా ఆరవు. అలాంటప్పుడు ఏం చేయాలంటే బట్టల్ని అన్నింటినీ ఒకేసారి ఆరబెట్టద్దు. కొన్ని బట్టలు ఉతికిన తర్వాత, అవి ఆరిన తర్వాత మరికొన్ని బట్టల్ని ఆరెయ్యాలి. దీంతో బట్టలు త్వరగా ఆరతాయి. అలాగే ఐరన్ చేయడం వల్ల కూడా బట్టల్ని ఈజీగా ఆరబెట్టుకోవచ్చు. దీనివల్ల బట్టలు పొడిగా అవుతాయి. అయితే, మరీ తడిబట్టలపై ట్రై చేయొద్దు. అలానే, ఒక టబ్‌లో పాత టవల్స్ వేసి, ఆరెయ్యాల్సిన బట్టలు వాటి మీద వేయండి. అందులోని నీరు టవల్ పీల్చుకుంటుంది. తర్వాత రెండింటిని ఆరెయ్యాలి.

సినిమా

పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి



● ‘బన్నీ’ వాసు

‘‘ఆయ్’ కో ప్రొడ్యూసర్స్ రియాజ్, భాను నాకు మంచి మిత్రులు. వాళ్ల చెప్పడంతో అంజి చెప్పిన ‘ఆయ్’ కథ వింటూ రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వాను. ప్రేక్షకులతో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నా ముందు సీట్‌లో ఉన్న ఓ వ్యక్తి నవ్వులేక లేచి నిలబడ్డాడు. నేను కథ విన్నప్పుడు ఎలాగైతే ఎంజాయ్ చేశానో దాన్ని స్క్రీన్‌పై చూసి ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారని అప్పుడు అర్థమైంది’’ అని నిర్మాత ‘బన్నీ’ వాసు అన్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన చిత్రం ‘ఆయ్’. అల్లు అరవింద్ సమర్పణలో ‘బన్నీ’ వాసు, విద్యా కొప్పినీడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం ‘బన్నీ’ వాసు మీడియాతో మాట్లాడుతూ– ‘‘ఆయ్’లోని వినోదానికి దర్శకుడు భావోద్వేగాలను కలపడంతో మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. ఈ చిత్రానికి వస్తోన్న స్పందన చూసి పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. ‘ఆయ్’ షోలు పెంచేందుకు చర్చలు జరుగుతున్నాయి’’ అన్నారు.

ప్రేక్షకుల అభిరుచిని నమ్ముతాను



● కేఈ జ్ఞానవేల్ రాజా

‘‘తంగలాన్’ సినిమాకు తెలుగులో మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. మేము అనుకున్నదానికంటే రెట్టింపు వసూళ్లు వస్తుండటంతో ఆశ్చర్యపోతున్నాం. విక్రమ్‌గారి కెరీర్‌లో ‘తంగలాన్’ చిత్రానివే హయ్యెస్ట్ ఓపెనింగ్స్’’ అని నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా అన్నారు. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వం వహించిన చిత్రం ‘తంగలాన్’. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న రిలీజ్ అయింది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా కేఈ జ్ఞానవేల్ రాజా మీడియాతో మాట్లాడుతూ– ‘‘నేనెప్పుడూ డైరెక్టర్‌నే నమ్ముతాను. పా. రంజిత్‌గారిపై నమ్మకంతో ‘తంగలాన్’ విషయంలో స్వేచ్ఛ ఇచ్చాం. సినిమాల మేకింగ్ విషయంలో నా నమ్మకం ఏంటంటే ప్రేక్షకుల అభిరుచిని విశ్వసించడమే. హిందీతో పాటు మిగతా అన్ని భాషల్లోనూ ఈ నెల 30న ‘తంగలాన్’ని రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు.

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన

భావోద్వేగానికి పట్టం

● ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి ● ఉత్తమ నటీమణులు నిత్యామీనన్, మానసీ పరేఖ్ ● ఉత్తమ చిత్రం మలయాళ ‘ఆట్టమ్’ ● ఉత్తమ దర్శకుడు సూరజ్ బర్జాత్యా ● ప్రాంతీయ ఉత్తమ చిత్రం ‘కార్తికేయ 2’

70వ జాతీయ అవార్డులకు గాను దేశవ్యాప్తంగా 28 భాషలకు చెందిన 300 చిత్రాల వరకూ పోటీ పడ్డాయి. 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 లోపు సెన్సార్ అయిన చిత్రాలకు పోటీలో అవకాశం ఉంటుంది. అవార్డుల కోసం వివిధ విభాగాలకు సంబంధించిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి విజేతలను వెల్లడించింది. ఈసారి భావోద్వేగానికి పట్టం కట్టినట్లుగా తెలుస్తోంది. ప్రధాన అవార్డులను పరిశీలిస్తే... ఎమోషనల్‌గా సాగే కథాంశాలకు, భావోద్వేగమైన నటనకు అవార్డులు దక్కినట్లుగా అనిపిస్తోంది. ఆ వివరాలు...

ద్వాపర యుగంలోని శ్రీకృష్ణుడి కడియం కలియుగంలో అంతు చిక్కని సమ్యలకు ఎలా పరిష్కారం చూపించింది? అనే అంశంతో రూపొందిన డివోషనల్, ఎమోషనల్ తెలుగు మూవీ ‘కార్తికేయ 2’ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘కాంతార’. ఈ చిత్రంలో కనబర్చిన పవర్‌ఫుల్, ఎమోషనల్ నటనకుగాను రిషబ్ శెట్టి జాతీయ ఉత్తమ నటుడి అవార్డు సాధించగా, సంపూర్ణ వినోదాన్ని అందించి, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగానూ అవార్డు దక్కించుకుంది. ప్రేమ, ప్రేమలో విఫలం, కుటుంబ బంధాల నేపథ్యంలో మిత్రన్ జవహర్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం ‘తిరుచిత్రాంబళమ్’లో కనబరిచిన గాఢమైన భావోద్వేగ నటనకు గాను నిత్యామీనన్‌ను జాతీయ ఉత్తమ నటి అవార్డు వరించింది. భర్త అక్రమ సంబంధం సాగిస్తున్నాడని తెలుసుకున్నాక ఓ భార్య ఏం చేసింది? అనే కథాంశంతో రూపొందిన గుజరాతీ చిత్రం ‘కచ్ ఎక్స్‌ప్రెస్’లో భార్య పాత్రలో కనబర్చిన భావోద్వేగానికి గాను ఉత్తమ నటిగా మానసీ పరేఖ్ అవార్డు అందుకోనున్నారు. ఓ నాటక రంగానికి సంబంధించిన ట్రూప్ నేపథ్యంలో ఆనంద్ ఇకర్షి దర్శకత్వంలో రూపొందిన మలయాళ చిత్రం ‘ఆట్టమ్’కి ఉత్తమ చిత్రం, స్క్రీన్‌ప్లే విభాగాల్లో రెండు అవార్డులు దక్కాయి. చనిపోయిన ఓ స్నేహితుడి చివరి కోరికను నెరవేర్చడానికి ముగ్గురు వృద్ధ స్నేహితులు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి ట్రెక్‌కి వెళ్లే కథాంశంతో తెరకెక్కిన హిందీ చిత్రం ‘ఊంచాయి’. ఈ ఎమోషనల్ రైడ్‌ని అద్భుతంగా ఆవిష్కరించిన సూరజ్ బర్జాత్యా జాతీయ ఉత్తమ దర్శకుడి అవార్డు సాధించారు. ఉత్తమ సంగీత దర్శకత్వం (పాటలు) అవార్డును హిందీ ‘బ్రహ్మాస్త్ర – పార్ట్ 1: శివ’కి సంగీత దర్శకుడు ప్రీతమ్, ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డును తమిళ ‘పొన్నియిన్ సెల్వన్ పార్ట్–1’కు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ దక్కించుకున్నారు.



● ‘కార్తికేయ 2’ పోస్టర్



● ‘కాంతార’ పోస్టర్



● ‘ఆట్టమ్’ పోస్టర్




● నిత్యా మీనన్ ● మానసీ పరేఖ్

ఇక గత ఏడాది పది అవార్డులు దక్కించుకున్న తెలుగు పరిశ్రమ ఈసారి ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డుతో సరిపెట్టుకుంది. ఇంకా పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించారు.

జాతీయ అవార్డులోని కొన్ని విభాగాలు....
● ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార – కన్నడ) ● నటీమణులు: నిత్యా మీనన్ (తిరుచిత్రాంబళమ్ – తమిళ్), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్ – గుజరాతీ) ● చిత్రం: ఆట్టమ్ (మలయాళం) ● దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఊంచాయి – హిందీ) ● దర్శకుడు (డెబ్యూ): ప్రమోద్ కుమార్ (ఫౌజా –హరియాన్వీ) ●సంగీత దర్శకత్వం (పాటలు): ప్రీతమ్ (బ్రహ్మాస్త్ర: శివ– హిందీ) ● సంగీత దర్శకత్వం (నేపథ్య సంగీతం): ఏఆర్ రెహమాన్ (పొన్నియిన్ సెల్వన్ – 1, తమిళ్) నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర– పార్ట్ 1: శివ – హిందీ) ● నేపథ్య గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225/2009 – మలయాళం) ● సహాయ నటి: నీనా గుప్తా (ఊంచాయి– హిందీ) ● సహాయ నటుడు: పవర్ రాజ్ మల్హోత్రా (ఫౌజా – హరియాన్వి) ● బాల నటుడు: శ్రీపత్ (మాలికాపురమ్ – మలయాళం) ● సినిమాటోగ్రఫీ: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వన్ పార్ట్ – 1) ● కొరియోగ్రఫీ: జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ (తిరుచిత్రాంబళమ్ – తమిళ్) ● యాక్షన్ డైరెక్షన్: అన్బు–అరివు (కేజీఎఫ్ 2 – కన్నడ) ● విజువల్ ఎఫెక్ట్స్: బ్రహ్మాస్త్ర – పార్ట్ 1: శివ (హిందీ) ● మాటల రచయిత : అర్పితా ముఖర్జీ, రాహుల్ వి. చిట్టెల (గుల్‌మోహర్ – హిందీ) ● సౌండ్ డిజైన్: ఆనంద్ కృష్ణమూర్తి – పొన్నియిన్ సెల్వన్ – 1 (తమిళం) ● స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): ఆనంద్ ఏకార్షి (ఆట్టమ్ – మలయాళం) ● జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను ప్రోత్సహించే చిత్రం: కచ్ ఎక్స్‌ప్రెస్ (గుజరాతీ) ● సంపూర్ణ వినోదాన్ని అందించి, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కాంతార (కన్నడ).

ప్రాంతీయ ఉత్తమ చిత్రాలు
● తెలుగు: కార్తికేయ–2 ● కన్నడ: కేజీఎఫ్ చాప్టర్–2 ● తమిళ్: పొన్నియిన్ సెల్వన్ – 1
● మలయాళం: సౌది వెళ్లక్క సీసీ 225/2009
● హిందీ: గుల్‌మోహర్



● సూరజ్ బర్జాత్యా

కెరాడి టు పాన్ ఇండియా

కర్ణాటకలోని కెరాడి అనే గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు రిషబ్ శెట్టి. చిత్ర పరిశ్రమలోకి రాక ముందు పలు ఉద్యోగాలు చేశారు రిషబ్. డిగ్రీ చదివేటప్పుడు సినిమాలు చూసేందుకు డబ్బుల కోసం కూలి పనులు చేశారు. 2004 నుంచి 2014 వరకు (తొలి సారి డైరెక్షన్ చేసేవరకు) వాటర్ క్యాన్‌లు అమ్మారు. రియల్ ఎస్టేట్ సంస్థలో, హోటల్స్‌లో పని చేశారు. క్లాప్ బాయ్‌గా ఇండస్ట్రీలో జర్నీ ప్రారంభించిన రిషబ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గానూ చేశారు. ‘తుగ్లక్’ అనే చిత్రంలో తన మొదటి పాత్రను పోషించారు. రక్షిత్ శెట్టి హీరోగా రిషబ్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం ‘రికీ’ (2016). ఆ తర్వాతి సినిమా ‘కిరిక్ పార్టీ’తో దర్శకుడిగా రిషబ్ పేరు కన్నడ నాట మార్మోగింది. హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ‘కాంతార’తో రిషబ్ పాన్ ఇండియా స్టార్ అయ్యారు.

అవార్డు బాధ్యత పెంచింది

– చందు మొండేటి



● టీజీ విశ్వప్రసాద్, చందు, అభిషేక్ అగర్వాల్

‘‘మా సినిమాకి జాతీయ అవార్డు రావడం మా బాధ్యతని మరింత పెంచింది. ‘కార్తికేయ 2’ తర్వాత ‘కార్తికేయ 3’పై అంచనాలు ఎంతలా పెరిగాయో తెలుసు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ‘కార్తికేయ 3’ ఉంటుంది’’ అని డైరెక్టర్ చందు మొండేటి అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా చందు మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన చిత్రం ‘కార్తికేయ 2’. ప్రాంతీయ విభాగంలో ఉత్తమ చిత్రం అవార్డును సాధించిన సందర్భంగా చిత్రబృందం సమావేశం నిర్వహించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఈ నేషనల్ అవార్డు మా పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ఓ మైల్‌స్టోన్ మూమెంట్. మా బ్యానర్‌కి తొలి జాతీయ అవార్డు ఇది’’ అన్నారు. ‘‘కృష్ణుడు నిజం అని ఈరోజు మరోసారి ప్రూవ్ అయ్యింది. ఈ అవార్డు కృష్ణుడే తీసుకొచ్చారని భావిస్తున్నాను’’ అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నిఖిల్ మాట్లాడుతూ – ‘‘కార్తికేయ 2’ విజయం సాధించడానికి, అవార్డు రావడానికి కారణం మా టీమ్. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ చూసిన సినిమా ఇది. దేశవ్యాప్తంగా చాలా భాషల్లో రిలీజై, అద్భుతమైన విజయం సాధించింది. మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు, అవార్డు ప్రకటించిన జ్యూరీకి థ్యాంక్స్’’ అన్నారు.

కార్తికేయ కథేమిటంటే... ద్వాపర యుగంలో తనువు చాలించే ముందు శ్రీకృష్ణుడు తన కాలి కడియాన్ని ఉద్ధవునికి ఇచ్చి, ‘కలియుగంలో వచ్చే ఎన్నో అంతు చిక్కని సమస్యలకు ఈ కడియం పరిష్కారం చూపుతుంది’ అని చెబుతాడు. కలియుగంలో నాస్తికుడైన డాక్టర్ కార్తికేయ (నిఖిల్) తన తల్లి ఒత్తిడి మేరకు ఓ మొక్కు తీర్చుకోవడానికి ద్వారక నగరానికి వెళతాడు. అప్పటికే కడియానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించిన ప్రొఫెసర్ రంగనాథ రావ్‌ను హతమార్చడానికి ట్రై చేస్తుంటాడు సైంటిస్ట్ శాంతను. అతని మనుషుల చేతిలో హతమవ్వడానికి ముందు రంగనాథ రావ్ అనుకోకుండా కార్తికేయను చివరిసారి కలుస్తాడు. దాంతో శాంతను మనుషులతో పాటు శ్రీకృష్ణ భక్తులైన అధీరుల తెగకు చెందిన వ్యక్తులకు సైతం కార్తికేయ టార్గెట్ అవుతాడు. అయితే రంగనాథ రావ్ మనవరాలు ముగ్ధ (అనుపమ) సాయంతో వారందరి నుంచి డాక్టర్ కార్తికేయ ఎలా తప్పించుకున్నాడు? చంద్రశిల శిఖరంలోని శ్రీకృష్ణుడి కడియాన్ని ఎలా సొంతం చేసుకున్నాడు? అన్నదే కథ.

ఆనంద్ ఇకర్షి దర్శకత్వం వహించిన ‘ఆట్టమ్’ కథేంటంటే.. ఓ నాటక బృందంలో 12 మంది నటులు, ఒక నటీమణి ఉంటారు. నటులుగా వినయ్ పాత్రలో వినయ్ ఫోర్ట్, అంజలిగా జరీన్ షిబాబ్, కళాభవన్ షాజాన్ హరి కీలక పాత్రలు పోషించారు. వీళ్ల నాటక ప్రదర్శన ఓ విదేశీ జంటకి నచ్చడంతో తమ రిసార్ట్‌లో వాళ్లకి ఆతిథ్యమిస్తారు. పార్టీ అనంతరం ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లి నిద్రపోతారు. అయితే తన గదిలో కిటికీ పక్కన నిద్రపోతున్న అంజలితో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆ వ్యక్తి నాటక బృందంలోని 12 మందిలో ఒకరా? లేకుంటే బయటి వ్యక్తా? అనే విషయాన్ని అంజలి ఎలా బయటపెట్టింది? అన్నది ‘ఆట్టమ్’ కథ. హాలీవుడ్ మూవీ ‘12 యాంగ్రీమెన్’ (1954) ఆధారంగా ‘ఆట్టమ్’ రూపొందింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	1,331	397
	80,437	24,541

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,642	▲	47
డోజోన్స్	40,682	▲	108
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,311	▲	36
డాక్స్	18,322	▲	139
షాంఘై	2,879	▲	2
నికాయ్	38,063	▲	4

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో (శుక్రవారం ముగింపు)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	70,604
బంగారం (99.5 స్వచ్ఛత)	70,321
వెండి (కేజీ)	81,510

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.54	84.56
£	బ్రిటన్ పౌండ్		106.90	109.48
€	యూరో		91.10	93.49
¥	జపాన్ ఎన్ (100)		55.82	57.07
AUS$	ఆస్ట్రేలియా డాలర్		54.71	56.65
S$	సింగపూర్ డాలర్		61.35	66.06
SAR	సౌదీ రియాల్		21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్		21.97	23.75
¥	చైనా యువాన్		10.84	12.67

ఎస్‌బీఐ రుణ రేట్లు పెరిగాయ్‌..

0.1శాతం పెంపు ; తక్షణం అమల్లోకి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలపై వడ్డీరేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణరేటు (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. ఆగస్టు 15 నుంచి తాజా 0.1% రుణ రేటు పెరుగుదల అన్ని వర్తిస్తుందని తన వెబ్‌సైట్‌లో బ్యాంక్ పేర్కొంది. దీనితో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన కస్టమర్ల రుణాల వడ్డీరేట్లు స్వల్పంగా పెరగనున్నాయి. తాజా రేట్లను పరిశీలిస్తే..

- ఆటో, వ్యక్తిగత రుణాలకు సాధారణంగా వర్తించే ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ 8.85% నుంచి 8.95%కి పెరిగింది.
- రెండేళ్ల రేటు 9.05%కి, మూడేళ్లరేటు 9.10 శాతానికి ఎగసింది.
- నెల, మూడు, ఆరు నెలల కాలపరిమితుల రేట్లు 8.45 శాతం–8.85 శాతం శ్రేణిలో ఉంటాయి. ఓవర్‌నైట్ కాలపరిమితి రేటు 8.10 శాతం నుంచి 8.20 శాతం ఎగసింది.
- పీఎన్‌బీ రుణ రేటు ఇటీవలే అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా, బీఓఐ కేవలం బెంచ్‌మార్క్ ఏడాది రుణ రేటును ఇదే స్థాయిలో 0.05 శాతం పెంచింది. ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ కూడా రుణ రేట్లను అన్ని కాలపరిమితుల 5 బేసిస్ పాయింట్లు పెంచింది. తాజాగా ఎస్‌బీఐ మూడవసారి పెంచింది.

చెలరేగిన బుల్‌!

రెండు నెలల్లో అతిపెద్ద ర్యాలీ



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ లాభాలు ఆర్జించాయి. అన్ని రంగాల్లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 1,331 పాయింట్లు పెరిగి 80,437 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 397 పాయింట్లు లాభపడి 24,541 వద్ద నిలిచింది. ఈ ముగింపు రెండు వారాల గరిష్టం కావడం విశేషం. సూచీలు 2% ర్యాలీతో స్టాక్ మార్కెట్లో రూ.7.30 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.451.59 లక్షల కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) కు చేరింది.

ఇంట్రాడే ట్రేడింగ్ ఇలా..!

సెన్సెక్స్ ఉదయం 649 పాయింట్లు లాభంతో 79,755 వద్ద, నిఫ్టీ 191 పాయింట్లు పెరిగి 24,335 వద్ద మొదలైంది. రోజంతా లాభాల్లో కొనసాగాయి. ఐటీతో పాటు అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,412 పాయింట్లు ర్యాలీ చేసి 80,518 వద్ద, నిఫ్టీ 295 పాయింట్లు పెరిగి 24,531 వద్ద గరిష్టాలు తాకాయి.

- బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 3%, రియల్టీ 2.50%, ఆటో, కమోడిటీ, విద్యుత్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు రెండుశాతం చొప్పున రాణించాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 2%, 1.75 శాతం రాణించాయి.
- సెన్సెక్స్ సూచీలో 30 షేర్లన్నీ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, టీసీఎస్, హెచ్‌సీఎల్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. నిఫ్టీ సూచీలో 50 షేర్లలో దివీస్ ల్యాబ్స్ (0.50%), ఎస్‌బీఐ లైఫ్ (0.10%), డాక్టర్ రెడ్డీస్ (0.01%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 47 షేర్లూ లాభపడ్డాయి.
- ఎలక్ట్రిక్ బైక్స్‌లో 3 మోడళ్లను ఆవిష్కరించడంతో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ షేరు 20% ర్యాలీ చేసి రూ.133 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

లాభాలు ఎందుకంటే

- అమెరికా రిటైల్ అమ్మకాలు పెరగడం, నిరుద్యోగ క్లెయిమ్స్ డేటా తగ్గడంతో ఆర్థిక మాంద్యం భయాలు సన్నగిల్లాయి. అలాగే జూలై సీపీఐ ద్రవ్యోల్బణ డేటా అంచనాలకు తగ్గట్లు నమోదు కావడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగాయి. ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ ఇండెక్స్ 103 స్థాయి నుంచి 102.81 స్థాయికి దిగివచ్చింది. ఇటీవల భారీగా పతనమైన జపాన్ కరెన్సీ యెన్ స్థిరత్వాన్ని ప్రదర్శించింది. దీంతో యూఎస్ మార్కెట్లు గురువారం 2% ర్యాలీ చేశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 3–1% చొప్పున లాభపడ్డాయి. అమెరికాతో సహా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల ధోరణి దేశీయ ఈక్విటీ మార్కెట్లకు కలిసొచ్చాయి.
- సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాయి. ఆగస్టు నెలలో 2.5 శాతం దాకా నష్టపోయాయి. దీంతో కనిష్టాల వద్ద ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టడం సూచీలకు కలిసొచ్చిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- బ్లూచిప్ షేర్లు టీసీఎస్ (3%), ఐసీఐసీఐ (2%), ఇన్ఫీ (2%), ఐటీసీ (2%) హెచ్‌డీఎఫ్‌సీ (1.50%), రిలయన్స్ (1%) రాణించి ర్యాలీకి దన్నుగా నిలిచాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ. 4000 కోట్ల ఐపీఓ	ఏసీ కంపెనీలకు కలిసొచ్చిన వేసవి

అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి రికార్డులు



న్యూయార్క్: అంతర్జాతీయంగా న్యూయార్క్ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ధర కొత్త రికార్డు స్థాయిలను చూసింది. చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ ఫ్యూచర్స్ ఔన్స్ (31.1గ్రా) ధర ఈ వార్త రాస్తున్న రాత్రి 10 గంటల సమయంలో క్రితం ముగింపుతో పోల్చితే 40 డాలర్లు పెరిగి 2,534 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 2,538 డాలర్లనుసైతం చూసింది. అమెరికా ఫెడ్ ఫండ్ రేటు కోత అంచనాలకుతోడు భౌగోళిక ఉద్రిక్తతలు ప్రత్యేకించి పశ్చిమాసియా పరిణామాలు దీనికి నేపథ్యం.

ఉద్యోగుల రివార్డుల్లో 'నవ'శకం!

ఉద్యోగుల శ్రమకు గుర్తింపుగా సర్టిఫికెట్లు, గిఫ్టుల వంటివి ఇవ్వడం పరిపాటి. అయితే, అన్ని రంగాల్లో ఇప్పుడు నవతరం జెన్ జెడ్ అడుగుపెట్టడంతో ఈ ట్రెండ్ క్రమంగా మారుతోంది. సిబ్బందికి రివార్డుల్లో భారత కార్పొరేట్ కంపెనీలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సాంప్రదాయ బహుమతులు, సర్టిఫికెట్లకు బదులు డిజిటల్ బాట పడుతూ 'సోషల్' కల్చర్‌తో వారిలో నూతనోత్తేజాన్ని నింపుతున్నాయి. – సాక్షి, బిజినెస్ డెస్క్

- సర్టిఫికెట్లు, రొటీన్ బహుమతులకు గుడ్‌బై
- డిజిటల్ బాట పడుతున్న కార్పొరేట్లు..
- బ్యాడ్జ్‌లు, పాయింట్లు తదితర రూపాల్లో గుర్తింపు
- అంతా జెన్ జడ్ మహిమే అంటున్న విశ్లేషకులు



భారత కార్పొరేట్ రంగంలో కొత్త రివార్డుల సంస్కృతికి తెరలేచింది. కంపెనీలు తమ ఉద్యోగులకు అందించే బహుమతుల ప్రోగ్రామ్‌ను పూర్తిగా మార్చేస్తున్నాయి. ఇప్పుడంతా డిజిటల్ రివార్డులకే ఓటేయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా యువ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వారి ప్రాధాన్యతలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి కంపెనీలు. ఉద్యోగుల విజయాలు, కొత్తగా నేర్చుకున్న స్కిల్స్‌కు గుర్తింపుగా బ్యాడ్జ్‌లు, పాయింట్లు, నోట్స్ వంటివి అందిస్తుండటంతో ఎంప్లాయీస్ మూడు షేర్.. ఆరు లైక్‌లతో ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఎప్సిలాన్ ఇండియా 'సిటిజన్ ఆఫ్ 'యూ'నివర్స్' పేరుతో 'పాస్‌పోర్ట్'ను ప్రవేశపెట్టింది. యువతరం కోరుకునే వినోదం, సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని దీన్ని తీసుకొచ్చింది. 'ఈ రోజుల్లో ప్రజలు, ముఖ్యంగా యువత దేన్నైనా సరే ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసేస్తున్నారు. ఆఫీస్ సమావేశం లేదా ఈవెంట్లో పాల్గొన్న ప్రతిసారి 'పాస్‌పోర్ట్'పై స్టాంప్ పడుతుంది. ఈ గుర్తింపును వారు షేర్ చేసుకోవడం ద్వారా ఇతరులతో పంచుకోవచ్చు' అని కంపెనీ హెచ్ఆర్ హెడ్ సోనాలి దేసర్కార్ పేర్కొన్నారు. రోష ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ ఇండియా కూడా అప్లాజ్ పేరుతో అంతర్గత స్టోర్‌ను ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చింది. గుర్తింపులో భాగంగా లభించే పాయింట్లతో సిబ్బంది హెడ్‌ఫోన్‌ల నుంచి ఈవెంట్ టిక్కెట్ల వరకు ఏదైనా కొనుక్కునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కంపెనీ ఎండీ రాజా జమలమడక చెప్పారు.

అంతా 'సోషల్'మయం...

ఉద్యోగులు, ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో మునిగితేలుతుండటంతో.. కంపెనీలు తప్పనిసరిగా ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నాయి. 'యువతరంలో సోషల్ ఆరాటం, భావోద్వేగాలు చాలా ఎక్కువ. అందుకే వారు సాధించే విజయాలను సీనియారిటీతో సంబంధం లేకుండా సహచరులు ఒకరికొకరు అభినందించుకోవడానికి, కృతజ్ఞతలు తెలియజేయడానికి లీడర్‌షిప్‌బోర్డ్‌లు వీలు కల్పిస్తున్నాయి' అని థ్రైవ్ డిజిటల్ ప్రెసిడెంట్, సీఈఓ శంకరనారాయణన్ చెప్పారు. ఇక మెర్క్ ఇండియా వార్షిక గుర్తింపు వారం, ప్యానెల్ ఆధారిత అవార్డులు, స్పాట్ అవార్డులు.. ఇలా మూడు రకాలను అమలు చేస్తోంది. ఆల్‌స్టేట్ ఇండియా ప్రతి ఉద్యోగికి నెలనెలా 100 పాయింట్లు అందిస్తోంది. వీటిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవచ్చు, అంతర్గత స్టోర్‌లో రిడీమ్ చేసుకోవచ్చు.

డిజిటల్ బ్యాడ్జ్‌లకు ప్రాచుర్యం

ఉద్యోగుల విజయాలు, నైపుణ్యాలకు అద్దంపట్టే డిజిటల్ బ్యాడ్జ్‌లకు అన్ని కంపెనీల్లోనూ బాగా ప్రాచుర్యం లభిస్తోంది. సిబ్బంది తమ సాఫల్యాలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో షేర్ చేసుకునే విధంగా కంపెనీలు ఈ బ్యాడ్జ్‌లను రూపొందిస్తున్నాయి. 'ఉద్యోగులు పనిలో మరింత ఎంగేజ్ అయ్యేలా, స్ఫూర్తి నింపడంలో గేమిఫికేషన్ సమర్థ సాధనంగా మారుతోంది. ముఖ్యంగా ప్రస్తుత గ్లోబల్ కేపబిలిటీ ఎకోసిస్టమ్‌లో ఇది చాలా కీలకం. ఒకరినొకరు అభినందించుకోవడం, రివార్డులను షేర్ చేసుకోవడం వంటివి పరస్పర గౌరవాన్ని పెంచడంతో పాటు టీమ్‌లను బలోపేతం చేస్తుంది' అని ర్యాండ్‌స్టాడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా అభిప్రాయపడ్డారు.

- ఎప్సిలాన్ ఇండియా కొత్తగా 'పాస్‌పోర్ట్' ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఆఫీస్ సమావేశాల్లో పాల్గొన్న ప్రతిసారీ ఉద్యోగులకు 'స్టాంప్' పడుతుంది. సోషల్ మీడియాలో ప్రతిదీ షేర్ చేసుకోవాలని పరితపించే నవతరం ఉద్యోగులకు ఇది తెగ నచ్చేస్తోందట!
- రోష ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ 'అప్లాజ్' పేరుతో అంతర్గత స్టోర్ తెరిచింది. ఉద్యోగులకిచ్చే పాయింట్లను రిడీమ్ చేసుకొని ఇక్కడ హెడ్‌ఫోన్స్, టిక్కెట్ల వంటివి కొనుక్కోవచ్చు.
- కొత్త స్కిల్స్, బాధ్యతల్లో విజయాలకు ప్రతిగా టాలెంట్‌ను గుర్తించేందుకు ఇస్తున్న డిజిటల్ బ్యాడ్జ్‌లు (బెస్ట్ ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ వంటివి) కంపెనీల్లో బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి.
- మెర్క్ ఇండియా, ఆల్‌స్టేట్ ఇండియా, థ్రైవ్ డిజిటల్‌లీడర్‌షిప్ బోర్డులను అమలు చేస్తున్నాయి. సీనియారిటీతో సంబంధం లేకుండా సహోద్యోగులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసేందుకు ఇది తోడ్పడుతోంది.

సాక్షి స్పోర్ట్స్

డిక్‌వెల్లాపై సస్పెన్షన్ వేటు



కొలంబో: శ్రీలంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్‌వెల్లాపై సస్పెన్షన్ వేటు పడింది. లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) సందర్భంగా నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో విఫలమైనందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ) అతడిపై వేటు వేసింది. లీగ్‌లో గాలె మార్వెల్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న డిక్‌వెల్లాపై శుక్రవారం నుంచే నిషేధం అమల్లోకి వచ్చినట్లు ఎస్‌ఎల్‌సీ పేర్కొంది. డిక్‌వెల్లా జాతీయ జట్టు తరఫున 54 టెస్టులు, 55 వన్డేలు, 28 టీ20లు ఆడాడు.

భారత మహిళల 'ఎ' జట్టుకు మరో పరాజయం

మెక్‌కాయ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. టీ20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌లూ ఓడిన మన అమ్మాయిల జట్టు.. వన్డేల్లోనూ వరుసగా రెండో మ్యాచ్ ఓడి సిరీస్ కోల్పోయింది. శుక్రవారం రెండో వన్డేలో భారత మహిళల 'ఎ' జట్టు 8 వికెట్లతో ఓడింది. మొదట భారత్ 48 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ కాగా..ఛేదనలో ఆస్ట్రేలియా 40.2 ఓవర్లలో 2 వికెట్లకు 221 పరుగులు చేసింది.

'క్రీడా సంస్కృతి పెరగాలి'

పారిస్ ఒలింపిక్స్ చెఫ్ డి మిషన్ నారంగ్



పారిస్: దేశంలో క్రీడా సంస్కృతి పెరిగితేనే ప్రతిష్టాత్మక పోటీల్లో మరిన్ని పతకాలు సాధించవచ్చని.. పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల బృందానికి చెఫ్ డి మిషన్‌గా పనిచేసిన షూటర్ గగన్ నారంగ్ అన్నాడు. 'పారిస్' క్రీడల్లో మన అథ్లెట్ల ప్రదర్శనను అభినందించిన నారంగ్.. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మన ప్రాతినిధ్యం మరింత పెరగాలని ఆకాంక్షించాడు. 'తాజా ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు మంచి ప్రదర్శన కనబర్చారు. 6 పతకాలు వచ్చినందుకు సంతోషంగానే ఉన్నా.. మరిన్ని అవకాశాలు త్రుటిలో చేజారడం నిరాశ పర్చింది. ఒత్తిడిని జయిస్తే ఇంకొన్ని పతకాలు వచ్చేవి. ఇక మీదట దానిపై దృష్టిపెట్టాలి. దేశంలో క్రీడా సంస్కృతి మరింత పెంచాల్సిన అవసరముంది. అప్పుడే వచ్చే ఒలింపిక్స్‌లో మన ప్రాతినిధ్యం పెరిగి పతకాలు ఎక్కువ సాధించే అవకాశం ఉంటుంది. పరాజయాల నుంచి తిరిగి కోలుకొని సత్తాచాటడం ఎలా అనే అంశంలో మన అథ్లెట్లు రాటుదేలాలి. గతంతో పోలిస్తే దేశంలో క్రీడా మౌలిక వసతులు ఎంతగానో వృద్ధి చెందాయి' అని 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన నారంగ్ అన్నాడు.

దక్షిణాఫ్రికా ఆధిపత్యం



ప్రావిడెన్స్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. రెండో ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లలో వికెట్ నష్టానికి 93 పరుగులు చేసింది. దాంతో దక్షిణాఫ్రికా ఆధిక్యం 109 పరుగులకు చేరింది. టోనీ జోర్జి (39) రాణించాడు. అంతకు ముందు దక్షిణాఫ్రికాకు తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సఫారీ బౌలర్ల ధాటికి వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే ఆలౌటైంది. జేసన్ హోల్డర్ (88 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరిపోరాటం చేసి అర్ధసెంచరీ సాధించాడు. వియాన్ ముల్డర్ (4/32), బర్గర్ (3/49), కేశవ్ మహరాజ్ (2/8) విండీస్‌ను దెబ్బ తీశారు. దక్షిణాఫ్రికా కూడా తమ తొలి ఇన్నింగ్స్‌లో 97 పరుగుల వద్దే 9వ వికెట్ కోల్పోయినా...డీన్ పీట్ (38 నాటౌట్), బర్గర్ (23) కలిసి 63 పరుగుల చివరి వికెట్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు.



పారా అథ్లెట్లతో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా

పారాలింపిక్స్ సమయం

- పారిస్‌కు బయల్దేరిన భారత పారా అథ్లెట్లు
- 12 క్రీడాంశాల్లో 84 మంది పోటీ
- పతాకధారులుగా భాగ్యశ్రీ, సుమిత్



భాగ్యశ్రీ



సుమిత్

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో సత్తా చాటడమే లక్ష్యంగా భారత అథ్లెట్ల బృందం శుక్రవారం ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇటీవల పారిస్ వేదికగా ఒలింపిక్స్ ముగియగా.. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు అక్కడే పారాలింపిక్స్ జరగనున్నాయి. ఈ క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల్లో పాల్గొంటారు. విశ్వ క్రీడలకు బయలుదేరే ముందు భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల క్రితం టోక్యోలో జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 54 మంది బరిలోకి దిగి 19 పతకాలు (5 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలు) సాధించగా.. ఈసారి ఆ సంఖ్య మరింత పెరుగుతుందని భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా అన్నాడు. పారిస్ పారాలింపిక్స్‌లో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కనోయింగ్, సైక్లింగ్, బ్లైండ్ జూడో, పవర్ లిఫ్టింగ్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండోలో మన అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. 'ఎన్నో అటుపోట్లు ఎదుర్కొని మన పారా అథ్లెట్లు ఒలింపిక్స్ వరకు చేరుకున్నారు. 'పారిస్' పారాక్రీడల్లో సత్తా చాటి అధిక సంఖ్యలో పతకాలు సాధిస్తారనే నమ్మకముంది. ఈ బృందంలో చాలా మంది అథ్లెట్లు 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా లబ్ది పొందినవారే. అథ్లెట్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విశ్వక్రీడల్లో అధిక సంఖ్యలో పతకాలు సాధించి దేశ ఖ్యాతిని మరింత పెంపొందించాలి' అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా అన్నారు.

ఫ్లాగ్ బేరర్లుగా భాగ్యశ్రీ, సుమిత్

పారిస్ పారాలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాదవ్ భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. టోక్యో పారాలింపిక్స్ ఎఫ్64 విభాగంలో స్వర్ణం నెగ్గిన సుమిత్ అంటిల్.. గత ఏడాది ప్రపంచ పారా చాంపియన్‌షిప్‌లోనూ బంగారు పతకం సాధించాడు. మహిళల ఎఫ్34 కేటగిరీలో పోటీపడుతున్న భాగ్యశ్రీ ఆసియా పారా క్రీడల్లో రజతం సాధించింది. ఈ నేపథ్యంలో పీసీఐ అధ్యక్షుడు ఝఝారియా మాట్లాడుతూ.. 'విశ్వక్రీడల ఆరంభ వేడుకలో సుమిత్, భాగ్యశ్రీ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరిస్తారు. వీరిద్దరూ గత కొంతకాలంగా చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారు. టోక్యో పారాలింపిక్స్ కంటే ఎక్కువ పతకాలు సాధిస్తామనే నమ్మకముంది. అనేక క్రీడాంశాల్లో మన అథ్లెట్లు అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నారు. దాని వెనక వారి కఠోర శ్రమ, కృషి ఉంది. పారిస్ పారాలింపిక్స్‌లో దానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నాడు. ఈ క్రీడల్లో తెలంగాణ నుంచి మహిళల 400 మీటర్ల టి20 విభాగంలో జివాంజి దీప్తి పోటీపడనుంది.

భారత డేవిస్ కప్ జట్టులో నగాల్

- యూకీ బాంబ్రీ దూరం
- వచ్చేనెల 14, 15 తేదీల్లో స్వీడన్‌తో పోరు



న్యూఢిల్లీ: భారత సింగిల్స్ టాప్‌స్టార్ సుమిత్ నగాల్ తిరిగి డేవిస్ కప్ జట్టులోకి వచ్చేశాడు. వరల్డ్ గ్రూప్–1 పోరులో భాగంగా భారత్ వచ్చే నెల స్వీడన్‌తో తలపడనుంది. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో స్టాక్‌హోమ్‌లోని ఇండోర్ హార్డ్ కోర్ట్ వేదికపై జరిగే ఈ పోటీలకు డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ దూరమయ్యాడు. ఈ ఏడాది ఆరంభంలో నగాల్... ఇస్లామాబాద్‌లో పాకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్ పోరుకు దూరంగా ఉన్నాడు. అక్కడ గ్రాస్‌కోర్టుపై అనాసక్తి కనబరిచిన సుమిత్ ఇప్పుడు హార్డ్‌కోర్ట్‌లో జరిగే పోటీలకు అందుబాటులోకి వచ్చాడు. భారత టాప్–3 ప్లేయర్, ప్రపంచ 476 ర్యాంకర్ శశికుమార్ ముకుంద్‌పై రెండు 'టై'ల సస్పెన్షన్ ఉండటంతో అతన్ని ఎంపిక చేయలేదు. వరుసగా డేవిస్ కప్ టోర్నీలకు గైర్హాజరు అవుతుండటంతో అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం సమావేశమైన ఐటా సెలక్షన్ కమిటీ సుమిత్ నగాల్, రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పునాచా, సిద్ధార్థ్ విశ్వకర్మలను ఎంపిక చేసింది. రోహిత్ రాజ్‌పాల్ కెప్టెన్‌గా వ్యవహరించే ఈ జట్టుకు ఆర్యన్ షా రిజర్వ్ ప్లేయర్‌గా ఉంటాడు. యూకీ అందుబాటులో లేకపోవడంతో రామ్‌కుమార్ సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లోనూ బరిలోకి దిగుతాడు. యూకీ తన గైర్హాజరుకు గల కారణాలు బయటికి వెల్లడించనప్పటికీ... పారిస్ ఒలింపిక్స్‌కు రోహన్ బోపన్నకు జోడీగా తనను పంపకపోవడంపై కినుక వహించినట్లు తెలిసింది. అయితే ఇందులో 'ఐటా' చేసిందేమీ లేదని వెటరన్ స్టార్ బోపన్న తన భాగస్వామిగా శ్రీరామ్ బాలాజీని ఎంచుకోవడంతో అతన్నే పంపాల్సివచ్చిందని ఐటా వర్గాలు వెల్లడించాయి. జీషాన్ అలీ కోచ్ పదవి నుంచి తప్పుకోవడంతో మాజీ ఢిల్లీ ప్లేయర్ అశుతోశ్ సింగ్‌కు కోచింగ్ బాధ్యతలు అప్పగించే అవకాశముంది. బాలచంద్రన్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ ఐటా సెలక్షన్ కమిటీ అశుతోశ్ వైపు మొగ్గుచూపుతోంది. ప్రస్తుతానికి భారత డేవిస్ కప్ జట్టును ఎంపిక చేశామని కోచ్‌పై తుది నిర్ణయం తీసుకోలేదని ఐటా కార్యదర్శి అనిల్ ధూపర్ తెలిపారు.

ప్రొ కబడ్డీ లీగ్‌లో 118 మంది

- ముగిసిన వేలం ప్రక్రియ
- రెండో రోజు అత్యధికంగా అజిత్‌కు రూ.66 లక్షలు



ముంబై: రెండు రోజుల పాటు జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆటగాళ్ల వేలంపాట ముగిసింది. మొత్తం 118 మంది ఆటగాళ్లు ఈ వేలంలో అమ్ముడుపోగా... తొలిరోజు రూ.2 కోట్లయినా వెచ్చించేందుకు వెనుకాడని ఫ్రాంచైజీలు రెండో రోజు మాత్రం పెద్దగా ఎగబడలేదు. శుక్రవారం 'సి', 'డి' కేటగిరీ ఆటగాళ్ల వేలం నిర్వహించగా ఏ ఒక్కరు రూ. కోటి దాకా వెళ్లలేకపోయారు. రెయిడర్ అజిత్ కుమార్‌కు అత్యధికంగా రూ. 66 లక్షలు దక్కాయి. రెండో రోజు వేలంలో ఇదే పెద్ద మొత్తం కాగా, పుణేరి పల్టన్ ఆ రెయిడర్‌ను దక్కించుకుంది. జై భగవాన్‌ను రూ. 63 లక్షలకు బెంగళూరు బుల్స్ కొనుగోలు చేసింది. వీరిద్దరితో పాటు 'సి' కేటగిరీలో మరో ఇద్దరు రూ.అరకోటి మార్క్ దాటారు. ఆల్‌రౌండర్ గుర్‌దీప్‌ను రూ. 59 లక్షలకు, డిఫెండర్ దీపక్ రాజేందర్ సింగ్‌ను రూ. 50 లక్షలకు పట్నా పైరేట్స్ పైరేట్స్ కొనుక్కుంది. 'డి' కేటగిరీ ఆటగాళ్ల జాబితాలో రెయిడర్ అర్జున్ రాఠికి అత్యధికంగా రూ.41 లక్షలు లభించాయి. బెంగాల్ వారియర్స్ అతన్ని చేజిక్కించుకోగా, ఆ తర్వాత ఇంకెవరూ ఈ జాబితాలో కనీసం రూ.20 లక్షలైనా పొందలేకపోయారు. డిఫెండర్ మొహ్మద్ అమన్‌ను రూ.16.20 లక్షలకు పుణేరి పల్టన్, రెయిడర్ స్టువర్ట్ సింగ్‌ను రూ.14.20 లక్షలకు యు ముంబా జట్లు తీసుకున్నాయి. మొత్తం మీద ప్రొ కబడ్డీ లీగ్ చరిత్రలో 11వ సీజన్ కోసం నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో ఇద్దరు ప్లేయర్లు సచిన్ (రూ.2.15 కోట్లు; తమిళ్ తలైవాస్), మొహమ్మద్ రెజా (రూ.2.07 కోట్లు; హరియాణా) రెండు కోట్లపైచిలుకు అమ్ముడయ్యారు. ఆరు మందికి రూ.కోటికి పైగా మొత్తం లభించింది. ఇక 12 ఫ్రాంచైజీల్లో ఆటగాళ్ల కోసం అత్యధికంగా హరియాణా స్టీలర్స్ ఫ్రాంచైజీ దాదాపు రూ. ఐదు కోట్లు (రూ.4.99 కోట్లు) ఖర్చు చేసింది.

హైదరాబాద్‌లో మోస్ట్ వాంటెడ్!



నిఘాకు చిక్కకుండా 6 నెలలు గడిపిన ఉగ్రవాది రిజ్వాన్

- నగరానికే చెందిన మరో ఉగ్రవాది ఫర్హాతుల్లా ఘోరీతో సంప్రదింపులు
- ఐసిస్‌లో కీలక పాత్ర.. ఏడాదిగా మోస్ట్ వాంటెడ్
- పసిగట్టలేకపోయిన ఇక్కడి ఇంటెలిజెన్స్ వర్గాలు
- ఇటీవల ఢిల్లీ స్పెషల్ సెల్‌కు చిక్కిన ఉగ్రవాది రిజ్వాన్
- అరెస్టు విషయం తెలిసి హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ టెర్రరిస్ట్ రిజ్వాన్ అలీ.. యువతను 'ఉగ్ర' బాట పట్టించడంలో దిట్ట.. పరారీలో ఉన్న అతడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ.3 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. ఇన్నాళ్లూ తప్పించుకు తిరిగిన రిజ్వాన్‌ను.. గత శుక్రవారం ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అక్కడి ఫరీదాబాద్ సరిహద్దుల్లో పట్టుకున్నారు. అతడిని ప్రశ్నించినప్పుడు బయటికొచ్చిన రెండు అంశాలు కలకలం రేపుతున్నాయి. రిజ్వాన్ కొన్నాళ్లు హైదరాబాద్‌లో తలదాచుకున్నాడనేది ఒకటైతే.. సుదీర్ఘకాలం నుంచి పరారీలో ఉన్న గజ ఉగ్రవాది, హైదరాబాద్‌కే చెందిన ఫర్హాతుల్లా ఘోరీతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ ఉన్నాడనేది రెండో అంశం. రాష్ట్ర నిఘా విభాగానికి చెంప పెట్టులాంటి ఈ రెండు అంశాలు తెలిసిన వెంటనే ఇక్కడి నుంచి ఓ ప్రత్యేక బృందం హుటాహుటిన ఢిల్లీ వెళ్లింది.


ఘోరీ

6 నెలలు హైదరాబాద్‌లోనే..

ఢిల్లీకి చెందిన రిజ్వాన్ అలీ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 2015–16లో ఆన్‌లైన్ ద్వారా ప్రేరణ పొంది ఐసిస్ బాటపట్టాడు. జార్ఖండ్ నుంచి వచ్చి ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో స్థిరపడిన షానవాజ్‌తో కలసి ఉగ్రవాద కార్యకలాపాలు ప్రారంభించాడు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్రల్లో ఐసిస్ మాడ్యూల్ విస్తరణతోపాటు నిధుల సమీకరణకు పనిచేశాడు. చాలా మంది యువతను ఆన్‌లైన్ ద్వారా ఆకర్షించి ఉగ్రవాద బాటపట్టించాడు. 2023 జూన్‌లో పుణే అధికారులు షానవాజ్ నేతృత్వంలోని ఈ మాడ్యూల్ గుట్టురట్టు చేసి.. పలువురిని అరెస్టు చేశారు. దీంతో రిజ్వాన్ అజ్ఞాతంలోకి వెళ్లి ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ ప్రాంతంలో తలదాచుకున్నాడు. అతడిని మోస్ట్ వాంటెడ్‌గా గుర్తించిన ఎన్ఐఏ.. పట్టిస్తే రూ.3 లక్షల రివార్డు ఇస్తామని కూడా ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో రిజ్వాన్ కదలికలను గుర్తించిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు.. సంభాల్‌లోని ఓ స్థావరంపై దాడి చేశారు. కానీ త్రుటిలో తప్పించుకున్న రిజ్వాన్.. హైదరాబాద్‌కు మకాం మార్చాడు. మారుపేరుతో సికింద్రాబాద్ ప్రాంతంలో దాదాపు ఆరు నెలల పాటు నివసించాడు. తర్వాత కేరళ వెళ్లాడు. స్వాతంత్ర్య దిన వేడుకల నేపథ్యంలో విధ్వంసాలకు పథకం వేసి ఢిల్లీ వెళ్లాడు. ఈ క్రమంలోనే ఢిల్లీ–ఫరీదాబాద్ సరిహద్దుల్లో స్పెషల్ సెల్ పోలీసులకు దొరికిపోయాడు. వారు అతడి నుంచి తుపాకీ, తూటాలు స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో బయటపడిన కీలక అంశాలు

రిజ్వాన్‌ను విచారించిన సమయంలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కీలక అంశాలను గుర్తించారు. హైదరాబాద్‌లోని కుర్మగూడ ప్రాంతానికి చెందిన గజ ఉగ్రవాది ఫర్హాతుల్లా ఘోరీతో రిజ్వాన్ క్రమం తప్పకుండా సంప్రదింపులు జరిపినట్టు తేల్చారు. ఘోరీ తాజా ఫొటోను సైతం రిజ్వాన్ ఫోన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల తయారీలో నిపుణుడైన రిజ్వాన్ దేశంలోని వివిధ నగరాలను టార్గెట్‌గా చేసుకున్నట్టు గుర్తించారు. ఫర్హాతుల్లా ఘోరీతో సంప్రదింపులు, హైదరాబాద్‌లో ఆరు నెలల పాటు ఉండటం నేపథ్యంలో.. ఘోరీ ద్వారానే ఇక్కడ ఆశ్రయం పొందినట్టు భావిస్తున్నారు.

రిజ్వాన్‌ను విచారించేందుకు..

రిజ్వాన్‌ను విచారిస్తే హైదరాబాద్‌లో ఎవరి ద్వారా, ఎప్పుడు ఆశ్రయం పొందాడో, ఎవరెవరిని కలిశాడో తెలుస్తుందని.. ప్రస్తుతం ఘోరీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని రాష్ట్ర పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు రిజ్వాన్‌ను విచారించడంతోపాటు ఢిల్లీ స్పెషల్ సెల్ నుంచి సమాచారం తీసుకోవడం కోసం రాష్ట్రం నుంచి ఓ ప్రత్యేక బృందం ఢిల్లీ వెళ్లింది. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ పోలీసులు త్వరలో హైదరాబాద్ రానున్నట్లు తెలిసింది. మరికొన్ని అరెస్టులు చోటు చేసుకునే అవకాశం ఉందని సమాచారం. ఆరు నెలల పాటు నగరంలో తలదాచుకున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది కదలికలను రాష్ట్ర నిఘా విభాగాలు కనిపెట్టలేకపోవడం వైఫల్యంగానే ఉన్నతాధికారులు పరిగణిస్తున్నట్టు తెలిసింది. ఈ అంశంపై లోతుగా అంతర్గత సమీక్ష చేపట్టినట్టు సమాచారం.

క్లుప్తంగా...

కన్హాను సందర్శించిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్


విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్

సాక్షి, హైదరాబాద్/నందిగామ: రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కన్హాలో ఆయన ధ్యానం చేసినట్లు తెలిసింది. శుక్రవారం రాత్రి ఇక్కడే బస చేసి.. శనివారం ఏపీలోని నెల్లూరులో నిర్వహించనున్న కార్యక్రమానికి ఆయన హాజరవుతారని సమాచారం. ఉప రాష్ట్రపతి రాక సందర్భంగా శాంతివనం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇది ప్రైవేటు కార్యక్రమమని నిర్వాహకులు తెలిపారు. కాగా, అంతకుముందు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుదేష్ ధన్‌ఖడ్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గవర్నర్ జిష్ణుదేవ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

తిరుమలలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు జరిపారు. సంపంగి ప్రాకారంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీవారి మూలవర్లు, ఉత్సవ మూర్తులు, జయవిజయులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి, వకుళమాత, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులు, యోగనరసింహస్వామి, భాష్యకారులు, పోటు తాయారు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామి, శ్రీబేడి ఆంజనేయస్వామికి పవిత్ర మాలలు సమర్పించారు.

వారాంతాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్-సికింద్రాబాద్ (07175/07176) ప్రత్యేక రైలు ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 5 గంటలకు నర్సాపూర్‌కు చేరుకుంటుంది. కాకినాడ-సికింద్రాబాద్ (07177/07178) ఈనెల 17, 19 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయల్దేరి 18, 20 తేదీల్లో ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18, 20 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి 19, 21 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

ది గ్రేట్ ఇండియన్ స్పెక్టికల్‌తో టైటాన్ ఐప్లస్ ఆఫర్లు

సాక్షి, హైదరాబాద్: 'ది గ్రేట్ ఇండియన్ స్పెక్టికల్'పేరుతో ప్రముఖ కళ్లజోడుల సంస్థ టైటాన్ ఐ ప్లస్ వినియోగదారులకు మంచి ఆఫర్లు ప్రకటించింది. ఈనెల 14 నుంచి 19 వరకు కళ్లజోడుల ఫ్రేమ్‌ల ఎంపిక, కళ్లజోడుల కొనుగోలుపై 25% తగ్గింపును ప్రకటించింది. పిల్లల నుంచి అత్యాధునిక ప్రోగ్రెసివ్ లెన్స్‌ల వరకు కళ్లజోడులను ఎంచుకునేవారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని టైటాన్ ఐ ప్లస్ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. కారెరా, వోగ్, జిస్‌వంటి అంతర్జాతీయ బ్రాండ్ల లగ్జరీ కళ్ల జోడులపై 20%, టైటాన్ కళ్లజోడులపై 25% తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలకు దగ్గరలోని టైటాన్ ఐ ప్లస్ స్టోర్‌ను లేదా www.titaneyplus.comను గానీ సంప్రదించవచ్చని పేర్కొంది.

మత్తు వదిలిస్తున్నారు



డీ- అడిక్షన్ సెంటర్లకు పెరుగుతున్న రోగుల సంఖ్య

- డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసలైన వారికి డీ-అడిక్షన్ చికిత్సలు
- ఇప్పటికే ఉన్న 16 కేంద్రాల్లో పనిచేస్తున్నవి 11 మాత్రమే..
- ఇటీవలే మరో 26 కొత్త డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మత్తుపదార్థాలు రవాణా చేసే ముఠాలను కట్టడి చేయడంతోపాటు మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారిని అందులోంచి బయటపడేసే వ్యూహంతో ముందుకు వెళితేనే మత్తు మహమ్మారిని తరిమికొట్టడం సాధ్యమవుతుందని నిపుణులు చెపుతున్నారు. మద్యం, కల్తీకల్లు, గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిసలైన వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేసేందుకు ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ సెంటర్లకు రోగుల సంఖ్య ఇటీవల పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. గతానికి భిన్నంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల గురించి అవగాహన పెరుగుతుండటంతో డీ–అడిక్షన్ సెంటర్లలో చేరే రోగుల సంఖ్యా పెరుగుతోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా డీ–అడిక్షన్ సెంటర్ల పనితీరును టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు ఇటీవలే పరిశీలించి ఓ నివేదికను తయారు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 16 డీ–అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తుండగా.. ఐదు సెంటర్లు పూర్తిగా మూతపడినట్టు అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా డీ–అడిక్షన్‌కు ప్రాధాన్యం పెరగడంతో నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 26 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ సెంటర్లను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిల్లో కనీసం 10 చొప్పున బెడ్లు అందుబాటులోకి తెచ్చారు.


మద్యం బానిసలే ఎక్కువ..

డీ–అడిక్షన్ సెంటర్లలో చేరుతున్న రోగులలో ఎక్కువ మంది మద్యానికి బానిసలైన వారే ఉంటున్నారు. తర్వాత పెద్ద సంఖ్యలో గంజాయి బానిసలు ఉంటున్నారు. 2019 నుంచి ఈ ఏడాది ఆగస్టు 12 వరకు డీ–అడిక్షన్ సెంటర్లలో చేరిన రోగుల సంఖ్య ఆధారంగా చూస్తే.. హనుమకొండలోని డీ–అడిక్షన్ కేంద్రంలో 1,067 మంది మద్యానికి బానిసలైన వారుండగా, గంజాయి రోగులు 344 మంది ఉన్నారు. ఆదిలాబాద్ సెంటర్‌లో 781 మంది మద్యానికి బానిసలైన వారు చేరగా.. 53 మంది గంజాయి బాధితులు ఉన్నారు. ఎల్బీనగర్‌లోని సెంటర్‌లో 933 మంది మద్యానికి బానిసలైన రోగులు, 39 మంది గంజాయికి బానిసలైన రోగులున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 850 మంది మద్యం బానిసలు, 30 మంది గంజాయికి బానిసలైన రోగులు ఉన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని సెంటర్‌లో 722 మంది మద్యానికి బానిసలైన వారు.. 24 మంది గంజాయికి అలవాటుపడిన వారున్నారు. ఖమ్మం జిల్లా మధిర సెంటర్‌లో 427 మంది రోగులు మద్యానికి బానిసలైన వారుండగా, 23 మంది గంజాయి నుంచి డీ–అడిక్షన్ కోసం చేరారు.



డీ-అడిక్షన్ సెంటర్లు అంటే..?

మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు బానిసలైన వారికి ఆ వ్యసనం నుంచి బయటపడేందుకు అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించి వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా మార్చే కేంద్రాలను డీ-అడిక్షన్ సెంటర్లుగా వ్యవహరిస్తారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్ఏపీడీడీఆర్) పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రులలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.



డ్రగ్స్ దందాలో రాజస్తాన్ వ్యాపారులు

రూ.4.34 కోట్ల విలువైన హెరాయిన్ పేస్ట్ స్వాధీనం

- ముగ్గురు పెడ్లర్స్, ఐదుగురు వినియోగదారుల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు సవర్‌ఝుట్.. కేసు వివరాలను వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్

గచ్చిబౌలి: నగరంలో స్థిరపడిన రాజస్తాన్‌కు చెందిన కొందరు వ్యాపారుల ద్వారా డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నారని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినీత్ ఆ కేసు వివరాలు వెల్లడించారు. ఘట్‌కేసర్‌కు చెందిన దినేశ్‌చౌదరి, మంగళారంచౌదరి హెరాయిన్ పేస్ట్ కోసం రాజస్తాన్‌కు చెందిన సవర్‌ఝుట్‌కు రూ.48 వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. ఈ నెల 7వ తేదీన రాజస్తాన్ నుంచి ఓ కారులో సైనిక్‌పురికి హెరాయిన్ పేస్ట్ తీసుకొచ్చారు. ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగరామ్, దినేశ్, గణేశ్‌లు రమేశ్‌చంద్, సురేశ్‌చంద్‌లను కలిశారు. హెరాయిన్ ఎలా విక్రయించాలో వివరించారు. ఆ తర్వాత మరో కారులో గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని ప్రకాశ్ లైట్‌హౌస్‌లో హెరాయిన్ పేస్ట్‌ను దాచేందుకు తీసుకొచ్చారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందడంలో ఎస్ఓటీ మాదాపూర్, రాయదుర్గం పోలీసులు 14న రాత్రి 11 గంటల సమయంలో లైట్‌హౌస్‌పై దాడి చేశారు. హెరాయిన్ పేస్ట్‌తోపాటు పెడ్లర్స్ మంగళారంచౌదరి, దినేశ్ చౌదరి, గణేశ్ చౌదరిలతోపాటు వినియోగదారులు నితిన్‌గుర్జార్, ప్రకాశ్ లైట్‌హౌస్ యజమాని ప్రకాశ్ చౌదరితోపాటు అమీన్‌పూర్‌కు చెందిన జైవత్రం వసనారం దేవసి, సైనిక్‌పురికి చెందిన ప్రకాశ్ చౌదరి, భువనగిరికి చెందిన బానారాం చౌదరిలను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు సవర్‌ఝుట్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.4.34 కోట్ల విలువైన హెరాయిన్ పేస్ట్, రెండు కార్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులకు మెడికల్ టెస్టులు నిర్వహించగా అందరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని పోలీసులు పేర్కొన్నారు. ప్రకాశ్ లైట్‌హౌస్ యజమాని మధ్యప్రదేశ్‌లోని ఓ పీఎస్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఓ కేసులో నిందితుడిగా ఉన్నాడు. రాజస్తాన్‌కు చెందిన ప్రధాన పెడ్లర్ సవర్‌ఝుట్ ఎక్కడి నుంచి హెరాయిన్ తీసుకొస్తున్నారనే విషయంపై దర్యాప్తు కొనసాగిస్తామని డీసీపీ తెలిపారు. నగరంలో స్థిరపడిన రాజస్తాన్‌కు చెందిన వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. డ్రగ్ సరఫరా చేసినా, కొనుగోలు చేసినా, వాడుతున్నట్టు తెలిసినా డయల్ 100, 9490617444 ఫోన్‌నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీలు జయరాం, శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

డ్రగ్స్ విక్రయించే రాజస్తానీ అరెస్ట్

- 8 గ్రాములు హెరాయిన్, 34 గ్రాములు ఓపీఎం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్

మాదకద్రవ్యాలు విక్రయించే ఓ రాజస్తానీ వ్యక్తిని అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్పీ సంజీవరావు ఆ వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ రాధమ్మ కాలనీలో మాదకద్రవ్యాలు నిల్వ ఉన్నాయనే సమాచారం మేరకు టీనాబ్, ఎస్ఓటీ, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా ఓ ఇంటిపై దాడులు చేశారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజస్తాన్‌కు చెందిన రెయిలింగ్ పనులు పనిచేసే బుధారామ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీడీఎల్‌లో ఉంటున్న చిన్నాన్న కొడుకు కోశాలరామ్ డ్రగ్స్ తక్కువ ధరకు తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేవాడని, తొలుత తమకు అలవాటు అయ్యిందని, ఆ తర్వాత వ్యాపారంగా మార్చుకున్నట్టు నిందితుడు తెలిపాడు. అతని నుంచి 8 గ్రాములు హెరాయిన్, 34 గ్రాములు ఓపీఎం, సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

అప్పు చెల్లించడం లేదని...

అన్నా వదినను కట్టేసిన తమ్ముడు, మరదలు.. ముగ్గురిపై కేసు నమోదు


భార్యాభర్తలను తాడుతో కట్టేసిన దృశ్యం

సిద్దిపేట కమాన్: అప్పు చెల్లించడం లేదని అన్నా, వదినను.. ఓ ప్రబుద్ధుడు తన భార్య, కొడుకుతో కలిసి గ్రిల్స్‌కు కట్టేశాడు. సిద్దిపేటలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. దొంతరబోయిన పర్శరాములు, తార దంపతులు ఏడో తరగతి చదివే తమ కుమార్తెతో సిద్దిపేట కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్నారు. పర్శరాములు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అవసరాల నిమిత్తం నాసర్‌పూరలో నివసిస్తున్న సొంత తమ్ముడు దొంతరబోయిన కనకయ్య వద్ద 8 నెలల క్రితం రూ.1.20 లక్షలు అప్పు తీసుకున్నాడు. నాలుగు నెలల క్రితం రూ.లక్ష తిరిగి చెల్లించాడు. ఈ క్రమంలో శుక్రవారం కౌన్సిలర్ కనకరాజు.. పర్శరాములుకు ఫోన్ చేసి డబ్బుల వివాదంపై మాట్లాడేందుకు తన ఇంటికి రమ్మన్నాడు. దీంతో పర్శరాములు తన భార్య తారతో కలిసి నాసర్‌పూరకు వచ్చారు. అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో కనకరాజు ఆగ్రహం వ్యక్తం చేసి వారిద్దరిని బయటకు పంపించారు. బకాయి ఉన్న రూ.20వేలు, వడ్డీ డబ్బులు చెల్లించాలని తమ్ముడు కనకయ్య, అతడి భార్య భాగ్య, వీరి కుమారుడు భాను కలసి.. పర్శరాములు, అతని భార్య తారను కొట్టి నాసర్‌పూర హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉన్న గ్రిల్స్‌కు తాడుతో కట్టేశారు. స్థానికులు కల్పించుకుని వారిని విడిపించడంతో బాధితులు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు


ముగిసిన పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా ముగిశాయి. ఈ నెల 14వ తేదీన పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. చివరి రోజు ఉదయం ప్రాకార మండపంలోని యజ్ఞశాలలో హోమాది పూజలు జరిపించి, మహా పూర్ణాహుతి గావించారు. అనంతరం స్వయంభువులు, ఉత్సవమూర్తులు, ఆళ్వారులకు పవిత్ర మాలలను ధరింపజేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు రద్దు చేసిన శ్రీసుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం పూజలను శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



పెంట బొంద పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో అపరిశుభ్రంపై 'పెను సంక్షోభంలో పట్టుగొమ్ము'లు శీర్షికతో ఈ నెల 12న సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కమలాపూర్ బాలికల ఉన్నత పాఠశాల వెనకాల రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంటి ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కలెక్టర్ ప్రావీణ్య.. డీపీవో లక్ష్మీరమాకాంత్‌ను ఆదేశించారు. డీపీవో ఆదేశాల మేరకు గ్రామ ప్రత్యేకాధికారి గుండె బాబు, పంచాయతీ కార్యదర్శి కోరండ్ల రమణారెడ్డి.. ఆ ఇంటి యజమాని కాల్వ పర్వతాలుకు నోటీసులు జారీ చేశారు. పెంట బొందలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొరం పోయించి పూడ్చి వేయించారు.


సుద్దవాగు దాటుతూ...


అంగన్‌వాడీ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వాగులు దాటి.. కాలినడకన చేరి

కన్నాయిగూడెం: ఆమె అదనపు కలెక్టర్. గ్రామ సమస్యలు తెలుసుకునేందుకు కాలినడకన వాగులు దాటారు. పన్నెండు కిలోమీటర్లు బైక్‌పై, మధ్యమధ్యలో కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. ఆదివాసీలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ గ్రామానికి బయల్దేరారు. మండలంలోని సర్వాయి వరకు వాహనంలో వెళ్లారు. అనంతరం అక్కడినుంచి ఐలాపూర్ వరకు 12 కిలోమీటర్ల మేర మధ్యలోని దట్టమైన అడవి.. అక్కడక్కడ ఉన్న వాగులు దాటారు. ఆదివాసీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

చిట్టితల్లి చేతికి చితికుండ

- తండ్రికి తలకొరివి పెట్టిన ఆరేళ్ల కూతురు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆరేళ్ల ప్రాయం.. లోకమేమిటో తెలియని చిన్నారి.. చితి కుండ పట్టుకుంది. తండ్రికి తలకొరివి పెట్టింది. వివరాలివి. మండల కేంద్రమైన మిరుదొడ్డికి చెందిన బోయిని నాగరాజు (28) గురువారం గుండె పోటుతో మృతి చెందాడు. అతనికి భార్య నవ్య, ఆరేళ్ల కూతురు శివాని ఉన్నారు. కొడుకుల్లేక పోవడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో కూతురు శివాని తలకొరివి పెట్టింది. తండ్రి శవయాత్రలో చితికుండతో నడుస్తున్న ఆమెను చూసినవారు కంటతడి పెట్టారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.